





www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 334


## ఎల్‌పీజీ పరిస్థితి ఆందోళనకరమే!

2

కానీ.. డిస్ట్రిబ్యూటర్ల వద్ద నిల్వలు అయిపోలేదు



దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిలో 40 శాతానికిపైగా పెరుగుదల

కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడి

యుద్ధం ముందటి స్థాయికి గృహావసర గ్యాస్ బుకింగ్‌లు


శుక్రవారం | 20-3-2026

పేజీలు: 14

శ్రీ పరాభవనామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా.2:31 తదుపరి తదియ; నక్షత్రం: రేవతి రా.2:28 తదుపరి అశ్వని; వర్జ్యం: మ.3:16-4:46; దుర్ముహూర్తం: ఉ.8:46-9:34, పునః మ.12:46-1:34; అమృతఘడియలు: రా.12:13-1:43; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 6:23; సూర్యాస్తమయం: 6:22

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


## ఎవరి పంచాంగం వారిదే!

### ఈ ఏడాది సీఎంకు తిరుగులేదు



సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ఏడాది రాజయోగం బలంగా ఉంది. రాజకీయ అడ్డంకులను, ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో పటాపంచలు చేస్తారు. శత్రువులపై పైచేయి సాధిస్తారు. సీఎం తీసుకునే కొన్ని సంచలన నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తును మారుస్తాయి. ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు, అంతర్గత కలహాలు సృష్టించే శక్తులు చురుగ్గా ఉంటాయి. సీఎం తన బృందాన్ని(మంత్రులు, అధికారులను) సమన్వయం చేసుకోవడంలో అప్రమత్తంగా ఉండాలి. ఈ ఏడాది రేవంత్ రెడ్డి జాతీయ స్థాయిలో గుర్తింపు, గౌరవం పొందుతారు.

9

- సిద్ధాంతి బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి

### ప్రతిపక్షం బలపడే అవకాశం

ప్రభుత్వంలో ఉన్న లోటుపాట్లతోపాటు పాలనా వైఫల్యాలు కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, ఈ ఏడాది ప్రతిపక్షానికి గణనీయంగా బలం చేకూరే అవకాశం ఉంది. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్ఎస్ ఎదిగే పరిస్థితులు ఏర్పడతాయి. విద్యావిధానంలో జరుగుతున్న మార్పులు... విద్యార్థులకు నష్టం కలిగిస్తాయి. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోతే నిరుద్యోగం మరింత పెరిగిపోతుంది.

9

- వేద పండితులు మృత్యుంజయశర్మ, ఫణీంద్రశర్మ



9

### గ్యాస్ ధరలు ఇప్పట్లో పెరగవు

ప్రపంచ వ్యాప్తంగా యుద్ధమేఘాలు కమ్ముకున్నా భారత్‌లో గ్యాస్ సిలిండర్ ధరలు పెరగలేదు.. ఇప్పట్లో పెరగబోవు.. భవిష్యత్తులో ఏం జరగబోతుందో ముందే ఊహించే దృక్పథం ఉన్న, దూరదృష్టి కలిగిన మోదీ నాయకత్వమే ఇందుకు కారణం. కుజుడు మంత్రి కావడం వల్ల, ఏ దేశం కూడా మనవైపు రాకుండా రక్షణ మంత్రి కాపాడతారు. సనాతన ధర్మాన్ని గౌరవించే ఏకైక పార్టీ బీజేపీ. సానుకూల ఆలోచన ఎలా ఉండాలో ఆ పార్టీ సూచిస్తుంది.

- పంచాంగకర్త కె.సూర్యనారాయణ మూర్తి

# పశ్చిమాసియా భగ్గు

## చమురు, గ్యాస్ క్షేత్రాలపై పరస్పర దాడులు



ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడిలో తగలబడుతున్న ఖతార్ రస్ లఫాన్ పారిశ్రామిక నగరంలోని సహజవాయు క్షేత్రం, రిఫైనరీ

- ఇరాన్ సౌత్‌పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయెల్ దాడి
- ప్రతీకారంగా ఖతార్‌లోని రస్ లఫాన్‌లో ఇరాన్ విధ్వంసం
- దెబ్బతిన్న ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ రిఫైనరీ
- సౌదీ, యూఏఈ, కువైట్ చమురు క్షేత్రాలపైనా దాడులు
- ఆపకుంటే మేమూ యుద్ధంలోకి వస్తాం.. సౌదీ హెచ్చరిక
- సౌత్‌పార్స్‌పై ఇజ్రాయెల్ దాడి విషయం నాకు తెలియదు
- ఇరాన్ వెనక్కు తగ్గకుంటే నాశనం చేస్తాం: ట్రంప్
- హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు మేం సాయం చేస్తాం
- జపాన్‌తోపాటు పలు యూరప్ దేశాల వెల్లడి
- దాడులతో నిలిచిపోయిన గ్యాస్, చమురు ఉత్పత్తి
- భారత్ సహా ప్రపంచ దేశాలపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ, మార్చి 19: పశ్చిమాసియా తగలబడుతోంది. మూడు వారాలుగా సాగుతున్న ఇరాన్- అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధంలో తాజాగా ఇరుపక్షాలు పరస్పరం అత్యంత కీలకమైన చమురు, సహజవాయు క్షేత్రాలు, రిఫైనరీలు, ఇతర ఇంధన మౌలిక వసతులపై భీకర దాడులు మొదలుపెట్టాయి. దీంతో ప్రపంచాన్ని చమురు, గ్యాస్ ధరల మంటలు చుట్టుముట్టాయి. ఇరాన్‌కు వెన్నెముక వంటి సౌత్‌పార్స్ సహజ వాయు క్షేత్రంపై ఇజ్రాయెల్ బుధవారం క్షిపణి దాడులు చేయటంతో ఇరాన్ ప్రతీకారంతో చెలరేగిపోయింది. పొరుగున ఉన్న ఖతార్‌కు జీవనాడి వంటి రస్ లఫాన్ పారిశ్రామిక

మిగతా 2వ పేజీలో...

### రంగంలోకి అమెరికా సైన్యం!

2

- 'హోర్ముజ్' వద్ద బాహాబాహీకి సిద్ధమవుతున్న ట్రంప్
- ఇరాన్ తీరంలో మోహరింపు
- ఖర్గ్ ద్వీపం ముట్టడికి ప్రణాళిక
- వారిస్తున్న మిలిటరీ అధికారులు
- 'రాయిటర్స్' కథనంలో వెల్లడి

### యుద్ధం కొనసాగించాలంటే.. రూ.18.6 లక్షల కోట్లు కావాల్సిందే

2

వైట్‌హౌస్‌ను కోరిన అమెరికా రక్షణ శాఖ.. కాంగ్రెస్ ఆమోదించేలా చూడాలని అభ్యర్థన

### క్రూడ్ సుడిలో మార్కెట్ మునక

11

- సెన్సెక్స్ 2,497 పాయింట్లు పతనం
- రూ.12.87 లక్షల కోట్ల సంపద బుగ్గి



హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో 'గద్దర్ ఫిల్మ్ అవార్డులు-2025' ప్రదానోత్సవంలో కమల్‌హాసన్, చిరంజీవితో సీఎం రేవంత్‌రెడ్డి సంభాషణ

# సినీ హబ్‌గా హైదరాబాద్!

- భారతీయ సినిమా అంటేనే తెలుగు సినిమా
- సినీ పరిశ్రమకు ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణలు.. నాలుగు మినార్‌లు!
- ప్రభాకర్‌రెడ్డి 'కార్మిక బంధు'గా నిలిచారు
- ఐటీ, ఫార్మా మాదిరిగా సినీ పరిశ్రమనూ గుర్తించాం
- అందుకే నిలిచిపోయిన నంది అవార్డులను గద్దర్ పేరుతో పునరుద్ధరించాం
- కథతో హైదరాబాద్‌కు వచ్చి రీల్‌తో వెళ్లొచ్చు
- సినిమా అంటే రెండువైపులా పదునున్న ఆయుధం
- దాన్ని సమాజహితానికే ఉపయోగించండి
- డ్రగ్స్‌పై పోరులో సహకరించండి
- తెలంగాణ కంటే సురక్షిత ప్రాంతం మరొకటి లేదు
- గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): "భారతీయ సినిమా అంటేనే తెలుగు సినిమా అని, దానికి అసలైన వేదిక హైదరాబాద్" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ అంటే కేవలం ఐటీ, ఫార్మా పరిశ్రమలకు, హైదరాబాద్ బిర్యానీకి మాత్రమే గుర్తింపు కాదని.. జాతీయ స్థాయిలో సినీ పరిశ్రమకు వేదికగా రాణించాలని తమ ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులు-2025 ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. చెన్నైలో ఉన్న సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి రావడానికి ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణ

మిగతా 13వ పేజీలో...

### ఇది రైతు నామ సంవత్సరం

13

- రైతు బాగుంటేనే సుఖశాంతులతో రాష్ట్రం
- ఉగాది వేడుకల్లో సీఎం

### నేడే కొత్త పద్దు

- అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సర్కారు
- రూ. 3.35 లక్షల కోట్లకు పైగా పద్దు ఉండే చాన్స్
- మండలి విప్‌లుగా అద్దంకి, బల్మూరి

13



### డాడీ.. మోడీ.. చిన్న మోడీపైనే నా పోరాటం

- బీఆర్ఎస్‌తో నా విభేదాల్ని రేవంత్ రెడ్డి అవకాశంగా చేసుకుంటున్నారు

12

- త్వరలో కొత్త పార్టీ: కవిత
- 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీపై త్వరగా తేల్చండి
- ఈసీకి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

### పెంపుడు పిల్లి మరణం తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో ఘటన

12






# అయ్యో.. రామచంద్రా..!

- సీతారాముల గోత్రం, ప్రవర మార్చేశారు!
- దశరథరాముణ్ని రామనారాయణుడు అంటున్నారు!
- భద్రాచలం రాములోరిపై తెగని పంచాయితీ
- ఈ వివాదంపై 2022లో హైకోర్టులో పిటిషన్
- ఐదుగురు పండితులతో కమిటీ వేసిన కోర్టు
- 2024లో దేవాదాయ శాఖకు నివేదిక సమర్పణ
- ఇప్పటికీ కోర్టుకు సమర్పించకపోవడంపై ధిక్కరణ పిటిషన్.. కమిషనర్‌కు నోటీసులు
- ఈ నెల 23న హైకోర్టులో విచారణ
- ఈసారైనా 'సీతారాముల కల్యాణం' జరిపించాలి
- వనం జ్వాలా నరసింహారావు





హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రిలో కొలువై ఉన్నది దశరథ తనయుడైన శ్రీరామచంద్రుడా? లేక వైకుంఠం నుంచి నేరుగా దిగివచ్చిన వైకుంఠ రామనారాయణుడా? అన్న వివాదం ఎప్పుడు తేలుతుందా అని భక్తులు నిరీక్షిస్తున్నారు. ఈ అంశంపై హైకోర్టు ఐదుగురు పండితులతో వేసిన కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. అది హైకోర్టుకు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు విచారణ ఈ నెల 23న జరగనుండడంతోపాటు 27న భద్రాద్రి రామయ్య కల్యాణం ఉన్న నేపథ్యంలో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2012 వరకు భద్రాచలంలో ఉన్నది దశరథ తనయుడు శ్రీరామచంద్రుడుగానే అన్ని కార్యక్రమాలు నడిచాయి. శ్రీరాముని గోత్రం వశిష్ట. సీతా దేవిది గౌతమస గోత్రం. కానీ, 2012 నుంచి అక్కడ ఉన్నది దశరథ పుత్రుడు కాదని.. ఆయన రామనారాయణుడని అంటూ గోత్రం, ప్రవరలను మార్చి చదువుతున్నారు. రాముడి గోత్రంగా నారాయణుడి గోత్రమైన అచ్యుత గోత్రాన్ని.. ప్రవరగా ఆదినారాయణాయ, నిరాకార, సాకార అంటూ ఆది దేవుడి పేరిట చెబుతున్నారు. సీతాదేవి గోత్రం

మిగతా 9వ పేజీలో...



# దుబాయి, ఢిల్లీకి సిట్?

- ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో ఆర్థిక వ్యవహారాలపై కూపీ
- గతంలో దుబాయిలో మరణించిన కేదార్‌తో నిందితులకు సన్నిహిత సంబంధాలపై ఆరా
- రోహిత్, రితేశ్, నమిత్ శర్మ కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

మొయినాబాద్ ఫాంహౌస్‌లో కాల్పులు, డ్రగ్స్ కేసు విచారణకు ఏర్పాటైన సిట్.. ఉగాది రోజున కూడా తన విచారణ కొనసాగించింది. ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేస్తున్న సిట్.. కాల్పులు, డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్న వారి వ్యాపారాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా సిట్ బృందాలు త్వరలో ఢిల్లీ, దుబాయి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వెనుక దుబాయి ఆస్తుల పంచాయితీ ఉందనే ప్రచారం సాగుతోంది. టాలీవుడ్ నిర్మాత, దుబాయిలో పలు వ్యాపారాలు చేసిన సెలగంశెట్టి కేదార్ కొంతకాలం క్రితం దుబాయ్‌లో

మిగతా 12వ పేజీలో...

# ట్రయల్ కోర్టు జడ్జి పరిధి దాటారా? లేదా?

- ఆయన వ్యాఖ్యలపై తేల్చాల్సి ఉంది
- ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ స్వర్ణకాంత శర్మ
- మా వాదన వినకుండానే ఆ వ్యాఖ్యలా?
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అభ్యంతరం
- 600 పేజీల తీర్పు కాపీ చదవాలి
- సమయం కావాలన్న నిందితులు
- కేజ్రీవాల్, కవిత తదితరులకు నోటీసులు
- తదుపరి విచారణ ఏప్రిల్ 2కు వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో ట్రయల్ కోర్టు వ్యాఖ్యలపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీవ్రంగా స్పందించారు. న్యాయమూర్తి తన పరిధిని దాటారా? లేదా? అనేది తేల్చాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. దర్యాప్తు సంస్థల తీరును తప్పుబడుతూ ట్రయల్

మిగతా 14వ పేజీలో...



# పడమటి పరిణయ రాగం

## అమెరికాలో మోగుతున్న భారతీయ పెళ్లి బాజాలు

- ట్రంప్ వలస విధానాల దెబ్బతో వివాహం కోసం భారత్‌కు వెళ్లేందుకు భయపడుతున్న ఎన్నారైలు
- ఇండియాకి వెళ్లి రావడానికి అయ్యే ఖర్చులతోనే పరిమిత హంగులతో యూఎస్ గడ్డపై వివాహాలు
- ఫంక్షన్‌హాల్ వ్యాపారంలోకీ మనోళ్ల ప్రవేశం
- రాంచ్‌హౌస్‌లను కొని పెళ్లి వేదికలుగా అద్దెకు..
- పురోహితులు, ఫొటోగ్రాఫర్లకు పెరిగిన గిరాకీ
- వేదిక, క్యాటరింగ్, మేకప్ వారికి కూడా..

ప్రతి సంక్షోభం ఒక కొత్త అవకాశానికి దారి తీస్తుంది! ఇది చరిత్ర చెప్పే సత్యం!! అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పగ్గాలు చేపట్టిన ట్రంప్ అనే పెను సంక్షోభం.. ఆ దేశంలో స్థిరపడ్డ మనోళ్ల ఆలోచన ధోరణిని మార్చడమే కాక, కొత్త ఉపాధి అవకాశాలకు దారులు తెరవడం ఇందుకు తాజా ఉదాహరణ. ఉద్యోగరీత్యా అమెరికాలో ఉండే భారతీయులు ఒకప్పుడు పెళ్లి చేసుకోవాలంటే.. ఇండియాకు వెళ్లి అక్కడే బంధుమిత్రుల సందడి నడుమ ఆ తంతు ముగించుకుని తిరిగొచ్చేవారు. కానీ.. ట్రంప్ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. స్వదేశానికి వెళ్లి అక్కడ అయిన వాళ్లందరి నడుమ ఆర్భాటంగా పెళ్లి చేసుకోవాలనే కలలు ఎన్ని ఉన్నప్పటికీ.. వాటికి కత్తెర వేసుకోవాల్సి వస్తోంది. ట్రంప్ సర్కారు

మిగతా 14వ పేజీలో...

## సమాచార దిగ్బంధం.. ఆఫ్‌లైన్‌లోకి ఇరాన్

- 99% మంది పౌరులు ఇంటర్నెట్‌కు దూరం
- ఫిబ్రవరి చివరి నుంచి నిలిచిపోయిన సేవలు
- అనధికారిక నెట్‌వర్క్‌లకు మళ్లుతున్న ప్రజలు

న్యూఢిల్లీ, మార్చి 19: యుద్ధ ప్రభావంతో ఇరాన్ ఆఫ్‌లైన్‌లోకి వెళ్లిపోయింది. బాంబుల వర్షంతో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నవేళ ఆ దేశానికి చెందిన లక్షలాది మంది పౌరులు మరో తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నారు. సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేతతో వారంతా ప్రపంచానికి దూరమయ్యారు. సుదూర ప్రాంతాల్లో ఉంటున్న తమ కుటుంబ సభ్యులు, ఆప్తులను సంప్రదించడం వారికి అసాధ్యంగా మారింది. సమాచార ధ్రువీకరణలో మీడియా ప్రతినిధులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వారాల తరబడి కొనసాగుతున్న ఈ పరిస్థితి సమాచార నియంత్రణ, భద్రత, సెన్సార్‌షిప్‌పై ఆందోళనలను రేకెత్తిస్తోంది. హ్యూమన్ రైట్స్ వాచ్ తదితర పర్యవేక్షక సంస్థల నివేదికల ప్రకారం.. సాధారణ స్థాయితో పోలిస్తే ఇరాన్‌లో ఇంటర్నెట్ కనెక్టివిటీ 1 నుంచి 4 శాతానికి పడిపోయింది. ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన వెంటనే బ్లాక్‌అవుట్ ప్రారంభమైంది. అప్పటినుంచి దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. దాదాపు 99శాతం మంది ఇరాన్ పౌరులకు ఇంటర్నెట్ సదుపాయం సక్రమంగా అందడంలేదని విశ్లేషకులు చెబుతున్నారు. సున్నితమైన సమాచారం బయటకు పొక్కకుండా నిరోధించడం, నిరసనకారుల మధ్య సమన్వయాన్ని అడ్డుకోవడం, యుద్ధ సమయంలో సమాచార ప్రవాహాన్ని నియంత్రించడం వంటి లక్ష్యాలతోనే ప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకుంటోందని న్యూయార్క్ టైమ్స్, గార్డియన్ నివేదికలు పేర్కొంటున్నాయి. వ్యతిరేక స్వరాలను అణచివేయడానికి, అసమ్మతిని కప్పిపుచ్చేందుకు ఇంటర్నెట్ సేవల నిలిపివేతను ఇరాన్ ప్రభుత్వం ఒక సాధనంగా వినియోగించడాన్ని ఒక సంప్రదాయంగా పాటిస్తోందని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే భద్రతా కారణాలరీత్యానే ఈ చర్య తీసుకున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. మరోవైపు ఇంటర్నెట్ సేవల కోసం కొంతమంది ఇరాన్ పౌరులు ఉపగ్రహ ఇంటర్నెట్ పరికరాలను ఉపయోగిస్తున్నారని తెలుస్తోంది. అయితే వీటిలో చాలావరకూ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## ఎర్రసముద్రం నుంచి గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వెనక్కి!

- మరమ్మతుల కోసం క్రెటెలోని యూఎస్ నేవీ స్థావరానికి..

న్యూఢిల్లీ, మార్చి 19: ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఎర్రసముద్రం నుంచి వెనుదిరిగింది. ఈ నౌకలో ఇటీవల మంటలు చెలరేగిన నేపథ్యంలో మరమ్మతుల నిమిత్తం గ్రీస్‌కు ప్రయాణించనుంది. క్రెటె ద్వీపంలోని యూఎస్ నేవీ స్థావరానికి దీనిని తరలించనున్నట్లు అమెరికా అధికారులు తెలిపారు. వారం క్రితం గెరాల్డ్‌లోని ప్రధాన లాండ్రీలో మంటలు ఎగసిపడిన ఘటనలో ముగ్గురు నావికులకు గాయాలయ్యాయి. 600 మందికి పైగా నావికులు, సిబ్బంది పడకలు అగ్నికి ఆహుతయ్యాయి. అయితే నౌకలోని ప్రొపల్షన్ ప్లాంట్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, విమాన వాహక నౌక పూర్తిస్థాయిలో పనిచేస్తోందని సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఘటన జరిగిన సమయంలో నౌకలో 4,500 మంది సిబ్బంది ఉన్నారు.

## ఆ 22 నౌకలొస్తే ఇంధన కష్టాలు తీరినట్లే!

న్యూఢిల్లీ, మార్చి 19: హోర్ముజ్ జలసంధిలో చిక్కుకున్న ఆ 22 నౌకలు దేశంలోకి వస్తే వాటిలోని 2.15లక్షల టన్నుల లిక్విడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ), 3.21లక్షల టన్నుల లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ), 16.76 లక్షల టన్నుల ముడిచమురు ఇక్కడకు చేరుకుంటే... దేశంలో ఇంధన కష్టాలు దాదాపుగా తీరినట్లే. మన దేశానికి ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ, ముడి చమురు తరలిస్తున్న స్వదేశీ, విదేశాలకు చెందిన 22 నౌకలు హోర్ముజ్ జలసంధిలో చిక్కుకుపోయి ఉన్నాయి. ఈ నౌకలే ఇప్పుడు భారత ఇంధన భద్రతకు ఎంతో కీలకమైనవిగా కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. వీటిని హోర్ముజ్ జలసంధి నుంచి సురక్షితంగా తీసుకురావడానికి షిప్పింగ్, నౌకాయాన శాఖ, డైరక్టరేట్ ఆఫ్ నావల్, పెట్రోలియం, సహజవాయువు శాఖ తదితర విభాగాలు సంయుక్తంగా సంప్రదింపులు జరుపుతున్నాయి.

## ఉద్రిక్తతల తగ్గింపునకు చర్చలు, దౌత్యమే మార్గం

- పశ్చిమాసియా పరిస్థితిపై పలు దేశాల నేతలతో మోదీ చర్చలు

న్యూఢిల్లీ, మార్చి 19: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంపై ప్రధాని నరేంద్ర మోదీ గురువారం వివిధ దేశాల నేతలతో చర్చలు జరిపారు. యుద్ధం విస్తృతి ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఆయన జరిపిన ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉద్రిక్తతల తగ్గింపునకు చర్చలు, దౌత్యమే మార్గమని మరోసారి నొక్కి చెప్పారు. ఈ విషయాలను ఆయన ఎక్స్ ద్వారా తెలిపారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు, ఒమన్ సుల్తాన్, యూఏఈ అధ్యక్షుడు, జోర్డాన్ రాజు, మలేసియా ప్రధానిలతో ఆయన మాట్లాడారు. "నా ప్రియమైన మిత్రుడు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్‌తో మాట్లాడాను. పశ్చిమాసియాలో చాలా అత్యవసరంగా ఉద్రిక్తతలు తగ్గాల్సిన అవసరం ఉంది. సంప్రదింపులు, దౌత్యమే ఇందుకు మార్గమ"ని మోదీ పేర్కొన్నారు. ఒమన్ దేశ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్ అల్ సయీద్‌తో చర్చలు జరిపారు. ఒమన్ దేశ ప్రజలకు ముందస్తుగా ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. 'నా సోదరుడు సుల్తాన్‌తో మాట్లాడినట్టు' మోదీ పేర్కొన్నారు. ఒమన్ సార్వభౌమ అధికారం, ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగిస్తున్న చర్యలను ఖండించారు. శాంతి, సుస్థిరతలను పునరుద్ధరించాల్సి ఉందని పేర్కొన్నారు. వేలాది మంది భారతీయులను సురక్షితంగా తిప్పి పంపించేందుకు ఆ దేశం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. కువైత్ క్రౌన్ ప్రిన్స్, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జయేద్ అల్ నహ్యాన్‌తోనూ సంప్రదింపులు జరిపారు. శాంతి, సుస్థిరత సాధనకు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. ఇంధనవనరులపై దాడులను ఖండించారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతోనూ చర్చలు జరిపారు.

## 1000 కోట్ల యుద్ధ ముప్పు నిధి ఏర్పాటు!

- పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి19: అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో వాణిజ్య రంగంపై తీవ్ర ప్రభావం పడింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవడంతో హోర్ముజ్ వంటి ప్రమాదకర జలాల గుండా రాకపోకలు సాగించే నౌకలకు రక్షణ అందించే బీమా సంస్థలు భయపడుతున్నాయి. ఈ క్రమంలో బీమా సంస్థలకు అండగా నిలవాలని భారత్ భావిస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా రూ.1000 కోట్లమేర యుద్ధ ముప్పు నిధిని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్న ఈ ప్రతిపాదన.. బీమా లభ్యతలో పెరుగుతున్న అంతరాన్ని తగ్గించనుంది.

## గేట్-2026 ఫలితాల విడుదల

- ఫిబ్రవరిలో జరిగిన పరీక్షల ఫలితాలను
- వెల్లడించిన ఐఐటీ గువాహటి
- అభ్యర్థులు 27 నుంచి స్కోర్‌కార్డుల డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

న్యూఢిల్లీ, మార్చి 19: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) 2026 ఫలితాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 7, 8, 14, 15 తేదీల్లో గేట్ పరీక్షలు జరిగాయి. ఐఐటీ గువాహటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలను గురువారం వెల్లడించారు. దీంతో లక్షలాది మంది ఇంజనీరింగ్ అభ్యర్థుల ఉత్కంఠకు తెరదించినట్లయింది. అభ్యర్థులు జీవోఏపీఎస్ పోర్టల్‌లో లాగిన్ అయి, వారు సాధించిన మార్కులు, ఆలిండియా ర్యాంకు, వారికి సంబంధించిన పేపర్‌లో అర్హత స్థితిని తెలుసుకోవచ్చు. స్కోర్ కార్డులు ఈ నెల 27 నుంచి అందుబాటులో ఉంటాయని.. అర్హత సాధించిన అభ్యర్థులు నిర్దేశిత గడువులోపు తమ స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని పరీక్ష నిర్వాహకులు తెలిపారు. గేట్-2026 స్కోర్ కార్డులు మూడేళ్ల పాటు చెల్లుబాటు అవుతాయి. వాటి ఆధారంగా అభ్యర్థులు పీజీ ప్రవేశాలు, ఉద్యోగ దరఖాస్తులు చేసుకోవచ్చు. గేట్‌లో సాధించిన స్కోరు ఆధారంగా ప్రభుత్వరంగ సంస్థలు ఇంజనీరింగ్ అభ్యర్థులను కొలువులకు ఎంపిక చేసుకుంటాయి.

# పశ్చిమాసియా భగ్గు



(మొదటిపేజీ తరువాయి)

నగరంలోని సహజవాయు క్షేత్రం, రిఫైనరీపై క్షిపణులు, డ్రోన్లతో గురువారం విరుచుకుపడింది. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద సహజవాయు (ఎల్ఎన్‌జీ) సరఫరాదారు అయిన ఈ క్షేత్రం తీవ్రంగా దెబ్బతిన్నది. మరోవైపు ఎర్ర సముద్రం ఒడ్డున ఉన్న సౌదీ అరేబియాకు చెందిన కీలకమైన సామ్‌రెఫ్ రిఫైనరీపై కూడా ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. ఇటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని చమురు మౌలిక వసతులపై దాడులు కొనసాగించింది. ఈ దాడులు ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించాయి. అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. చమురు, గ్యాస్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉండటంతో ఆర్థిక వ్యవస్థల్లో వణుకు మొదలైంది. దీని ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడే అవకాశం ఉంది. భారత్ తన ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో 40 శాతం ఖతార్ నుంచే తెచ్చుకుంటోంది. పర్షియన్ గల్ఫ్‌లో ప్రస్తుతం దాదాపు 700 నౌకలు చిక్కుకుపోయాయి. గురువారం యూఏఈ, ఖతార్ తీరాల్లో నిలిపి ఉంచిన రెండు నౌకలపై కూడా దాడి జరిగింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణి వెస్ట్‌బ్యాంక్‌లో పడటంతో ముగ్గురు పాలస్తీనా మహిళలు మరణించారు.

### మేమూ యుద్ధంలోకి దిగుతాం: సౌదీ

ఇరాన్ తరచూ తమదేశంపై దాడులు చేస్తుండటంతో సౌదీ అరేబియా గురువారం తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. దాడులు ఆపకుంటే తాము కూడా యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని సౌదీ విదేశాంగమంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్ గురువారం హెచ్చరించారు. సహనానికి కూడా హద్దు ఉంటుందని స్పష్టంచేశారు. రియాద్ నగరం, ఇతర చమురు రిఫైనరీలపై ఇరాన్ ప్రయోగించిన 5 బాలిస్టిక్ క్షిపణులను కూల్చివేసినట్లు పేర్కొన్నారు. ఒకవేళ సౌదీ కనుక యుద్ధంలో అడుగుపెడితే.. ఆ దేశంతో రక్షణ ఒప్పందం ఉన్న పాకిస్థాన్ కూడా సౌదీకి రక్షణగా యుద్ధంలోకి దిగాల్సి ఉంటుంది. కాగా, ఖతార్, యూఏఈ కూడా ఇరాన్‌కు హెచ్చరికలు జారీచేశాయి. తమదేశంలోని ఇరాన్ రాయబారులు 24 గంటల్లోగా దేశం విడిచి వెళ్లాలని ఖతార్ గురువారం ఆదేశించింది.

### దాడులు జరిగింది వీటిపైనే...

#### 1. రస్ లఫాన్

ఈ గ్యాస్ క్షేత్రం ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్ఎన్‌జీ ఉత్పత్తిదారు. దీనిని ఖతార్ ఎనర్జీ సంస్థ నిర్వహిస్తోంది. రస్ లఫాన్ ప్రపంచంలో అతిపెద్ద పారిశ్రామిక నగరాల్లో ఒకటి కూడా. ఇరాన్‌కు చెందిన సౌత్ పార్స్, ఈ రస్ లఫాన్ ఒకే గ్యాస్ ఫీల్డ్‌లో ఉన్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో ఉత్తరం వైపు ఉన్న క్షేత్రాన్ని రస్ లఫాన్ అని పిలుస్తారు. ఇది ఖతార్‌కు చెందినది. దక్షిణం వైపు ఉన్న క్షేత్రాన్ని సౌత్‌పార్స్ అని పిలుస్తారు. ఇది ఇరాన్‌కు చెందినది. ఇక్కడ 1970ల్లో గ్యాస్ నిక్షేపాలను కనుగొన్నారు. దీనిని ఇరుదేశాలు పంచుకుంటున్నాయి. రస్ లఫాన్ పేరుతో ఖతార్ 20 ఏళ్లలోనే అతిపెద్ద పారిశ్రామిక నగరాన్ని అభివృద్ధి చేసింది. ఇక్కడి నుంచి ఎల్ఎన్‌జీ 30 దేశాలకు ఎగుమతి అవుతోంది. భారత్ కూడా తన అవసరాల్లో ఎక్కువ భాగం ఎల్ఎన్‌జీని ఇక్కడి నుంచే దిగుమతి చేసుకుంటోంది. ఇక్కడ ముడి గ్యాస్‌ను ప్రాసెస్ చేసి, ఏటా 77 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీని ఎగుమతి చేస్తున్నారు. దీనిపై ఇరాన్ దాడి చేయటంతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ క్షేత్రం తీవ్రంగా దెబ్బతిన్నదని, ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేశామని ఖతార్ ప్రకటించింది.

#### 2. సౌత్‌పార్స్

ఇది ఇరాన్‌కు అత్యంత కీలక గ్యాస్ క్షేత్రం. దీనిపై ఇజ్రాయెల్ బుధవారం దాడులు చేయటంతో మంటల్లో చిక్కుకుంది. దీంతో ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇక్కడ ఇరాన్ రోజుకు 730 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను వెలికితీస్తోంది. అయితే, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా అందులో 70 శాతాన్ని ఆ దేశమే వాడుకుంటోంది.

#### 3. ఖార్గ్ ద్వీపం

ఇరాన్‌కు చెందిన దాదాపు 90 శాతం ముడి చమురు ఈ ద్వీపం నుంచే ఇతర దేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ ద్వీపంపై ఇజ్రాయెల్, అమెరికా కొద్దిరోజుల క్రితం వైమానిక దాడులు చేశాయి.

#### 4. రువాయిస్ రిఫైనరీ

అబుదాబీ సమీపంలో ఉన్న ఈ చమురు శుద్ధి కేంద్రంపై ఇరాన్ డ్రోన్ దాడులకు పాల్పడింది. దీంతో ఇక్కడ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపేశారు.

#### 5. రస్ తనూరా, సామ్‌రెఫ్ రిఫైనరీలు

సౌదీ అరేబియాకు చెందిన ఈ రిఫైనరీపై ఇరాన్ తాజాగా డ్రోన్ దాడులకు పాల్పడింది. దీంతో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపేశారు. సామ్‌రెఫ్ పశ్చిమాసియాలో అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటి. ఎర్రసముద్రం ఒడ్డున యాన్‌బు పోర్టు వద్ద ఇది ఉంది. దాడిలో రిఫైనరీకి వాటిల్లిన ప్రమాదాన్ని అంచనా వేస్తున్నామని సౌదీ ప్రభుత్వం ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయటంతో సౌదీ అరేబియా తన ముడి చమురును మొత్తం పైపుల ద్వారా యాన్‌బు పోర్టుకు తరలిస్తోంది. తాజాగా దానిపై కూడా దాడి జరగటంతో ఆందోళన నెలకొంది.

#### 6. కువైట్ మినా రిఫైనరీలు

తమ మినా అబ్దుల్లా చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి జరిగిందని కువైట్ గురువారం ప్రకటించింది. దానికి సమీపంలోనే ఉన్న మినా అల్ అహ్మదీ రిఫైనరీపై కూడా ఇటీవల దాడి జరిగింది. డ్రోన్ దాడిలో రిఫైనరీల్లో భారీగా మంటలు చెలరేగాయి. మినా అబ్దుల్లా రిఫైనరీలో రోజుకు 7,30,000 బ్యారెళ్ల పెట్రోలియం ఉత్పత్తులను తయారుచేస్తారు. అబుదాబీలోని హబ్‌షాన్, బాబ్ రిఫైనరీలను కూడా మూసివేసినట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది.

### ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేస్తాం: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి తీవ్రంగా హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేస్తామని, ఇందుకు ఆ మార్గంపై ఆధారపడిన దేశాల సహకారం కూడా తమకు అవసరం లేదని గురువారం ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ఖతార్‌పై దాడులు ఆపకుంటే సౌత్‌పార్స్ గ్యాస్ క్షేత్రాన్ని పూర్తిగా పేల్చివేస్తామని హెచ్చరించారు. ఈ గ్యాస్ ఫీల్డ్‌పై బుధవారం ఇజ్రాయెల్ దాడి చేసిన విషయం తనకు తెలియదని పేర్కొన్నారు. కాగా, ఇరాన్‌పై గతంలో ఎన్నడూ చూడనంత తీవ్రంగా దాడి చేస్తామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ హెచ్చరించారు. ఇదిలా ఉండగా హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు తాము సహాయం చేస్తామని బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, నెదర్లాండ్స్, జపాన్ ప్రకటించాయి. చమురు మౌలిక సదుపాయాలపై ఇరాన్ దాడులను తీవ్రంగా ఖండించాయి.

### లోకం తీరు




## రంగంలోకి అమెరికా సైన్యం!

- ఇరాన్ తీరంలో మోహరింపు
- 'రాయిటర్స్' కథనంలో వెల్లడి

వాషింగ్టన్, మార్చి 19: చమురు క్షేత్రాలపై పరస్పర దాడులతో ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం మరో దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో.. పశ్చిమాసియాలోకి భారీగా అదనపు బలగాలను దింపాలనే నిర్ణయానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వచ్చినట్టు తెలిసింది. 90% చమురు నిల్వలను కలిగిన ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపంపైనా సైనిక ముట్టడి జరిపే అంశంపై ఉన్నత స్థాయిలో చర్చలు జరిపినట్లు ఉన్నతాధికార వర్గాలను ఉటంకిస్తూ ప్రపంచ వార్తా సంస్థ 'రాయిటర్స్' కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని అనుసరించి, యుద్ధం మూడో వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను భారీగా విస్తరించాలని ట్రంప్ నిర్ణయించారు. హోర్ముజ్ జలసంధి వద్ద పరిస్థితిని మామూలు స్థితికి తీసుకురావాలని ఆయన కోరుకుంటున్నారు. చమురు సమృద్ధ ఖర్గ్ ద్వీపంపై అదనపు బలగాలతో దాడులు పెంచాలనేది ట్రంప్ లక్ష్యం. అయితే, ఇది రిస్క్‌తో కూడిన ఆపరేషన్ అవుతుందని ట్రంప్‌కు ఉన్నతాధికారులు నివేదించారు.

### ఇరాన్ అగ్ర నేతలను లక్ష్యం చేసుకోవడం సరికాదన్న చైనా

బీజింగ్, మార్చి 19: ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారీజాని, నిఘా శాఖ మంత్రి ఇస్మాయెల్ ఖతీబ్, బసిజ్ ఫోర్స్ చీఫ్ గులామ్‌రజా సులేమానీ తదితర అగ్ర నాయకులను ఇజ్రాయెల్ అంతం చేయడంపై చైనా తొలిసారి స్పందించింది. నాయకుల హత్యలను చైనా ప్రభుత్వం ఖండించింది. ఈ తరహా హంతక దాడులు క్షంతవ్యం కాదని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ హెచ్చరించారు.



## పొంచి ఉన్న ఇంటర్నెట్ సంక్షోభం!

- హోర్ముజ్ జలసంధి, ఎర్రసముద్రం గర్భంలో 21 ఫైబర్ ఆప్టిక్ కేబుల్ వ్యవస్థలు

వాషింగ్టన్, మార్చి 19: ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధంతో ఇప్పటికే ప్రపంచంలో చమురు, వంటగ్యాస్ సంక్షోభం నెలకొంది. దీనికి తోడుగా ఇంటర్నెట్ సంక్షోభమూ ముంచుకొచ్చే ప్రమాదం పొంచి ఉందని రక్షణరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంటర్నెట్‌లో సమాచార బదిలీకి అవసరమైన ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లు సముద్రగర్భం గుండా ప్రపంచమంతటా వేల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వీటి నుంచే ఈ మెయిళ్లు, వీడియోకాల్స్, బ్యాంకింగ్ లావాదేవీలు, ఏఐ సర్వీసులు వంటి సమస్తం నడుస్తుంటాయి. డిజిటల్ ప్రపంచానికి ఇవి రక్తనాళాల వంటివి. ఈ కేబుళ్లలో కొంత భాగం.. హోర్ముజ్ జలసంధి, ఎర్రసముద్రంలోనూ ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండూ పశ్చిమాసియా యుద్ధంలో కీలక ప్రాంతాలుగా మారిన విషయం తెలిసిందే. ఇరాన్ తన సమీపంలోని హోర్ముజ్ జలసంధిని దాదాపుగా మూసివేసి, తనకు అనుకూల దేశాల నౌకలను మాత్రమే ఆ మార్గంలో వెళ్లటానికి అనుమతిస్తోంది. ఇక ఎర్రసముద్రంలోని బాబ్ ఎల్ మండెబ్ ప్రాంతం యెమెన్‌లోని ఇరాన్ అనుకూల హౌతీ సాయుధ గ్రూపుల పరిధిలో ఉంది. యుద్ధం రోజురోజుకీ తీవ్రమవుతున్న ప్రస్తుత తరుణంలో.. ఈ రెండు ప్రాంతాల్లో సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ కేబుళ్లను ఇరాన్ సైన్యం, హౌతీలు ధ్వంసం చేస్తే.. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవల మీద ప్రతికూల ప్రభావం పడుతుంది.

### నిలిచిపోయిన కేబుళ్ల మరమ్మతులు

ఎర్ర సముద్రంలో కనీసం 21 సంస్థల కేబుల్ వ్యవస్థలు ఉన్నాయని 'కెపాసిటీ గ్లోబల్', 'టెలిజాగ్రఫీ' వంటి అంతర్జాతీయ టెలికం, డాటాసెంటర్ వెబ్‌సైట్లు వెల్లడించాయి. యూరప్, ఆసియా, ఆఫ్రికా దేశాల ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు ఇవి అత్యంత కీలకమైనవి. ఇక హోర్ముజ్ జలసంధిలో టాటా-టీజీఎన్ గల్ఫ్ సంస్థతో పాటు మరో మూడు సంస్థల కేబుళ్లున్నాయి. టాటా-టీజీఎన్ గల్ఫ్ కేబుళ్లు ముంబైని గల్ఫ్‌తో అనుసంధానిస్తాయి. వీటిలో ఎలాంటి అంతరాయం తలెత్తినా.. భారత్‌తోపాటు పలు దేశాల వ్యవస్థల మీద ప్రభావం పడుతుంది. ప్రస్తుతం కేబుళ్లలో తలెత్తే మరమ్మతులు, నిర్వహణ వంటి ప్రక్రియలు కూడా నిలిచిపోయాయి. మరమ్మతులు చేపట్టటానికి నిపుణులు నౌకల్లో ఆయా కేబుళ్ల వద్దకువెళ్లి వాటిని సరిచేస్తుంటారు. ప్రస్తుతం ఇరాన్.. హోర్ముజ్ జలసంధిలో అనేక చోట్ల సముద్ర మందుపాతరలను అమర్చింది. దీంతో అటువైపు మరమ్మతుల నౌకలు వెళ్లే పరిస్థితి లేదని టెలి జియాగ్రఫీకి చెందిన అలెన్ మౌల్డిన్ వెల్లడించారు.

## యుద్ధం కొనసాగించాలంటే.. 18.6 లక్షల కోట్లు కావాల్సిందే!

- వైట్‌హౌస్‌ను కోరిన అమెరికా రక్షణ శాఖ



వాషింగ్టన్, మార్చి 19: పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ఆగే పరిస్థితులు కనిపించడం లేదు. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధానికి దిగిన అమెరికా.. అందుకు భారీఎత్తున ఖర్చు పెడుతోంది. ఇరాన్‌పై దాడులకు ఇప్పటికే వందల కోట్ల డాలర్లు ఆవిరయ్యాయి. యుద్ధాన్ని కొనసాగించేందుకు అగ్రరాజ్యం ప్రణాళికలు వేసుకుంటోంది. పశ్చిమాసియా రీజియన్‌లో మరిన్ని బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతున్న క్రమంలో 20 వేల కోట్ల డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.18.6 లక్షల కోట్లు) నిధులు ఇవ్వాలని, దీన్ని కాంగ్రెస్ ఆమోదించేలా చూడాలని అమెరికా రక్షణ శాఖ వైట్‌హౌస్‌ను కోరినట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనికి వైట్‌హౌస్ స్పందన తెలియరాలేదు. అయితే రక్షణ శాఖ అభ్యర్థనను కాంగ్రెస్ తిరస్కరించే అవకాశం ఉన్నట్లు ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగం భావిస్తోందని, యుద్ధాన్ని ప్రారంభించడంపై డెమొక్రాట్లు ఇప్పటికే ట్రంప్‌పై విమర్శలు చేస్తున్నారని మీడియా కథనాలు నివేదించాయి. ఇరాన్‌తో ఘర్షణ మొదలైన తర్వాత మొదటి 100 గంటల్లోనే 370 కోట్ల డాలర్ల మేర ఖర్చయిందని, మొత్తంగా మొదటి వారంలో అమెరికాకు 1,100 కోట్ల డాలర్లు వ్యయం అయినట్లు ఓ అధ్యయనం పేర్కొంది. ఈ నేపథ్యంలో రక్షణ శాఖ మరిన్ని నిధులు కావాలని అడగడం ద్వారా హోర్ముజ్ జలసంధిపై నియంత్రణ సాధించేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా, అందుకు దీర్ఘకాల యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. కాగా, పశ్చిమాసియాలో వేలాది మంది బలగాలను మోహరించేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతోందని రాయిటర్స్ నివేదిక ఇటీవల పేర్కొంది. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనాన్ని ఎత్తివేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు.

### 39 లక్షల కోట్ల డాలర్లకు అమెరికా అప్పు

మరోవైపు అమెరికా రుణ ఊబిలో కూరుకుపోతోంది. బుధవారం నాటికి దేశ అప్పులు రికార్డు స్థాయిలో 39 లక్షల కోట్ల డాలర్లను దాటాయి. గత ఏడు నెలల వ్యవధిలో 2 లక్షల కోట్ల డాలర్ల అప్పు అమెరికన్ల నెత్తిన పడింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైన మూడు వారాల్లోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. పెరుగుతున్న ప్రభుత్వ అప్పుల వల్ల అమెరికన్లపై పలు ప్రతికూల ప్రభావాలు పడుతాయని ప్రభుత్వ జవాబుదారీ కార్యాలయం వివరించింది. అందులో మోర్టగేజ్‌లు, కార్ల రుణాల వంటి వాటిపై అధిక వడ్డీ, పెట్టుబడి పెట్టడానికి వ్యాపారాలకు తక్కువ డబ్బు అందుబాటులో ఉండడం కారణంగా వేతనాలు తగ్గడంతో పాటు వస్తువులు, సేవల ధరలు పెరగడం వంటివి ఉన్నాయి. దీర్ఘకాలంలో మరిన్ని అప్పులు చేయడం, అధిక వడ్డీ చెల్లింపుల ధోరణి భవిష్యత్తులో అమెరికన్లను మరింత కఠిన ఆర్థిక సర్దుబాట్లకు బలవంతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పీటర్ జీ పీటర్‌సన్ ఫౌండేషన్ అనే ఎన్జీవో సంస్థ చైర్మన్, సీఈవో మిచెల్ పీటర్‌సన్ మాట్లాడుతూ.. తర్వాతి తరంపై వేస్తున్న ఆందోళనకరమైన అప్పుల భారాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా.. ట్రిలియన్ డాలర్ల కొద్దీ అప్పులు చేయడం నిలకడలేనితనానికి నిదర్శనమన్నారు. రిపబ్లికన్, డెమొక్రటిక్ రెండు పార్టీలకు చెందిన అధ్యక్షుల హయాంలో పెరుగుతూ వచ్చిన అప్పులు.. ఇటీవలి కాలంలో యుద్ధాలు, మహమ్మారిపై భారీస్థాయిలో వ్యయం, పన్ను కోతల కారణంగా మరింత పెరిగాయి.

## ఎల్‌పీజీ పరిస్థితి ఆందోళనకరమే!

- కానీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద నిల్వలు అయిపోలేదు
- కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ



న్యూఢిల్లీ, మార్చి 19: దేశంలో వంట గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు పశ్చిమాసియాలో యుద్ధానికి ముందున్న సాధారణ స్థాయిలకు చేరుకుంటున్నాయి. దీంతో పరిస్థితి క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో సరఫరాలో అంతరాయాల వల్ల హోటళ్లతోపాటు వాణిజ్య వినియోగదారులపై విధించిన పరిమితులు ఇంకా అమల్లో ఉండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. మరోవైపు ఆందోళనలతో చేసే గృహావసర వంట గ్యాస్ బుకింగ్‌లు తగ్గుముఖం పడుతున్నాయని పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ఎల్పీజీని గృహ వినియోగదారులకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఎల్‌పీజీ (సరఫరా) పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉందని, అయితే ఏ ఒక్క ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ వద్ద నిల్వలు పూర్తిగా అయిపోలేదని పేర్కొన్నారు. గత రెండు వారాల్లో దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతానికి పైగా పెరిగిందని తెలిపారు. ప్రభుత్వరంగంలోని మూడు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు యుద్ధానికి ముందున్న సాధారణ స్థాయిలోనే ఎల్‌పీజీ రీఫిల్ల డెలివరీలు చేస్తున్నాయన్నారు. కాగా, ఎల్‌పీజీ బుకింగ్‌లకు సంబంధించిన సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర ప్రభుత్వం గురువారం సూచించింది.

## పొరుగు దేశాలపై ఇరాన్ దాడులను ఆపాలి

- గల్ఫ్, ఇస్లామిక్ దేశాల డిమాండ్

రియాద్, మార్చి 19: పొరుగు దేశాలపై చేస్తోన్న దాడులను ఇరాన్ తక్షణమే ఆపాలని అరబ్, ఇస్లామిక్ దేశాలకు చెందిన పలువురు విదేశాంగ శాఖ మంత్రులు గురువారం డిమాండ్ చేశారు. అజర్‌బైజన్, బహ్రెయిన్, ఈజిప్ట్, జోర్డాన్, కువైట్, లెబనాన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, సిరియా, తుర్కియే, యూఏఈ దేశాల విదేశాంగ మంత్రులు రియాద్‌లో గురువారం సమావేశమయ్యారు. పొరుగున ఉన్న గల్ఫ్ దేశాల్లోని ఇంధన మౌలిక వసతుల, నివాస సముదాయాలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ ఈ సమావేశం అనంతరం ఓ ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఇరాన్ తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. యూఎన్ చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం తమని తాము రక్షించుకునే హక్కు ఆయా దేశాలకు ఉంటుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ ఇరాన్ ఇప్పటికైనా దాడులను ఆపాలని స్పష్టం చేశారు. అలాగే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తోన్న దాడులను కూడా ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఖండించారు. ఇరుదేశాలూ చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకొని, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడ్డారు.


ముస్లిం సోదరులకు రంజాన్ ఈద్ శుభాకాంక్షలు, రంజాన్ పండగ మరియు ఉగాది సందర్భంగా
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో
సోనోవిజన్
పండగ డిస్కౌంట్ సేల్
రంజాన్ ఈద్ శుభాకాంక్షలు
ఉగాది శుభాకాంక్షలు
పండగ సందర్భంగా ఆకర్షణీయమైన క్యాష్ బ్యాక్ ఆఫర్స్
Upto 31000/- క్యాష్‌బ్యాక్ HDB FINANCIAL SERVICES 1 EMI FREE
క్రెడిట్ కార్డ్ మరియు ఇతర ఫైనాన్స్ కొనుగోలుదారులకు, HDB ఫైనాన్స్ కొనుగోలుదారులకు
Upto 15000/- క్యాష్‌బ్యాక్ BAJAJ FINSERV 1 EMI FREE
బజాజ్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు, క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు
Upto 30000/- క్యాష్‌బ్యాక్ IDFC FIRST Bank 1 EMI FREE
క్రెడిట్ కార్డ్ మరియు ఇతర ఫైనాన్స్ కొనుగోలుదారులకు, IDFC ఫైనాన్స్ కొనుగోలుదారులకు
Upto 20% క్యాష్‌బ్యాక్ క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు
SBI HDFC BANK AXIS BANK kotak
Conditions Apply
మీకు తెలుసా, Bureau of Energy Efficiency (BEE) నిబంధనల ప్రకారం 2026 లో AC మోడల్స్ 2025 మోడల్స్ కన్నా ఎక్కువ ISEER కలిగి ఉండాలి,
మా దగ్గర Air Conditioners 2025 మోడల్స్‌తో పాటుగా 2026 మోడల్స్ కూడా లభిస్తున్నాయి. 2026 మోడల్స్ కొని కరెంట్ ఆదా చేయండి.
Air Conditioners
Festival SALE
LG 2025 Model 2026 Model
LLOYD 2025 Model 2026 Model
VOLTAS 2025 Model 2026 Model
BLUE STAR 2025 Model 2026 Model
DAIKIN 2025 Model 2026 Model
Godrej 2025 Model 2026 Model
Carrier 2026 Model
Haier 2025 Model
Refrigerators
LG SAMSUNG Whirlpool Haier Godrej VOLTAS beko LLOYD
SBS Ref. 630 Ltrs
SBS Ref. 650 Ltrs
FF Ref. 272 Ltrs
DC Ref. 210 Ltrs
DC Ref. 188 Ltrs
Air Coolers
VOLTAS BAJAJ Electricals Crompton
KENSTAR orient electric Symphony
LED UHD 4K Smart Tv's
LG SAMSUNG SONY TCL
UHD
NanoCell
QNED
QLED OLED
Mini-LED
Haier Panasonic LLOYD
Mobiles & Laptops
Upto 10% Cash Back On Mobiles
vivo 5G V-70, V-70 Elite
Upto 10% Cash Back 9/0, 10/2, 12/4 Schemes Available
oppo 5G Reno-15
6/0, 7/0, 8/0, 11/2 Schemes Available
iPhone 17, 17 Pro Upto 4000/- Cash Back
17 Pro Max Upto 3000/- Cash Back
iPhone 17e New Arrival
9/0, 12/0 Schemes Available ICICI Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)
SAMSUNG New Arrival S-26 Ultra 5G Upto 9000/- Cash Back
A-56 5G Instant Discount Upto 2000/-
9/0, 12/0, 24/0 Schemes Available
realme 5G 16 Pro, 16 Pro+
6/0, 8/2, 10/3 Schemes Available
mi Redmi 5G Note 15 Series
6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
hp Lenovo DELL ASUS MacBook Laptops
Upto 10000/- cashback on Laptops
Kitchen Small Appliances
Water Dispenser
Water Purifier RO
Water Geyser 10 Litres
Microwave Oven
Air Chimney
3 Burner Glass Cooktop
Vacuum Cleaners
Wet Grinder
Rice Cooker
Mixer Grinder 3 Jar, 750 Watts
Juicer
Kettle
Air Fryer
Iron Box
Blender
Conditions Apply
LG SAMSUNG SONY LLOYD BLUE STAR VOLTAS DAIKIN HITACHI Godrej Panasonic Haier Whirlpool TCL BOSCH IFB BPL Carrier Crompton BAJAJ KENSTAR orient Symphony
iPhone vivo oppo realme ONEPLUS hp DELL ASUS Lenovo MacBook KENT EUREKA FORBES FABER pureit Livpure V-GUARD Sunflame AO Smith Butterfly Vidiem Prestige HAVELLS morphy richards BAJAJ Electricals Preethi
Sonovision Festival Discount Sale - Special Offers On Mobiles & Laptops | AMAZON PAY Upto 2000/- CASH BACK Conditions Apply
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
Next to హైదరాబాద్ సెంట్రల్, పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181, 9154281183, 84
పిల్లర్ నెం. 799, మెట్రోస్టేషన్ దగ్గర, బిగ్‌బజార్ ప్రక్కన, కూకట్‌పల్లి, హైదరాబాద్. 2842188, 2843188, 9154281180, 81, 82
మంజీర వాటర్ వర్క్స్ ఎదురు, మెట్రోపిల్లర్ 658, హైదర్‌నగర్ మియాపూర్, హైదరాబాద్. 7331149363, 64, 65
యశోద హాస్పిటల్ ఎదురు, మలక్‌పేట, హైదరాబాద్. 24542090, 9154281187, 8333924932, 33
డి-మార్ట్ దగ్గర, ఎల్.బి.నగర్, హైదరాబాద్. 9154281188, 8333924940, 41
బి.యన్.రెడ్డి నగర్, సాగర్ రోడ్, హైదరాబాద్. 8712648707, 708, 709
గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, మెట్టుగడ్డ, మహబూబ్‌నగర్ 8712635851, 52, 53
సున్నంభట్టీల నగర్, తొల్లవాగు, మంచిర్యాల. 8712417845, 46, 47
అదాలత్ సర్కిల్, హనుమకొండ, వరంగల్. 8712648718, 19, 20.
కుడకుడ రోడ్, సూర్యాపేట. 8712648761, 62, 63
ప్రకాశం బజార్, నల్గొండ. 8712648715, 16, 17
ప్యారడైస్ కాలని, షాద్‌నగర్, ఫారూఖ్ నగర్, రంగారెడ్డి జిల్లా. ఫోన్ : 8712648701, 02, 03.
ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురు, వినాయక్ నగర్, నిజామాబాద్ - 8712648766, 67 , 68.
జగిత్యాల రోడ్, కరీంనగర్. 8712635843, 44, 45.
వేములవాడ రోడ్, మంకమ్మ తోట, కరీంనగర్ - 8712635841, 42.
ఆర్ & బి సాగర్ రోడ్, మిర్యాలగూడ. ఫోన్ : 8712635848, 49, 50
పర్ణశాల ఎదురు, వైరా రోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38
కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
కొత్తగూడెం. 9154867825, 26, 27

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# పొరుగున మరో సెగ

రాబోయే ఐదురోజులు యుద్ధవిరామాన్ని పాటించాలని పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ నిర్ణయానికి వచ్చాయి. ఈద్–ఉల్–ఫితర్ సందర్భంగా ఘర్షణలకు కాస్తంత విరామం ఇవ్వాలని సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే కోరిన మేరకు తాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాకిస్థాన్ ప్రకటించింది. అఫ్ఘానిస్థాన్ ఏమాత్రం కాలుదువ్వినా, పాకిస్థాన్‌మీద డ్రోన్ దాడుల వంటివి జరిగినా తాము తక్షణమే భీకరదాడులకు ఉపక్రమిస్తామని పాక్ హెచ్చరించింది. పాక్ నిర్ణయంమీద తనకు ఏ అభ్యంతరం లేదని, అలాగే కానిద్దామని అఫ్ఘానిస్థాన్ కూడా ప్రకటించడంతో రాబోయే ఐదురోజులు కాస్తంత విరామం, కొద్ది ప్రశాంతత. పాకిస్థాన్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మెచ్చుకోవాల్సిన అవసరమేమీ లేదు. కాబూల్‌లోని ఒక చికిత్సా కేంద్రంమీద వైమానికదాడులతో నాలుగువందలమంది ప్రాణాలు హరించిన పాకిస్థాన్, అంతర్జాతీయంగా వచ్చిన అపకీర్తిని, అప్రదిష్టనూ ఇలా కాస్తంత కడుక్కొనే ప్రయత్నం చేస్తోంది.

అఫ్ఘానిస్థాన్‌లో పెద్దసంఖ్యలో మృతదేహాలను ఖననం చేస్తున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారమైనాయి. రెండువేల పడకల డ్రగ్ ట్రీట్‌మెంట్ అండ్ రీహాబిలిటేషన్ సెంటర్ మీద పాక్‌విమానాలు విరుచుకుపడటంతో ఈ మరణాలు సంభవించాయని, వందలాదిమంది రోగులు గాయపడ్డారని అఫ్ఘానిస్థాన్ ప్రకటించింది. తాను ఉగ్రస్థావరాలమీదే దాడులు చేశానని పాకిస్థాన్ చెప్పుకుంటోంది. మాదకద్రవ్యాల సాగు, ప్రపంచవ్యాప్త సరఫరాల్లో అఫ్ఘానిస్థాన్‌కు ఉన్న చెడ్డపేరు తెలిసిందే. మత్తుకు అలవాటుపడినవారి సంఖ్య కూడా ఇక్కడ విపరీతంగా పెరిగిపోయింది. తాలిబాన్ అధికారంలోకి వచ్చిన తరువాత, రవాణాను నియంత్రించకపోయినా, జనం మత్తువదిల్చే అంశంలో శ్రద్ధపెట్టిందని అంటారు. అందులో భాగంగానే, ఇప్పుడు దాడికి గురైన పునరావాసకేంద్రాన్ని సైతం ఇటీవలికాలంలో భారీగా విస్తరించి, ఆధునికీకరించింది. తాను ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేశానని పాకిస్థాన్ అంటున్నప్పటికీ, ఈ దాడిలో ఒమీద్ పునరావాసకేంద్రం నేలమట్టమైన దృశ్యం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. అది రీహాబిలిటేషన్ సెంటర్ కాదని, తెహ్రీక్–ఎ–తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) టెర్రరిస్టుల సెంటరని పాకిస్థాన్‌కు స్పష్టమైన సమాచారం ఉండి, దాడి జరిపినపక్షంలో, ఆ మాటైనా నిర్దిష్టంగా చెప్పాలి, ఆయుధాగారంగా వాడుతున్నారనుకుంటే ఆధారాలతో నిరూపించాలి. అంతేకానీ, ఊచకోతకు పాల్పడి కూడా అడ్డగోలుగా సమర్థించుకోవడం సరికాదు. వైమానిక దాడుల అనంతరం రోగులను రక్షిస్తున్న చిత్రాలు ఏవీ కూడా పాక్ వాదనను సమర్థించడం లేదు. యావత్ ప్రపంచం దృష్టి ఇరాన్ యుద్ధంమీద ఉండగా, తనను ఎవరూ ప్రశ్నించరు, పట్టించుకోరు అన్న ధీమాతో పాకిస్థాన్ ఈ ఉన్మాదానికి పాల్పడింది. ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూ ఇలాగే గాజాలో ఆస్పత్రులను సైతం ఉగ్రవాదస్థావరాలుగా ముద్రవేసి, వందలాదిమంది రోగులను, వైద్యులను, బాలింతలను ఊచకోతకోశాడు. ఇరాన్‌మీద యుద్ధాన్ని ఆరంభించిన తొలిరోజునే 170మంది స్కూలు పిల్లలను టోమోహాక్ మిసైల్‌తో హత్యచేసిన అమెరికా ఆ పాపాన్ని తిరగి ఇరాన్‌మీదకు నెట్టివేసే ప్రయత్నం చేసింది. గాజా ఘాతుకాలను, ఇరాన్‌మీద యుద్ధాన్ని ఖండిస్తున్న పాకిస్థాన్ తానూ అదే దుర్మార్గమైన దారిలో నడుస్తోంది.

అఫ్ఘానిస్థాన్‌తో యుద్ధంలో ఉన్నట్టుగా ప్రకటించిన పాకిస్థాన్, ఈ ఐదురోజుల విరామం తరువాత మళ్ళీ దాడులు కొనసాగించడం ఖాయం. తమ ఆస్పత్రిమీద దాడిచేసిన పాకిస్థాన్‌కు గట్టిజవాబు చెప్పి తీరుతానని తాలిబాన్ కూడా ప్రతిజ్ఞచేసింది. గత ఏడాది, అమెరికా అధ్యక్షుడు బగ్రాం ఎయిర్‌పోర్టు అప్పగింత విషయంలో తాలిబాన్‌మీద ఆగ్రహించి, ఫలితం అనుభవిస్తారని శపించిన తరువాతే పాకిస్థాన్ మరింతగా అఫ్ఘాన్‌మీద విరుచుకుపడటం ఆరంభించింది. మరోపక్క, భారత్–తాలిబాన్ సాన్నిహిత్యం కూడా బలపడటం మొదలైంది. ఒకరినొకరు సమర్థించుకోవడంతో మొదలై, పరస్పరం రాకపోకలవరకూ అది విస్తరించింది. అయితే, అఫ్ఘానిస్థాన్–పాకిస్థాన్ యుద్ధం ఎక్కువకాలం సాగితే అనేకశక్తుల ప్రవేశంతో మరింత విస్తరించి, ప్రమాదకరంగా పరిణమించవచ్చు. అల్‌ఖాయిదా, ఇస్లామిక్ స్టేట్ ఇత్యాది ఉగ్రసంస్థలకు తిరిగి ఊపిరివస్తే అది యావత్ ప్రపంచానికే ప్రమాదం.

## మనిషి దప్పికతో దండిగా వ్యాపారం!

ఈ నెల నుంచి ఎండలు పెరిగి, అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రం కానుంది. సామాన్య ప్రజలు కిలోమీటర్ల దూరం మండుటెండలో నడిచి వెళ్లి గుంతల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గత పాలక ప్రభుత్వాలు, నేటి మోదీ ప్రభుత్వం తాగునీటిని ప్రజలకు అందించే విధానాలు చేపట్టకుండా, ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకు కనుసన్నల్లో దేశ జల విధానాలు రూపొందించి, నీటి ప్రైవేటీకరణ విధానాలు అమలు జరిపాయి, జరుపుతున్నాయి.



2002లో భారత ప్రభుత్వం జాతీయ జల విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానం ప్రకారం ప్రభుత్వాలు ఎక్కడ సాధ్యమైతే అక్కడ జల వనరుల ప్లానింగ్, అభివృద్ధి, నిర్వహణ కోసం ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఒక దశాబ్ద కాలంలోనే దేశంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో నడిచే ప్రాజెక్టుల సంఖ్య 300కు చేరింది. కానీ నీటి సరఫరాలో ఇతర దేశాల్లో లాగానే భారత్ లోనూ ప్రైవేట్ రంగం విఫలమైంది.

ప్రకృతి సహజమైన నీరు సకల జీవరాశులకు సహజంగా లభించాలి. ప్రజల తాగు, సాగు అవసరాలకు నీరు అందేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత. కానీ ఆ బాధ్యతను నెరవేర్చడంలో పాలక ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. ప్రభుత్వాల నుంచి నీటిపై హక్కులు పొందిన కార్పొరేట్ సంస్థలు నీటి ద్వారా వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నాయి. ఫలితంగా సహజ నీటి వనరులపై ప్రజలు హక్కు కోల్పోతున్నారు. ఏ ప్రైవేటీకరణ అయినా బడా వ్యాపారుల కోసమే అన్నది వాస్తవం. ప్రైవేట్ కంపెనీలు అధిక మొత్తంలో లాభాలు గడించడమనే కోణం నుంచి నీటి నిర్వహణకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటాయి తప్ప ప్రజల అవసరాల కోణంలో ఆలోచించవు. దీర్ఘకాలిక మనుగడ దృక్పథం వాటికి ఉండదు. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్‌ల ద్వారా బహుళజాతి సంస్థలు ప్రజా నీటి వనరులను ప్రైవేటీకరించి తమతో కాంట్రాక్ట్ కుదుర్చుకోవాలని అర్థవలస దేశాలపై విపరీతమైన ఒత్తిడి చేస్తున్నాయి.

నీటి వ్యాపారం ద్వారా బడా కంపెనీలు వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తుండగా, ప్రజల జేబులు మాత్రం ఖాళీ అవుతున్నాయి. నేడు దేశంలో మూడు వేల ఆర్గనైజ్డ్ కంపెనీలు, మరో 12వేల అన్–ఆర్గనైజ్డ్ కంపెనీలు ఉన్నాయని అంచనా. పెప్సీ, కోకాకోలా బహుళజాతి కంపెనీలు పలు బ్రాండ్లతో నీటి వ్యాపారం ద్వారా వేలకోట్ల భారత సంపదను కొల్లగొడుతున్నాయి. 2022 నాటికి భారత్‌లో రూ.43,663 కోట్ల నీటి వ్యాపారం జరిగింది. 2025–26 నాటికి మార్కెట్ నీటి విలువ రూ.69వేల కోట్లుగా ఉంటుందని అంచనా. 2031 నాటికి సుమారు లక్షా 2వేల కోట్ల మార్కెట్ పరిమాణానికి చేరుకుంటుందని ఆర్థికవేత్తల అంచనా. బడా సంస్థల నీటి వ్యాపారం వల్ల 2050 నాటికి భారతదేశంలో నీటి సంక్షోభం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని అనేక నివేదికలు తెలుపుతున్నాయి. ఈ పరిస్థితులు ఏర్పడకుండా ఉండాలంటే సహజ నీటి వనరులపై ప్రజలదే హక్కు అని, నీటి వనరులను ప్రైవేటీకరణ చేసే హక్కు ప్రభుత్వాలకు లేదని, బహుళజాతి సంస్థల నీటి వ్యాపార అనుమతులు రద్దు చేయాలని ప్రజలు ఉద్యమించాలి.

– బొల్లిముంత సాంబశివరావు

## మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రత్యేకంగా నగదు రహిత ఆరోగ్య బీమా పథకం ప్రవేశపెట్టడం చాలా సంతోషకరమైన విషయం. ఇదే రీతిలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నాం. ప్రస్తుతం 40వేల రూపాయల చెల్లింపుతో జీవితాంతం భార్యాభర్తలు ఇరువురికి కలిపి 8లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. కొన్ని దీర్ఘకాల వ్యాధులకూ ఉచితంగానే వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. కానీ, నానాటికీ పెరిగిపోతున్న వైద్య ఖర్చులు, కొత్తగా పుట్టుకొస్తున్న రోగాలకు ఈ ఎనిమిది లక్షలు సరిపోవడం లేదు. చాలీచాలని పెన్షన్‌తో, వయోభారంలో రోగాలకు సరైన వైద్యం చేయించుకోలేక బతుకీడుస్తున్నాం. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని పలువురు ప్రజాప్రతినిధులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా, ప్రజాపాలన, ప్రజావాణి కార్యక్రమాల్లో వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం పట్ల సింగరేణి యాజమాన్యం కూడా దృష్టి పెట్టడం లేదు. సంస్థ లాభాలకు పునాదులు వేసిన రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించేందుకు సత్వరమే సింగరేణి సంస్థ, ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. హైదరాబాదులో ఏర్పాటు చేయనున్న సింగరేణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని రకాల ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలి.

– దండంరాజు రాంచందర్‌రావు

# అమెరికా వెలుగులకు క్యూబన్ చీకట్లు ఎందుకు?

'క్యూబా విషయంలో నేను ఏమనుకుంటే అది చేయగలను.. దాన్ని స్వాధీనం చేసుకునే గౌరవం నాకు లభిస్తుందని భావిస్తున్నాను' నాలుగురోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. ఇరాన్ మీద మొదలుపెట్టిన అధర్మయుద్ధంలో కూరుకుపోయి ఏమిచేయాలో తోచని పరిస్థితుల్లో మరో దేశాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లుగా ఈ వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. ఇటీవల కాలంలో వెనెజువెలాతో మొదలైన ప్రభుత్వాధినేతల మార్పు, అనుకూల రాజ్యాల ప్రతిష్ఠాపన పరంపరలో త్వరలో క్యూబా చేరబోతోంది. అమెరికాతో విభేదించి, దాని సామ్రాజ్య కాంక్షలకు గండికొట్టి, నచ్చిన మార్గంలో స్వతంత్రంగా వ్యవహరించిన దేశాల్లో ఒకప్పుడు క్యూబాకు ప్రముఖస్థానం ఉంది. పశ్చిమాసియాలో అమెరికా ఆధిపత్యానికి ఇరాన్ ఒకరకంగా 1979లో సవాలు విసిరితే అంతకు 20 ఏళ్లకు ముందు క్యూబా అంతకుమించిన సాహసాన్ని, ధిక్కారాన్ని ప్రదర్శించింది. ఇరాన్‌లో 1979 నాటి ఇస్లామిక్ విప్లవం దాని చుట్టూ ఉన్న కొన్ని ముస్లిం దేశాల పాలకులను భయపెడితే, 1959 నాటి క్యూబన్ విప్లవం లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఎందరికో ఉత్తేజంగా నిలిచింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ముఖ్యంగా సొంత ఖండంలో తనకు తిరుగులేదనుకున్న అమెరికాకు క్యూబా పక్కలో బల్లెంలా మారింది.

అమెరికా కోరుకున్న రాజకీయ వ్యవస్థలను ఏర్పాటు చేయలేని, కావాలనుకునే ఆర్థిక విధానాలను అమలుచేయలేని చిన్న, మధ్యస్థాయి దేశాలకు వరుసగా ముప్పు ముంచుకొస్తోందని ట్రంప్ వ్యాఖ్యలను చూస్తే తేలికగా అర్థమవుతుంది. పరిస్థితి అంతమేరకే పరిమితమయ్యేలా ఉందని కూడా చెప్పలేం. భారత్ లాంటి పెద్దదేశమే ఎటూ నోరు విప్పలేని స్థితిలో ఉంది. రష్యా నుంచి చమురు కొనొద్దని శాసిస్తే అమలుపరచాల్సిన అగత్యం ఏర్పడింది. ఇరాన్‌పై దాడులతో ఏర్పడిన ఒడుదుడుకులను ఎదుర్కోటానికి రష్యా నుంచి నెలపాటు చమురు కొనుగోళ్లకు భారత్‌కు అనుమతిని ఇస్తున్నామని బహిరంగంగా ప్రకటించి చిన్నబుచ్చినా ఏమీచేయలేని అశక్తత ఆవరించింది. చైనా లాగా భారత్‌ని ఆర్థికంగా ఎదగనీయబోమనే అర్థంలో అమెరికా విదేశాంగశాఖ సహాయమంత్రి క్రిస్టోఫర్ లాండో ఈనెల 5న ఢిల్లీలో ప్రకటించినా గట్టిగా, సూటిగా,

> **ఇటీవల కాలంలో వెనెజువెలాతో మొదలైన ప్రభుత్వాధినేతల మార్పు, అనుకూల రాజ్యాల ప్రతిష్ఠాపన పరంపరలో త్వరలో క్యూబా చేరబోతోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ముఖ్యంగా సొంత ఖండంలో తనకు తిరుగులేదనుకున్న అమెరికాకు క్యూబా పక్కలో బల్లెంలా మారింది.**

నిక్కచ్చిగా ఖండించలేని నిర్బలతే కన్పించింది. భారత–అమెరికా వ్యాపార సంబంధాలపై ఏర్పాటైన చర్చావేదికపైనే ఎటువంటి మొహమాటం లేకుండా లాండో ఆ ప్రకటన చేశారు. అమెరికాను మరోమారు గొప్పదేశంగా మారుస్తామనే నినాదాన్నీ విధానాన్నీ అందిపుచ్చుకున్న తర్వాత సంభాషణల్లో, ప్రకటనల్లో ఔచిత్యాలను ఆ దేశ నాయకులు పట్టించుకోవటం లేదు. వస్తుసేవల్లో నాణ్యతను మెరుగుపరచటానికీ, నవ్యతను తీసుకురావటానికీ, కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టటానికీ వ్యాపారరంగంలో పోటీతత్వానికి మించిన ప్రత్యామ్నాయం లేదని ఒకప్పుడు ఇంటాబయటా వినిపించిన వాదనలు ఇప్పుడు కనీసం మాటమాత్రంగానైనా ప్రస్తావించటం లేదు. అమెరికాకు పూర్వవైభవాన్ని తేవటానికి ఏ దుశ్చర్యకైనా దిగుతామనే ధోరణే ఇప్పుడు వినిపిస్తోంది. దేశాల మధ్య తలెత్తే సమస్యల పరిష్కారానికి మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటైన నానాజాతి సమితిని హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతలు పట్టించుకోలేదు. విజేత రాజ్యాలన్నీ కలిసి ఏర్పాటుచేసిన సంస్థను ఎందుకు లెక్కపెట్టాలన్న ధోరణితో దాని నిబంధనలన్నిటినీ ధిక్కరించి హిట్లర్ యూరప్‌లో ఒక్కోరాజ్యాన్ని చెరబట్టారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత స్వయంగా అమెరికా ప్రోద్బలంతో ఏర్పాటైన ఐక్యరాజ్యసమితికీ ఇప్పుడు అదేస్థితి వచ్చింది. తేడా అల్లా ఒక్కటే. స్థాపించిన వారే ఇప్పుడు దాని అస్తిత్వాన్ని లెక్కచేయటం లేదు. ఐక్యరాజ్యసమితికి సమస్యలు తీసుకెళ్లకుండా, అందులో చర్చలు లేకుండా యుద్ధాలను ప్రకటించటమూ, రాజ్యాధినేతలను ఎత్తుకుని పోవటమూ, హతమార్చటమూ అమెరికాకు ఇప్పుడు రివాజుగా మారింది.




అమెరికాకు భూభాగం కొరత ఎప్పుడూ లేదు. విస్తీర్ణం పరంగా ప్రపంచంలో మూడోస్థానంలో ఉంది. వనరుల పరంగానూ లోటులేదు. కానీ విస్తరణకాంక్షతోనే మొదటి నుంచీ తన్నుకులాడుతోంది. క్యూబా విషయంలో అది మరింత నిజం. క్యూబాను స్పెయిన్ నుంచి కొనుగోలు చేయటానికి ప్రయత్నాలూ చేశారు, ఆక్రమించుకోటానికి పావులూ కదిపారు. థామస్ జఫర్‌సన్ అమెరికా అధ్యక్షుడిగా (1801–1809) ఉన్నప్పుడే ఈ వ్యవహారాలు నడిచాయి. స్పెయిన్ వాటిని పడనీయలేదు. లాటిన్ అమెరికాలో మిగతా దేశాలపై పెత్తనాన్ని 1820ల నాటికే వదులుకోవాల్సి వచ్చినా క్యూబాపై పట్టును వీడలేదు. ప్రపంచంలో చక్కెర ఉత్పత్తిలో ఆనాడు క్యూబా అగ్రస్థానంలో ఉండటమే అందుకు కారణం. 19వ శతాబ్దంలో సామ్రాజ్యశక్తిగా స్పెయిన్ ప్రాబల్యం క్షీణించిపోయింది. అదే సమయంలో క్యూబన్ జాతీయవాదులు బలం పుంజుకున్నారు. స్పెయిన్‌పై యుద్ధానికీ దిగారు. విస్తరణకాంక్షతో ఉన్న అమెరికాకు అది చక్కని అవకాశంగా పరిణమించింది. జాతీయవాదుల పక్షాన స్పెయిన్‌తో యుద్ధానికి దిగింది. స్పెయిన్ ఓడిపోయింది. క్యూబాకు స్వాతంత్ర్యం లభించింది. అయితే ఆ సంతోషం కొద్దికాలం కూడా నిలవలేదు. అన్నింటా తనకు లోబడి ఉండాలనే షరతులను అమెరికా విధించింది. అనుకూల వ్యాపార ఒప్పందాలను క్యూబాపై రుద్దింది. సముద్రతీరం పక్కనే ఉన్న క్యూబాకు చెందిన 'గ్వాంటనమో–బే'నీ అప్పుడే స్వాధీనం చేసుకుంది. ఇప్పటికీ అమెరికా సైనిక స్థావరం అక్కడే ఉంది. పేరుకు స్వతంత్రదేశమైనా అమెరికాను ఎదిరించలేని క్యూబా నిజానికి వలస ప్రాంతంగానే ఉండిపోయింది. 1898 నుంచి 1933 వరకూ అమెరికా సైన్యం క్యూబా నుంచీ కదల్లేదు. పొరుగుదేశాలతో మంచిగా మెలగాలంటూ (గుడ్ నేబర్) ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ ప్రవేశపెట్టిన విధానంతో అమెరికా సైనికులు క్యూబాను వదిలారు. ఆ వెంటనే అమెరికాకు ఇష్టుడైన క్యూబా సైనికనేత ఫూల్‌హెన్సియో బటిస్టా అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అమెరికా వ్యాపార ప్రయోజనాలకూ, వాటికి తోడ్పడి లాభపడే క్యూబన్ భూస్వామ్య, ధనికవర్గాలకూ ప్రతీకగా బటిస్టా పాలన నిలిచిపోయింది. విచ్చలవిడి అవినీతితో పాటు, జూదానికీ మాఫియా పాలనకూ క్యూబా నిలువుటద్దంగా మారిపోయింది. అమెరికాతో అన్ని విధాలుగా అంటకాగుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్యపాలన సైతం క్యూబాలో ఉందని ప్రచారం చేసుకోటానికి బటిస్టా కొన్ని ఏర్పాట్లను చేశారు. కొంతకాలం అధికారం నుంచి తప్పుకొన్నా తెర వెనుక నుంచి అసలు వ్యవహారాలన్నీ తనే నడిపారు. ఎన్నికలప్పుడు రిగ్గింగు చేయటం, ప్రత్యర్థులను భయపెట్టటం సర్వసాధారణంగా మారింది. చివరికి 1952లో నామమాత్రంగా అమలయ్యే రాజ్యాంగాన్ని సైతం సస్పెన్షన్‌లో ఉంచి దేశం నుంచి పారిపోయేవరకూ బటిస్టా నియంతగానే పాలించారు. అమెరికా కంపెనీల పెట్టుబడులు ఆ కాలంలో క్యూబాలోకి ఎక్కువగానే వచ్చాయి. అమెరికాకు అవసరమైన రీతిలో క్యూబాలో కొంత అభివృద్ధీ జరిగింది. అదంతా పైవర్గాలకే ఉపయోగపడింది. అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయి. అమెరికా పెట్టుబడులు వచ్చినా క్యూబాలో చక్కెర పరిశ్రమ మినహా ఇతర పరిశ్రమలు పెద్దగా అభివృద్ధి కాలేదు. ఆ పరిశ్రమలోనూ అమెరికా కంపెనీల ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. ఇతర పరిశ్రమల స్థాయి ఎంత అధోగతిలో ఉండేదో తెలుసుకోవాలంటే ఆ



■ రాహుల్ కుమార్

భూసంస్కరణలతో అమెరికన్ల చేతుల్లో పెద్దఎత్తున పోగుపడిన భూములూ చేజారాయి. క్యూబాపై సంపూర్ణ వాణిజ్య నిషేధాన్ని అమెరికా ప్రకటించింది. అప్పటి నుంచి ఒబామా అధ్యక్షుడయ్యే వరకూ ఆ నిషేధం కఠినంగా కొనసాగింది. 2015లో మొదలైన సడలింపులు 2017 వరకూ మాత్రమే కొనసాగాయి. ట్రంప్ వాటన్నిటినీ పక్కనబెట్టి మళ్లీ యథాతథ స్థితిని తీసుకొచ్చారు. టెర్రరిస్ట్ దేశాల జాబితాలోకి క్యూబానూ చేర్చారు.

ఈ ఏడాది జనవరిలో వెనెజువెలా రాజధానిపై దాడిచేసి అప్పటి అధ్యక్షుడు నికొలస్ మదురోను అరెస్టు చేసిన తర్వాత అమెరికా అక్కడి చమురు పరిశ్రమను తన అదుపులోకి తెచ్చుకుంది. క్యూబాకు చమురు ఎగుమతులను నిలిపివేసింది. విద్యుత్తు ఉత్పత్తికి చమురుపైనే ప్రధానంగా (80–90%) ఆధారపడిన క్యూబాలో చీకట్లు అలుముకుంటున్నాయి. 1959 తర్వాత విద్య, వైద్య రంగాల్లో క్యూబా మంచి ప్రగతినే సాధించినా ఇతర రంగాల్లో అనుకున్నంత ముందుకు వెళ్లలేదు. ఎగుమతులు– దిగుమతులు చూస్తేనే ఇది అర్థమవుతుంది. ఎగుమతులు 2–3 బిలియన్ డాలర్లు ఉంటే 8–12 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంటున్నారు. ఆహారధాన్యాలకు కూడా 60 నుంచి 80 శాతం వరకూ దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో క్యూబన్ వైద్యులూ, వైద్య సిబ్బందీ అందించే సేవల ద్వారానే ప్రధానంగా విదేశీ మారక ద్రవ్యం (40–50%) లభిస్తోంది. పర్యాటకరంగం నుంచి మరో 15 నుంచి 25 శాతం అందుతోంది.

65 ఏళ్ల పాటు అమెరికా నిషేధాలనూ, రహస్య పథకాలనూ, కుట్రలనూ ఎదుర్కొని క్యూబా సాటిలేని ధైర్యాన్ని ప్రదర్శించి రాజకీయంగా నిలబడగలిగినా ఆర్థిక పునాదులను పటిష్ఠంగా వేసుకోలేకపోయింది.

> **ఏకపార్టీ రాజకీయ ఆధిపత్యాన్ని స్థాపించిన విప్లవోద్యమం.. ఆరంభంలోని ఊపునూ, ఉత్సాహాన్నీ కోల్పోయిన తర్వాత, చాలా పరిమితంగానే ఆర్థిక విజయాలను నమోదు చేస్తుంది. ఏకపార్టీ పాలన లోని చైనా ఒక్కటే ఊహించని విజృంభణతో ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించి, పోటీతత్వంతో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాలకు పదునుపెట్టుకుని, ఆ బలహీనతను గణనీయంగా అధిగమించింది. క్యూబా ఆ బలహీనతను తనదైన దారిలో అధిగమించకపోతే మళ్లీ అమెరికా ఆధిపత్యం కింద నలిగిపోతుంది!**

(ఆ) దేశ ఎగుమతులను చూస్తే సరిపోతుంది. వాటిల్లో చక్కెర వాటా 80 నుంచి 85 శాతం ఉండేది. మిగిలిన 15 శాతంలో పొగాకు వాటా సగభాగం ఆక్రమించేది. రాగి, నికెల్ లాంటి లోహాలు 3 నుంచి 5 శాతం ఉండేవి. మిగిలినవన్నీ వ్యవసాయ, పశు ఉత్పత్తులే.

బటిస్టా అవినీతి పాలన, అణచివేతలతో ప్రజలు విసిగివేసారి ఉన్న సమయంలో ఫిడేల్‌కాస్ట్రో రెండువేల మంది సాయుధులతో క్యూబా రాజధాని హవానాలోకి ప్రవేశించి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. నిజానికి కాస్ట్రో, చేగువేరాల విధానాలపై మొదట్లో అమెరికాకు స్పష్టతలేదు. కాస్ట్రోకు కూడా అడుగులు ఎటువేయాలన్న దానిపై సందిగ్ధత ఉండేది. ఆనాటి అమెరికా అధ్యక్షుడు ఐజన్‌హోవర్.. కాస్ట్రో సైతం తమకు అనుకూలంగా వ్యవహరిస్తారని కొంత వరకూ భావించారు. 1959 నాటి విప్లవం తర్వాత వెంటనే కాస్ట్రో అమెరికాకు వెళ్లి ఐజన్‌హోవర్‌తో చర్చలూ జరిపారు. అమెరికాకు తలవొగ్గి ఉండటం కష్టమని కాస్ట్రోకు అర్థమవ్వగానే ఆలోచనలూ అడుగులూ స్పష్టత సంతరించుకున్నాయి. 1960లో సోవియట్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. రష్యా నుంచి వచ్చిన చమురును శుద్ధి చేయటానికి క్యూబాలోని అమెరికన్ ఆయిల్ రిఫైనరీలు తిరస్కరించాయి. దీంతో వాటిని కాస్ట్రో జాతీయం చేశారు. ప్రతీకారచర్యగా క్యూబా నుంచి దిగుమతయ్యే చక్కెర కోటాను అమెరికా తగ్గించివేసింది. దాంతో చక్కెర పరిశ్రమలనూ, ఇతర అమెరికన్ కంపెనీలనూ కాస్ట్రో జాతీయం చేశారు.

సోవియట్ రష్యా ఆర్థిక సహాయంతో 1990ల వరకూ ఎలాగోలా నెట్టుకు వచ్చినా ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 1990ల తర్వాత ప్రపంచవ్యాప్తంగా మొదలైన ఆర్థిక సంస్కరణలను పరిమితంగా చేపట్టినా అవి ఇచ్చిన ఫలితం కొంతే. 1995 నుంచి 2008 వరకూ సాధించిన ప్రగతి ప్రధానంగా వెనెజువెలా చమురుపై ఆధారపడే జరిగింది. 2008 నుంచి ఇప్పటివరకూ 1–2 శాతాల మధ్య ఆర్థికాభివృద్ధి ఊగిసలాడుతూ ఉంది.

ఏకపార్టీ రాజకీయ ఆధిపత్యాన్ని స్థాపించిన విప్లవోద్యమం.. ఆరంభంలోని ఊపునూ, ఉత్సాహాన్నీ కోల్పోయిన తర్వాత చాలా పరిమితంగానే ఆర్థిక విజయాలను నమోదు చేస్తుంది. రష్యా, తూర్పు యూరపు దేశాలే దీనికి ఉదాహరణ. ఈ ఒరవడికి భిన్నంగా ఏకపార్టీ పాలనలోని చైనా ఒక్కటే ఊహించని విజృంభణతో ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించి, పోటీతత్వంతో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాలకు పదునుపెట్టుకుని ఆ బలహీనతను గణనీయంగా అధిగమించింది. ప్రజల జీవనప్రమాణాలను స్వల్పకాలంలో కనీవినీ ఎరగని రీతిలో పెంచగలిగింది. క్యూబా ఆ బలహీనతను తనదైన దారిలో అధిగమించకపోతే మళ్లీ అమెరికా ఆధిపత్యం కింద నలిగిపోతుంది. అమెరికా గత వైభవ వెలుగుల కోసం క్యూబా మళ్లీ చీకట్లలో కూరుకుపోకూడదనుకుంటే జరగాల్సింది అదే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

# ఎంఎన్ రాయ్ చూపిన నవ్య మానవవాద మార్గం

భారతదేశ ఆధునిక మేధోచింతనలో హేతువాద– మానవవాదాలను ప్రతిపాదించిన అరుదైన తత్వశాస్త్రవేత్త మానవేంద్రనాథ్ రాయ్ (ఎంఎన్ రాయ్). విప్లవకారుడిగా జీవితాన్ని ప్రారంభించి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నారు. భారతదేశ కమ్యూనిస్టు పార్టీని ప్రారంభించి, అది సరైన పని కాదని అనుభవం మీద తెలుసుకొని వదిలేశారు. "మతం వలే పార్టీలు కూడా మానవస్వామ్యానికి, ప్రజాస్వామ్యానికి శత్రువులవుతాయ"ని గ్రహించి, తాను నిర్మించిన రాడికల్ డెమొక్రటిక్ పార్టీని రద్దు చేసి, చివరికి 'మానవవాద తత్వాన్ని' ప్రపంచ మానవాళికి అందించడానికి 'రాడికల్ హ్యూమనిస్ట్ ఉద్యమానికి' ఊపిరిలూదారు.

బాల్యంలోనే విప్లవశీలత్వం వైపు తొలి అడుగులు వేసిన రాయ్ అసలు పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య. 1887 మార్చి 21 న బెంగాల్‌లో జన్మించారు. చిన్న వయసులోనే అప్పటి బెంగాల్ విప్లవోద్యమం, వందేమాతర ఉద్యమ ప్రభావం ఆయనపై గాఢంగా పడింది. మొదటి దశలో ఆయన 'తీవ్ర జాతీయవాది'. ఆయుధ పోరాటం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం, పౌరులకు స్వేచ్ఛ సాధ్యమని భావించారు. ఆయుధాల సేకరణకు అమెరికా, మెక్సికోలకు వెళ్లినపుడు మార్క్సిజం పరిచయమయింది. ఆయన ఆలోచనా ప్రపంచంలో ఇది ఒక కీలక మలుపు. మెక్సికో విప్లవోద్యమంలో పాల్గొని "మెక్సికో కమ్యూనిస్టు పార్టీ స్థాపకులలో ఒకరు"గా నిలిచారు. తరువాత సోవియట్ యూనియన్ లోని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యకలాపాల్లో పాల్గొని, కమ్యూనిస్టు సిద్ధాంతాలను ప్రపంచ స్థాయి రాజకీయాల్లో ఉపయోగించడానికి కృషి చేశారు. మార్క్సిజం లోని ఆచరణాత్మక సమస్యలు, వ్యక్తి స్వేచ్ఛ మీద పడే నీడలపై ఆయన చేసిన విమర్శలు లోతైనవి.

1930లో భారతదేశానికి తిరిగి వచ్చినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం పాత కేసులపై రాయ్‌ను జైల్లో పెట్టింది. కానీ ఆయన మానసిక దృక్పథంలో ఇది కీలక మలుపు అయింది. జైలులో ఆయన విప్లవకారుడి కాలాన్ని దాటి ఒక ఆలోచనకర్తగా, తత్వవేత్తగా మారారు. ప్రపంచ సాహిత్యాన్ని ఔపోసన పట్టారు.

> **ప్రజాస్వామ్యం కేవలం ప్రభుత్వ వ్యవస్థ కాదని, అది మానవ సంబంధాల నైతిక విలువల అల్లిక అని రాయ్ స్పష్టం చేశారు. ప్రశ్నించడం, పరిశీలించడం, ప్రయోగాలు, ఆధారాలు– ఇవే మానవ చైతన్యానికి దిక్సూచి అని ఆయన భావించారు. నవ్య మానవవాదం రాయ్ మనకు ఇచ్చిన తాత్వికభావ సంపద.**



ఎంఎన్ రాయ్ మార్క్సిజాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేసి, మానవ స్వేచ్ఛ, వివేకం, నైతికత కేంద్రంగా ఉన్న కొత్త తత్వాన్ని గురించి ఆలోచించారు. ఆయన రూపొందించిన రాడికల్ హ్యూమనిజం భారతీయ తత్వచింతనలో ఒక విప్లవం.

రాయ్ దృష్టిలో మనిషి, మనిషి స్వేచ్ఛకే విలువ. మతం, రాజకీయం, సమాజం– ఏ వ్యవస్థ అయినా వ్యక్తి స్వేచ్ఛను కాపాడాలే కానీ హరించకూడదు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం బలపడాలంటే వివేకం, హేతువాదం, మానవ అభివృద్ధి పునాదులని ఆయన సూచించారు. దైవం, భక్తి, సంప్రదాయం, మూఢనమ్మకాల బదులు మనుషుల ఆలోచనలు– ప్రశ్నించడం, వివేచన, ఆధునిక విజ్ఞానశాస్త్రం ఆధారంగా సాగాలని ఆయన సూచించారు. కానీ నేడు మతం, మూఢనమ్మకాలు మరింతగా విస్తృతం కావడానికి దైవం మీద భయం, భక్తి కారణమవుతున్నాయి. ఆధునిక మానవుడు అనాది మనిషి కంటే ఎక్కువ అభద్రతా భావాన్ని, ఆత్మన్యూనతా భావాన్ని అనుభవిస్తున్నాడు. ఇది క్రమంగా మానవ వ్యక్తిత్వ హననానికి దారితీస్తోంది.

మానవ సమాజంలో ప్రజాస్వామ్యం కేవలం ప్రభుత్వ వ్యవస్థ కాదని, అది మానవ సంబంధాల నైతిక విలువల అల్లిక అని రాయ్ స్పష్టం చేశారు. ప్రశ్నించడం, పరిశీలించడం, ప్రయోగాలు, ఆధారాలు– ఇవే మానవ చైతన్యానికి దిక్సూచి అని ఆయన భావించారు. రాడికల్ హ్యూమనిజం ఆయన మనకందించిన అత్యంత శాస్త్రీయ, మానవీయ బహుమతి. భారతదేశంలో భావ పునర్వికాసానికి హేతువాద, మానవవాదాల ఉద్యమాలు కీలకమని ఆయన తీర్మానించారు.

స్వేచ్ఛ, విముక్తి, ప్రజాస్వామ్యం, నైతికతల మీద రాయ్ పుస్తకాలు ఎప్పటికీ ప్రేరణాత్మకమైనవే. సుమారు తొమ్మిదివేల చేతివ్రాత పేజీలు భద్రంగా ఉన్నాయంటేనే ఆయన అతి తక్కువ కాలంలో ఎంత సాహిత్యం మనకందించారో అర్థమవుతోంది. రాజకీయాల్లో రాయ్ చేసిన ప్రయోగాలు ఎవరూ చేయడానికి సాహసించరు. సామాన్య ప్రజలు రాజకీయాల్లో చురుకుగా ఆలోచించి పాల్గొన్నప్పుడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుందని, దానికి ఆచరణాత్మక ప్రణాళిక సిద్ధం చేశారు.

ప్రజలలో హేతుబద్ధమైన ఆలోచన పెంపొందకపోతే ప్రజాస్వామ్యం కూడా మానవ విరోధక శక్తుల చేతికి వెడుతుందని ఆయన చేసిన హెచ్చరికలు నేడు నిజమనిపిస్తోంది. విద్యను కేవలం వృత్తి సాధనంగా కాక, భావ సంకెళ్ళ విముక్తి సాధనంగా చూశారు. మనసులో, మెదడులో కూరుకుపోయిన అశాస్త్రీయ, అమానవీయ అంశాలతో పాటు, సంపూర్ణమైన అజ్ఞానం విధ్వంసం కావాలని రాయ్ సూచించారు. అందుకే ఆయన "విద్యావంతులను వివేకవంతులను చేయండి" అన్నారు. ఆయన ఆలోచించిన విద్య సారం– మతం నుంచి మనిషికి మానసిక విముక్తి లభించడమే. 1954 జనవరి 25న మరణించే దాకా ఆయన రచనలు చేయడం ఆపలేదు. ఇప్పటికీ ఆయన ఆలోచనలు భారతీయ మేధో ప్రపంచాన్ని మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్వతంత్ర చింతనాపరులను, వ్యక్తులను నిరంతరం ప్రభావితం చేస్తున్నాయి.

ఎంఎన్ రాయ్ ఆలోచనల, ఆచరణల అనివార్యత రోజురోజుకూ పెరుగుతోంది. దేశానికి నేడు ఆయన ఆలోచనల ఆవశ్యకత ఉంది. ఎందుకంటే– మతపరమైన మూర్ఖత్వం పెరుగుతోంది. వ్యక్తి స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్న ఈనాటి రాజకీయ నేపథ్యంలో రాడికల్ హ్యూమనిజం అవసరం. విజ్ఞాన శాస్త్ర స్ఫూర్తిని మరిచి విద్యార్థుల పాఠ్య ప్రణాళికలపై మత చారలు పోవాలంటే రాయ్ ఆలోచనల ఆవశ్యకత పెరుగుతోంది.

■ కె. శ్రీనివాసాచారి
తెలంగాణ హేతువాద సంఘం అధ్యక్షులు
(మార్చి 21: మానవేంద్రనాథ్ రాయ్ జయంతి)



రవీంద్రభారతిలో కళాకారుల ఆటా, పాట



కమల్‌హాసన్



కుటుంబసభ్యులతో చిరంజీవి



రశ్మిక మందన్న

## గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం
## తారాతోరణం..

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో సినీ తారలు సందడి చేశారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖులెందరో మెరిశారు.

మరిన్ని చిత్రాలు 8లో...

# ఉగాది శోభ

- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు
- సంప్రదాయ దుస్తుల్లో యువత

హైదరాబాద్ సిటీ, మార్చి19(ఆంధ్రజ్యోతి): నగరమంతా ఉగాది శోభ వెల్లివిరిసింది. కొత్త దుస్తులు, షడ్రుచుల ఆరగింపు, భక్ష్యాల విందు భోజనాలు, పంచాంగ శ్రవణాలతో వీధులన్నీ గురువారం సందడిగా మారాయి. దేవాలయాలన్నీ జనసందోహంగా మారాయి. ప్రభుత్వం తరపున రవీంద్రభారతిలో తెలుగు సంవత్సరాది పరాభవనామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాకారులు జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. రోజూ చిరుగుల జీన్సులు, ట్రెండీ టీషర్టులతో కనిపించే యువతీయువకులు సంప్రదాయ దుస్తుల్లో ఆలయాల ముందు బారులు తీరిన దృశ్యాలు కనిపించడం విశేషం. 'జెన్ జీ' తరం సైతం పండుగలు, సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందనడానికి నగరంలో కనిపించిన ఉగాది సందడే నిదర్శనం. బల్కంపేట ఎల్లమ్మదేవాలయంలో అరిసెలు, భక్ష్యాలు, సకినాలు వంటి పిండివంటలతో అమ్మవారి అలంకరణ

మిగతా 6వ పేజీలో..



కొత్తపేట అష్టలక్ష్మి దేవాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు



పెద్దమ్మ దేవాలయంలో భక్తుల రద్దీ



పంచెకట్టులో ఉదయపు నడకకు హాజరైన కేబీఆర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



వివేకానంద నగర్ సప్తగిరి కాలనీ ఆలయంలో భక్తులు



ప్రత్యేక అలంకరణతో బల్కంపేట ఎల్లమ్మ తల్లి

# ఫ్యూచర్ బడ్జెట్‌పైనే ఆశలు




### వాటర్‌బోర్డు అంచనాలు బారెడు

బడ్జెట్‌లో రూ.6వేల కోట్లకు పైగా కేటాయించాలంటూ వాటర్‌బోర్డు ప్రతిపాదనలు చేసింది. తాగునీటి సరఫరా ద్వారా ఏడాదికి వెయ్యి కోట్ల ఆదాయం వస్తుండగా జీత, భత్యాలు, బోర్డు నిర్వహణకే సరిపోతున్నాయి. అదనంగా ఏర్పడుతున్న రూ.1200కోట్ల లోటును అధిగమించడానికి బడ్జెట్‌పైనే ఆశలు పెట్టుకుంది. గత బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.3,085 కోట్లు కేటాయించింది. ఈసారి బడ్జెట్‌లో గతం కంటే అధికంగా నిధులు కావాలని వాటర్‌బోర్డు ప్రతిపాదనలు పంపింది.

మూసీ మురిసేనా..
హెచ్ఎండీఏకు ఏ మేరకు..
6లో

### క్యూర్‌కు కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి

- ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఇక్కడే..
- రూ.10 వేల కోట్లతో ప్రతిపాదనలు
- బల్దియా రుణాల భారం ఎవరిది..?
- రూ.6 వేల కోట్లు ఆశిస్తున్న వాటర్‌బోర్డు
- మెట్రో విస్తరణకు రూ.3 వేల కోట్లతో ప్రపోజల్స్

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీకోర్) అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కోర్ ఏరియాకు కేటాయింపులూ భారీగానే ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న హెచ్-సిటీ, మూసీ పునర్జీవం, మెట్రో విస్తరణ, నాలాల అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుదలకు సుంకిశాల, గోదావరి రెండు, మూడో దశల ప్రాజెక్టులు, హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్‌లు

మిగతా 6వ పేజీలో..

# 31లోపు పన్ను చెల్లించండి

- ఆ తర్వాత వడ్డీ మాఫీ ఉండదు..
- పన్ను వసూలుకు ఎంఎంసీలో స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూలుకు మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. సర్కిళ్ల వారీగా టాప్- 100 బకాయిదారులను గుర్తించి.. సిబ్బందితో వారికి ప్రత్యేకంగా ఫోన్లు చేస్తున్నారు. బకాయిలు ఇప్పుడు చెల్లిస్తే వన్ టైం స్కీమ్ (ఓటీఎస్)లో భాగంగా వడ్డీలో 90శాతం మాఫీ ఉంటుందని, ఈ నెల 31 తరువాత ఈ అవకాశం ఉండదని చెబుతున్నారు. వీటికి పౌరులు సానుకూలంగా స్పందిస్తున్నారని పేర్కొన్నారు. సంస్థ వెబ్‌సైట్ www.mmc.telangana.gov.in, మై క్యూర్ యాప్, మీసేవా, పౌర సేవా కేంద్రాల్లో పన్ను చెల్లించవచ్చని కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. మార్చి 31 తరువాత ఆస్తి పన్ను బకాయిల వసూలుకు మరోసారి డ్రైవ్ నిర్వహిస్తామని, అయితే, అప్పుడు వడ్డీపై 90 శాతం మాఫీ ఉండదని పేర్కొన్నారు. పౌరులు ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కార్యాలయ ప్రారంభోత్సవంలో డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తోపాటు సిబ్బంది

# హెచ్ ఫాస్ట్‌తో కల్తీకి అడ్డుకట్ట

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో పెరుగుతున్న ఆహార పదార్థాల, ఇతర వస్తువుల కల్తీని నివారించేందుకు ఫుడ్, సేఫ్టీ అధికారుల సమన్వయంతో హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్ ఫాస్ట్) అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. బేగంబజార్ పాత పోలీస్‌స్టేషన్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని గురువారం డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా సమాచారంతో పటిష్ఠమైన యంత్రాంగంతో ఆహార కల్తీకి అడ్డుకట్ట వేయడం ఈ విభాగం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ విభాగంలో ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్‌లతో కలిసి మొత్తం 28మంది సభ్యులు ఉంటారని తెలిపారు. ఎవరికైనా ఆహార కల్తీ గురించి తెలిస్తే 8712661212 నంబర్‌లో లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు ఎన్. రంజిత్‌కుమార్‌గౌడ్, అంజయ్య, ఎస్ఐలు రమ్య, అభిలాష్, అఖిల్, కృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు జుమాతుల్ విదా
# పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రంజాన్ నెల ఆఖరి శుక్రవారం (జుమాతుల్ విదా) సందర్భంగా చార్మినార్, మక్కా మసీదు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని హైదరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయ్‌డేవిస్ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని ఆయన సూచించారు.

- నయాపూల్ వైపు నుంచి చార్మినార్ వైపుకు వచ్చే వాహనాలను మదీనా జంక్షన్ నుంచి సిటీ కాలేజీ వైపునకు మళ్లిస్తారు. నాగులచింత, శాలిబండ వైపు నుంచి చార్మినార్ వైపునకు వచ్చే వాహనాలను హిమ్మత్‌పురా జంక్షన్ నుంచి హరీబౌలి, ఓల్గా హోటల్ వైపునకు మళ్లిస్తారు.
- చౌక్ మైదాన్ నుంచి వచ్చే వాహనాలను కోట్ల అలీజా వైపునకు, మూసాబౌలి వైపు నుంచి వచ్చే వాహనాలను మోతీగల్లీ, ఫతేదర్వాజా వైపునకు, గుల్జార్‌హౌస్ నుంచి వచ్చే వాహనాలను ఏత్‌బార్ చౌక్ వద్ద నుంచి మీరాలం మార్కెట్, బీబీ బజార్ వైపునకు మళ్లిస్తారు.
- షేర్‌ఏ కమాన్ నుంచి వచ్చే వాహనాలను ఘాన్సీ బజార్, హైకోర్టు వైపునకు, లక్కడ్‌కోట్ వైపు నుంచి వచ్చే వాహనాలను మీరాలం మార్కెట్ వైపుకు మళ్లిస్తారు.
- నమాజ్‌కు వచ్చే వారు తమ వాహనాలను గుల్జార్‌ఫంక్షన్‌హాల్, మసీద్ ఉల్ అనామ్ గ్రౌండ్, చార్మినార్ బస్ టెర్మినల్, ఏయూ ఆస్పత్రి పార్కింగ్, ఖిల్వత్ గ్రౌండ్, పాత పెన్షన్ ఆఫీస్ వద్ద నిలిపేందుకు స్థలాన్ని కేటాయించారు. సిటీ బస్సులను అఫ్జల్ గంజ్ వద్ద నిలిపి వేస్తారు.

**సికింద్రాబాద్ జోన్‌లో..**

- సికింద్రాబాద్‌లోని సుభాష్‌రోడ్‌ను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మూసివేస్తారు. బాటా ఎక్స్‌రోడ్స్ వైపు నుంచి వచ్చే వాహనాలను మహంకాళి పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి లాలా టెంపుల్ వైపునకు మళ్లిస్తారు.



## ఆటో డ్రైవర్లకు ఎల్‌పీజీ కష్టాలు

గ్యాస్ కోసం కిలోమీటర్ల మేర క్యూ

6



## రైళ్లలో ఏటా 58కోట్ల భోజనాలు!

- సగటున 0.0008 శాతమే ఫిర్యాదులు
- మూడేళ్లలో రూ.2.6కోట్ల జరిమానా
- నివేదిక వెల్లడించిన ఇండియన్ రైల్వే

6

## ఎంఎంటీఎస్ ఎక్కాలంటే ఆపసోపాలే

స్టేషన్లలో ప్లాట్‌ఫారాల ఎత్తు తక్కువగా ఉండడంతో ప్రయాణికులకు ఇక్కట్లు

6

# తప్పించుకోలేరు మిత్రమా..

- మత్తు వదిలిస్తున్న నార్కోటిక్ పోలీసులు
- ఈగల్ చేతిలో డ్రగ్స్ వినియోగదారుల డేటా
- పబ్‌లు, ఫామ్‌హౌజ్‌ల్లో డ్రగ్స్ పార్టీలు భగ్నం
- లోకల్, అంతర్రాష్ట్ర స్మగ్లర్స్ ఆటకట్టిస్తున్న పోలీసులు



### 24/7 నిఘా..

నగరంలో చాపకింద నీరులా గంజాయి, డ్రగ్స్ మహమ్మారి విస్తరిస్తోంది. ఒకవైపు నైజీరియన్స్. మరోవైపు అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాలు గంజాయి, నల్లమందు, ఏండీఎంఏ, కొకైన్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలను నగరంలోకి సరఫరా చేస్తున్నాయి. దీంతో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఈగల్,హెచ్‌న్యూ) లా అండ్ ఆర్డర్, ఎస్‌వోటి, టాస్క్‌ఫోర్స్ అధికారులతో కో ఆర్డినేషన్‌తో రంగంలోకి దిగి 24/7 నిఘా పెడుతున్నారు.

హైదరాబాద్ సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నార్కోటిక్ పోలీసులు డ్రగ్స్ బాబుల మత్తు వదిలిస్తున్నారు. గుట్టుగా పార్టీల్లో వినియోగిస్తున్న మాదక ద్రవాలపై నిఘా పెట్టి వినియోగదారుల ఆటకట్టిస్తున్నారు. కచ్చితమైన డేటాతో అంతర్రాష్ట్ర డ్రగ్స్ లింకులను ఛేదిస్తూ స్మగ్లర్ల ఆటకట్టిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ నార్కోటిక్ పోలీసులు భగ్నం చేసిన డ్రగ్స్ పార్టీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇందులో ఒక ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సహా.. పలువురు వ్యాపారవేత్తలు 11 మంది పట్టుబడడం తీవ్ర కలకలం రేపింది. ఫామ్‌హౌజ్‌లో గుట్టుగా డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకొని నిందితులను అరెస్టు చేశారు.

### డేటాబేస్‌లో వందలాది మంది..

మాదక ద్రవ్యాలను గుట్టుగా సరఫరా చేస్తున్న వినియోగదారులు.. స్మగ్లర్స్ నెట్‌వర్క్‌లో ఉన్న కాంటాక్టులతో ప్రత్యేక డేటాబేస్‌ను నిర్వహిస్తున్నారు. సినిమా ఇండస్ట్రీ మొదలు, బడాబాబులు, వ్యాపారవేత్తలు, సంపన్నుల పిల్లలు, డాక్టర్స్, ఇంజనీర్స్, ఐటీ స్టూడెంట్స్ సహా.. వందలాది మంది ఇందులో ఉన్నట్లు గుర్తించి ఈగల్ ప్రత్యేక బృందాలు వారిపై నిఘా పెడుతున్నాయి. పట్టుబడ్డ వారికి, అంతర్రాష్ట్ర స్మగ్లర్స్ ముఠాలతో ఉన్న లింకులను గుర్తించి ఇతర రాష్ట్రాల్లో ఉన్న ముఠాల ఆట కట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల గోవా, బెంగళూరు, ముంబై, రాజస్థాన్, ఆగ్రా ముఠాలకు చెందిన ఘరానా స్మగ్లర్స్‌ను పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

### ఇకపై ఆకస్మిక తనిఖీలు, పరీక్షలు..

గ్రేటర్ పరిధిలో ఇకపై పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తరహాలోనే డ్రగ్స్ పరీక్షలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. నగరంలోని పబ్‌లు, క్లబ్‌లు, కళాశాలలు, కార్పొరేట్ స్కూల్స్, ఈవెంట్స్ జరుగుతున్న

మిగతా 6వ పేజీలో..

**సైబర్ మోసాలు**

## వృద్ధుల నుంచి రూ.48లక్షలు కాజేత

- ట్రేడింగ్ పేరుతో రూ.42.75లక్షలు
- ఏపీకే ఫైల్స్ పంపి రూ.5.51 లక్షలు..



హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో సైబర్ నేరగాళ్లు వృద్ధులను టార్గెట్‌గా చేసుకుని మోసాలకు పాల్పడ్డారు. షేక్‌పేటలో నల్లా బిల్లు చెల్లించాలని ఏపీకే ఫైల్‌తో రూ.5.51లక్షలు కాజేయగా.. ట్రేడింగ్ పేరుతో సికింద్రాబాద్‌లో ఓ వృద్ధుడికి రూ.42.75లక్షలు శఠగోపం పెట్టాడు. వివరాలిలా ఉన్నాయి.

- షేక్‌పేట్ ప్రాంతానికి చెందిన వృద్ధుడు (70)కి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు మీ నల్లా బిల్లు పెండింగ్ ఉందని, వెంటనే చెల్లించకుంటే కనెక్షన్ కట్ చేస్తామని బెదిరించారు. ఆన్‌లైన్‌లో చెల్లించే వీలుందని బాధితుడి ఫోన్‌కు ఏపీకే లింక్ పంపారు. లింక్ ద్వారా వివరాలు నమోదు చేశాడు. కొద్దిసేపటి తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. తర్వాత ఆన్‌చేసి చూసిన బాధితుడికి పలు బ్యాంక్ ఖాతాల

మిగతా 6వ పేజీలో..

# దత్తత తీసుకుంటే హతమార్చాడు

- ఆస్తి వాటాల్లో గొడవలు
- అక్క హత్య కేసులో తమ్ముడిసహా ముగ్గురికి రిమాండ్



పప్పురామ్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి లో జరిగిన హత్య కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతురాలు లీలాదేవికి పప్పురామ్ సొంత తమ్ముడు కాదని తేలింది. లీలాదేవి తల్లిదండ్రులకు ఏడుగురు ఆడపిల్లలు. మగ పిల్లలు లేకపోవడంతో మృతురాలు సోదరుడి కుమారుడైన పప్పురామ్‌ను చిన్నప్పుడే దత్తత తీసుకున్నట్లు తెలిసింది. నాటినుంచి పప్పురామ్‌ను సొంత తమ్ముడి కంటే ఎక్కువగా చూసుకుంది. ఆమె వద్దనే ఉంటూ ఎల్‌బీనగర్‌లో షాపు చూసుకునేవాడు. భర్త చనిపోయినప్పటి నుంచి అన్ని బాధ్యతలను అతడికి అప్పగించింది. ఏడాదిన్నర క్రితం బాటసింగారంలో 120 గజాల ఇల్లు కొనుగోలు చేశారు. అక్కడే ఉంటూ స్థానికంగా కిరాణాషాపు నిర్వహిస్తున్నారు. పప్పురామ్‌ను పూర్తిగా నమ్మిన మృతురాలు లీలాదేవి ఇంటితో పాటు షాపు, కారును అతడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించింది. ఆస్తి విషయంలో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. తన వాటా పంచాలని పప్పురామ్‌ను ఒత్తిడి చేసింది. గతనెల 28వ తేదీన ఇద్దరూ గొడవపడ్డారు. కోపోద్రిక్తుడైన అతడు కర్రతో లీలావతి తలపై కొట్టడంతో చనిపోయింది. ఏమి చేయాలో తోచక షాపులో పనిచేస్తున్న రాకేష్, సునీల్‌కు విషయం చెప్పాడు. మృతదేహాన్ని బాత్‌రూమ్‌లో దాచిపెట్టారు. రెండు రోజుల తర్వాత మృతదేహాన్ని మజీద్‌పూర్ తీసుకెళ్లి రెండు ముక్కలు చేసి చెరువులో పడేశారు.

### ఎనిమిది రోజుల తర్వాత..

ఎనిమిది రోజుల తర్వాత తన అక్క కనిపించడం లేదని పప్పురామ్ అబ్దుల్లాపూర్‌మెట్

మిగతా 8వ పేజీలో..

# రూ.6.15 కోట్లు..రియల్ ఎస్టేట్ మోసం

- భాగస్వామి సహా ఆరుగురిపై కేసు
- కంపెనీల పేర్లు మారుస్తూ భూముల విక్రయం
- ఒకే భూమిని పలువురికి విక్రయించినట్లు ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భారీ ఆర్థిక మోసం వెలుగుచూసింది. రూ.6.15 కోట్ల పెట్టుబడిని మోసపూరితంగా స్వీకరించి అవే భూములను ఇతరులకు విక్రయించారని ఫిర్యాదు రావడంతో సైబరాబాద్ ఎనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌కు చెందిన వ్యాపారవేత్త బొర్రా సుబ్రహ్మణ్యం రెడ్డి (67) ఆర్ఆర్ వెంచర్స్ అనే భాగస్వామ్య సంస్థకు మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు. వ్యాపార విస్తరణ కోసం ఆర్ఆర్ వెంచర్స్ భాగస్వామి బి.రాజశేఖర్‌రెడ్డితో కలిసి భూములు కొనుగోలు చేయాలనుకుంటున్న సమయంలో వీబీహెచ్‌సీ హైదరాబాద్ వాల్యూ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు శుభమ్ అగర్వాల్, రామకృష్ణ సబ్బినేని, కిరణ్‌కుమార్ మంసనపల్లి, మధుబాల వారిని సంప్రదించారు. పటాన్‌చెరు మండలం అమీన్‌పూర్ గ్రామ పరిధిలో ఉస్కాబావి ప్రాంతంలో తమకు సుమారు 17.18 ఎకరాల భూమి ఉందని, గజానికి రూ.15,000 చొప్పున మొత్తం రూ.69.96 కోట్లకు విక్రయించేందుకు 2017 మార్చి 23న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ మేరకు వివిధ మార్గాల ద్వారా రూ.6.15 కోట్లు తీసుకున్నారు.



### రిజిస్ట్రేషన్ చేయకుండా మళ్లీ విక్రయం

అయితే ఒప్పందం ప్రకారం భూముల రిజిస్ట్రేషన్ చేయకుండా, వాటినే ఫిర్యాదుదారుకు తెలియకుండా మరో సంస్థ (ప్రైడ్ ఇండియా మాన్షన్స్ ప్రై.లి.) నిర్వాహకుడు ఎం.డీ. అబ్దుల్ అలీంకు విక్రయించేందుకు 2018 జూన్ 21న ఒప్పందం చేసుకున్నాడు. ఈ కుట్రలో ఆర్ఆర్ వెంచర్స్ భాగస్వామి రాజశేఖర్‌రెడ్డి కూడా భాగమయ్యాడు. అయితే అవే భూములకు సంబంధించిన మరొక ముందస్తు ఒప్పందం ఇతరులతో 2016లోనే చేసుకున్నాడని వెలుగు చూసింది. ఈ విషయాన్ని కావాలనే దాచిపెట్టి తమను మోసం చేశారని, కంపెనీ పేర్లను మారుస్తూ ప్రాజెక్టును 'అస్తా మేడోస్' పేరుతో కొనసాగించడం కూడా మోసపూరిత చర్యలేనని బొర్రా సుబ్రహ్మణ్యంరెడ్డి ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) డీసీపీ ఆదేశాల మేరకు పోలీసులు మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

# బడ్జెట్‌లో మూసీ మురిసేనా?

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మూసీనది అభివృద్ధిపై పూర్తిస్థాయిలో వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయిస్తారోనని ఆసక్తి నెలకొన్నది. మూసీనది రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బడ్జెట్‌లో మూసీ ప్రాజెక్టుకు గతేడాది రూ.1,500 కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది భారీగా నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. మూసీ వెంట వివిధ ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణం, ఇరువైపులా రోడ్ల అభివృద్ధి తదితర వాటికి పెద్దపీట వేసే అవకాశాలున్నాయి. మూసీ వెంట ఉన్న ఆక్రమణలు తొలగించడం, పునరావాసం కల్పించడం, మూసీనదిని 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసి గాంధీ సరోవర్ ప్రాజెక్టును 200ఎకరాల్లో చేపడతామని ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే.



### హెచ్ఎండీఏకు ఏ మేరకు..

హెచ్ఎండీఏ పరిధిలో జరిగే పలు అభివృద్ధి పనులకు రూ. 2వేల కోట్లతో ప్రతిపాదనలు చేశారు. గతంలో ఔటర్ యాన్యూటీ చెల్లింపుల కోసం ప్రతిపాదనలు చేస్తుండగా.. ప్రస్తుతం సికింద్రాబాద్‌లో రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులు, హెచ్‌జీసీఎల్ ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం తదితర భారీ ప్రాజెక్టులున్నాయి. ఆయా ప్రాజెక్టులకు నిధులు కేటాయింపు అవసరమున్నది. గత బడ్జెట్‌లో తొలిసారిగా అభివృద్ధి నిధులు రూ.500కోట్లు హెచ్ఎండీఏకు కేటాయించగా.. హెచ్‌జీసీఎల్‌కు రూ.200కోట్లు కేటాయించారు. హెచ్ఎండీఏ భారీ ప్రాజెక్టులు చేపడుతున్న నేపథ్యంలో ఏ మేరకు నిధులు ఉంటాయనే ఆసక్తి ఉన్నది. నిధులు కేటాయించకపోతే హెచ్ఎండీఏ రుణాలతోనే ప్రాజెక్టులను గట్టెక్కించాల్సి ఉంటుందా? అనేది నేటి బడ్జెట్‌లో తేలనుంది.

### గ్రేటర్ ఆర్టీసీకి ఆశించిన నిధులు దక్కేనా?

గ్రేటర్ పరిధిలో రెండువేల ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.800-1,000కోట్లు కేటాయిస్తే నగరలో ప్రజా రవాణా సాఫీగా సాగుతుందని పట్టణ రవాణా రంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు నడుస్తున్న డీజిల్ బస్సులను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తీసుకు రావాలన్న ప్రణాళికతో ఆర్టీసీ అధికారులు ఉన్నారు. గ్రేటర్‌లో కాలుష్య నియంత్రణ కీలకంగా మారిన నేపథ్యంలో ఈవీ బస్సులను త్వరగా రోడ్లపైకి తీసుకురావాల్సిన బాధ్యత ఆర్టీసీపై ఉంది.

### ఆరోగ్యశాఖ ఆశలు

నగరంలో టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా జరిగేందుకు బడ్జెట్ పెంపుదలపై ఆరోగ్య శాఖ ఆశలు పెట్టుకుంది. సనత్‌నగర్ టిమ్స్ పనులు ముగింపు దశలో ఉన్నాయి. అల్వాల్, కొత్తపేటలో పనులు సాగుతున్నాయి. బడ్జెట్ పెంచి పనులు వేగిరం చేయాల్సిన అవసరముందని వైద్యులు భావిస్తున్నారు. నిమ్స్‌లో రెండు వేల పడకలతో నిర్మిస్తున్న కొత్త భవనం పనులు సాగుతున్నాయి. నిమ్స్‌లో ఆధునిక పరికరాలు, ఎంఎన్‌జేలో కొత్త యంత్రాల కోసం బడ్జెట్ పెంపుదల కోసం ఎదురు చూస్తున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో చెస్ట్ ఆస్పత్రి కొత్త భవనం నిర్మాణానికి ఈ బడ్జెట్‌లోనైనా మోక్షం లభిస్తుందా..! అని ఆశిస్తున్నారు. ఆస్పత్రుల్లో కొత్త పడకలు, నిలోఫర్, పేట్లబురుజు, సుల్తాన్‌బజార్ ప్రసూతి ఆస్పత్రులు, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో మందులు కొనుగోలు పెంచాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఎంఎంటీఎస్ ఎక్కాలంటే ఆపసోపాలే

## స్టేషన్లలో ప్లాట్‌ఫారాల ఎత్తు తక్కువగా ఉండడంతో ప్రయాణికులకు ఇక్కట్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరవాసులకు అతి చవకైన ప్రయాణాన్ని అందిస్తున్న మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ (ఎంఎంటీఎస్) రాను రాను ప్రయాణికులను ఇక్కట్ల పాలు చేస్తోంది. ఎంఎంటీఎస్ రైళ్ల నిర్వహణలో సమయపాలన పాటించకపోవడం, గూడ్స్ రైళ్లు వస్తున్నాయంటే.. గంటల సమయం వీటిని స్టేషన్లలోనే నిలిపివేస్తుండడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల రైల్వేలైన్లను బలోపేతం చేయడంలో భాగంగా రైలు పట్టాల ఎత్తును పెంచిన దక్షిణమధ్యరైల్వే అధికారులు, పట్టాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్లాట్‌ఫారాల ఎత్తు పెంచడం మరిచారు. దీంతో ప్లాట్‌ఫారం నుంచి సుమారు మూడున్నర అడుగుల ఎత్తులో ఎంఎంటీఎస్ రైలును ఎక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. దిగేటప్పుడు సైతం చిన్నారులతో వచ్చే మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. తక్కువ ఖర్చు కదాని వస్తే, ఎక్కిదిగేసరికి మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్దానగర్ నుంచి రామచంద్రాపురం, లింగంపల్లి నుంచి నాంపల్లి, మేడ్చల్ నుంచి సికింద్రాబాద్, ఘటకేసర్ నుంచి సనత్‌నగర్ వరకు వివిధ మార్గాల్లో నడుస్తున్న 75 ఎంఎంటీఎస్ రైళ్లలో రోజుకు 30 నుంచి 40 వేల మంది ప్రయాణిస్తున్నారు. ప్రధాన టెర్మినల్స్‌తో పాటు బేగంపేట్, హైటెక్ సిటీ వంటి అప్‌గ్రేడ్ చేసిన అమృత్‌భారత్ స్టేషన్లను మినహాయిస్తే, మిగిలిన ఎంఎంటీఎస్ రైళ్లు ఆగే స్టేషన్లు అన్నింటిలోనూ ప్లాట్‌ఫారాలు తక్కువ ఎత్తులో ఉన్నాయి.

### ప్రమాదకరంగా ప్రయాణం

ప్లాట్‌ఫారాల ఎత్తు తక్కువగా ఉండడంతో ఎంఎంటీఎస్‌ల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కొన్ని స్టేషన్లలో రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ప్రయాణికుల జేబుల నుంచి పర్సులు, మొబైల్ ఫోన్లు లేదా ఇతర వస్తువులు జారి పట్టాలపై పడుతున్నాయి. దిగిన ప్రయాణికులు కాసేపు ఆగి వాటి కోసం ప్రమాదకరంగా పట్టాలపైకి వెళ్తుండగా, రైలెక్కిన ప్రయాణికులు వాటిని తీసుకునేందుకు వీలుకాక వదిలేసుకుంటున్నారు. వృద్ధులు, మహిళలతో పాటు, చేతినిండా లగేజీతో స్టేషన్‌కు చేరుకున్న యువకులు సైతం ఎంఎంటీఎస్ రైళ్లలోకి ఎక్కే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన ఎంఎంటీఎస్ రైళ్ల సమయపాలన, స్టేషన్లలో ప్లాట్‌ఫారాల ఎత్తు పెంపు వంటి అంశాలపై దక్షిణమధ్యరైల్వే అధికారులు దృష్టి సారించాలని ఎంఎంటీఎస్ ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేసున్నారు.



లింగంపల్లి స్టేషన్‌లో ప్లాట్‌ఫారం ఎత్తు తక్కువగా ఉన్న దృశ్యం

## ఇన్‌ట్యాక్ సభ్యుడిగా వేదకుమార్

● నాలుగోసారి ఎన్నిక

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇన్‌ట్యాక్) సభ్యుడిగా నాలుగోసారి వేదకుమార్ మణికొండ ఎన్నికయ్యారు. మూడేళ్ల కాలానికి గాను గురువారం జరిగిన ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించారు. నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవంతో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు భారత దేశంలోని ఇతర ప్రాంతాల్లోని స్మారక చిహ్నాలు, చారిత్రక భవనాలు, సాంస్కృతిక, సహజ వారసత్వ ప్రదేశాల గుర్తింపు, సంరక్షణ, పరిరక్షణ కోసం వేదకుమార్ పాటుపడుతున్నారు. అనేక దేశాలు సందర్శించి, చారిత్రక నగరాలు, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలపై అధ్యయనం చేశారు. భారతదేశంలోని వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని దక్కన్ హెరిటేజ్ అకాడమి కార్యదర్శి కట్టా ప్రభాకర్ తెలిపారు.



వేదకుమార్‌కు ఎన్నిక పత్రం అందజేస్తున్న దృశ్యం

## బీజేపీ రాష్ట్ర ప్రతినిధిగా బి. ఇంద్రసేన్ రెడ్డి



హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రతినిధిగా బొల్లంపల్లి ఇంద్రసేన్ రెడ్డి (ఐఎ్‌ఎఆర్)ని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనను రాష్ట్ర ప్రతినిధిగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.






## భూ తగాదాలు.. వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూతగాదాల కారణంగా ఓవ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండల కేంద్రానికి చెందిన బోదాసు శ్రీనివాస్(38)నాలుగు నెలల క్రితం పోచారం డివిజన్ అన్నోజిగూడ, సూర్యానగర్‌లో ఇల్లు కొనుగోలు చేసి భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. స్వగ్రామంలో భూతగాదాల నేపథ్యంలో గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

కీసర రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన గురువారం నాగారం డివిజన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ నుంచి నాగారం వస్తున్న కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో మరో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. వైర్లు నేలకు వాలడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ సమయంలో అటువైపు నుంచి వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పింది. వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి రూ.20 లక్షల చెక్కు అందజేస్తున్న దాతలు

## టీటీడీ ట్రస్ట్‌లకు రూ. 37.55 లక్షల విరాళం

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీలోని వివిధ ట్రస్ట్‌లకు గురువారం రూ.37.55 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన సృజన్ జువెలరీ అధినేత రవికుమార్ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మధుశేషు ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.12.55 లక్షలు, ఆలపాటి సత్యదేవ్ బర్డ్ ట్రస్ట్‌కు రూ.5 లక్షలు అందజేశారు. ఈ చెక్కులను దాతల తరఫున టీటీడీ బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రకు అందజేశారు.

# ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

● కుమారుడి మృతిపై అనుమానంతో తల్లి ఫిర్యాదు



సురేష్ (ఫైల్)



మృతుడి శరీరంపై గాయాలు

బచ్చన్నపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తమ కుమారుడి మరణంపై అనుమానం ఉందని తల్లి ఫిర్యాదు చేయడంతో ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా, బచ్చన్నపేట మండలం, గంగాపూర్‌కు చెందిన బందారపు లక్ష్మీ-సిద్దయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె. చిన్న కుమారుడు బందారం సురేష్(40)కు కవితతో 14 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి దమ్మాయిగూడ అంబేడ్కర్‌నగర్‌లో నివసిస్తూ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12వ తేదీ ఉదయం సురేష్ మృతి చెందినట్టు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. మృతదేహానికి స్నానం చేయిస్తుండగా శరీరంపై తీవ్రమైన గాయాలు గుర్తించిన కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. బంధువులంతా రావడంతో అంత్యక్రియలను నిలిపివేసే సమయం లేకపోవడంతో శవాన్ని పూడ్చిపెట్టారు. తమ కుమారుడిది సహజ మరణం కాదని, శరీరంపై తీవ్రమైన గాయాలుండటంతో కొట్టి చంపారనే అనుమానంతో ఈనెల 17న జవహర్‌నగర్ పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. జవహర్‌నగర్ ఎస్ఐ వేణుమాధవ్, హన్మకొండ కేఎంసీ వైద్యుడు జక్కం సురేందర్, స్థానిక రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి పూడ్చిపెట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక వస్తే విషయం తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

## 'ఫ్యూచర్' బడ్జెట్‌పైనే ఆశలు

(5వ పేజీ తరువాయి)

ఇక్కడే చేపడుతున్నారు. ఇప్పటికే ఆయా ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్ల వరకు కావాలని ప్రతిపాదనలు పంపారు.

### కార్పొరేషన్లకు కాసులొచ్చేనా..?

జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ల ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ప్రభుత్వం కేటాయించే బడ్జెట్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. హెచ్-సిటీలో భాగంగా చేపట్టిన వంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్ఓబీ/ ఆర్‌యూబీలను చేపట్టేందుకు మొదటి విడతలో రూ.5 వేల కోట్లకు పైగా వ్యయంతో పనులు చేపట్టారు. ప్రస్తుతం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే తప్ప పనులు సాఫీగా ముందుకు సాగే పరిస్థితి లేదు. వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నాలాల అభివృద్ధి, విస్తరణ పనులకూ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమానికి ఇటీవల ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందుకోసం మొదటి విడతగా రూ.600కోట్ల వరకు కేటాయిస్తారని ఆశిస్తున్నారు.

### రుణాలు ఎట్లా..?

వివిధ ప్రాజెక్టుల కోసం చేసిన రుణాల బకాయి రూ.4,780 కోట్ల మేర ఉంది. టీ-కోర్‌లో కొత్తగా ఏర్పడిన జీహెచ్ఎంసీకి గతంతో పోలిస్తే ఆదాయమూ గణనీయంగా తగ్గనుంది. ఈ నేపథ్యంలో అప్పుల భారం మూడు కార్పొరేషన్లకు విభజించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీనిపై నియమించిన టాస్క్‌ఫోర్స్ ఇప్పటికే పలు ప్రతిపాదనలు సూచిస్తు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. మొత్తం రుణం ప్రభుత్వం ప్రతిపాదించాలని అధికారులు ప్రతిపాదించగా.. సర్కారు సానుకూలంగా స్పందించలేదని సమాచారం.

### రూ.3 వేల కోట్లకు మెట్రో ప్రతిపాదనలు

బడ్జెట్‌లో మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.3వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్), హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) సంస్థలు ప్రతిపాదనలు పంపాయి. మెట్రో రెండో దశలో భారీ ఎత్తున విస్తరణ పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. అయితే వీటికి ఈ బడ్జెట్‌లోనే కేటాయింపులు చేయాల్సి ఉంది. గత ఏడాది మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.1100 కోట్లు కేటాయించగా, ఈసారి అంతకు మించి కేటాయిస్తేనే రెండో దశ మెట్రో పనులు వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని మెట్రో అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో 2.43 కిలోల గంజాయి స్వాధీనం

● విక్రయిస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్



హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఇదరు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.43 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సరూర్‌నగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ డీటీఎఫ్ సిబ్బంది నిఘా పెట్టారు. మన్సూరాబాద్‌కు చెందిన నక్క రాజేష్ గంజాయి విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 1.07 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. అత్తాపూర్‌లో పిల్లర్ నెంబర్ 146 సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మక్రాన్ దత్రాతిని అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 1.36 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయి శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

## ఉగాది శోభ

(5వ పేజీ తరువాయి)

భక్తులను ఆకట్టుకుంది. ప్రముఖ ప్రాంతాల్లో, దేవాలయాల్లో ఉగాది పచ్చడితో పాటు భక్ష్యాలనూ పంపిణీచేశారు. అయితే, కమర్షియల్ ఎల్పీజీ కొరత, కట్టెలకు డిమాండ్ కారణాలతో గతం కంటే ఈ ఏడాది అన్నదానం, పులిహోర వంటి ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు తగ్గాయి. రవీంద్రభారతి, త్యాగరాయ గానసభ, శిల్పకళావేదిక తదితర సాంస్కృతిక మందిరాలన్నీ తెలుగు సంవత్సరాది వేడుకలతో, కవిసమ్మేళనాలతో గురువారం సందడిగా మారాయి. ఉగాది పచ్చడి, శ్రీరామ నవమినాడు తయారుచేసే పానకంలో పోషక విలువలున్నాయి అంటూ జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ప్రచారం చేయడం విశేషం.

## తప్పించుకోలేరు మిత్రమా

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి ర్యాండమ్‌గా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చిన ఫలితాన్ని బట్టి మాదక ద్రవ్యాలు తీసుకున్న వారిని గుర్తిస్తారు. వారికి డ్రగ్స్ ఎవరు విక్రయించారు..? ఎక్కడి నుంచి ఈ డ్రగ్స్ సరఫరా జరుగుతోంది..? నగరానికి ఎలా వస్తుంది..? అనేక వివరాలను రాబట్టి డ్రగ్స్ ముఠాల ఆకట్టిస్తారు. ఇందుకు ఆయా కళాశాలలు, కార్పొరేట్ స్కూల్స్, ఐటీ కంపెనీల్లోని యాంటీ డ్రగ్స్ కమిటీల సహకారం తీసుకుంటారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, తల్లిదండ్రులను భాగస్వాములను చేయడానికి పోలీస్ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

## వృద్ధుల నుంచి రూ.48లక్షలు కాజేత

(5వ పేజీ తరువాయి)

నుంచి రూ.5.51 లక్షలు వేర్వేరు ఖాతాలకు పంపినట్లు సందేశాలు వచ్చాయి. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

● సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన వృద్ధుడు (68) ఇన్‌ఫ్రా సంస్థలో డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. 'మోతీలాల్ ఓస్వాల్ భాగస్వామ్య సంస్థగా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో ఎక్కువ లాభాలు వస్తాయని మభ్యపెట్టి పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించారు. వారు పంపిన లింక్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొదట రూ.50వేలు పెట్టుబడిగా పంపాడు. లాభం కలిపి రూ.75వేలుగా యాప్‌లో చూపించగా డబ్బును విత్‌డ్రా చేసుకున్నాడు. నమ్మకం వచ్చిన బాధితుడు ఆ తర్వాత సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాలకు పలు దఫాలుగా రూ. 42.75లక్షలు పంపాడు. పెద్ద మొత్తంలో లాభాలు వచ్చినట్లు యాప్‌లో చూపించినా విత్‌డ్రా కాలేదు. జీఎస్‌టీ, ట్యాక్స్, గ్యారెంటీ ఫీజు కలిపి రూ.29.35 లక్షలు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు మల్కాజిగిరి సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

# సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం ఇప్పట్లో లేనట్లే!

**అంతర్గత పనుల జాప్యంతో వాయిదా**
**సిద్ధం కాని ఆపరేషన్ థియేటర్లు, ఏసీ ప్లాంట్**
**జూన్ 2న అందుబాటులోకి తీసుకొచ్చే ఆలోచనలో ప్రభుత్వం**

హైదరాబాద్ సిటీ /ఎర్రగడ్డ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ టిమ్స్‌లో అన్ని పనులు పూర్తయిన తర్వాతనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఉగాది రోజున ప్రారంభోత్సవం చేయాలనుకున్నప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో వాయిదా పడింది. ఈనెల 16న వైద్యులతో ట్రయల్ రన్ చేయాలని అనుకున్నప్పటికీ అదీ జరగలేదు. టిమ్స్‌లో భవన నిర్మాణ కార్మికులు, ఇతర విభాగాల సిబ్బంది పనులు చేస్తున్నారు. ఒకవైపు పనులు జరుగుతుంటే.. మరోవైపు సేవలను అందుబాటులోకి తీసుకువస్తే రోగులకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలుంటాయని భావించిన అధికారులు ప్రస్తుతానికి వాయిదా వేశారు. గతంలో పరిశీలించిన వైద్య కమిటీ కొన్ని లోపాలను గమనించి, వాటిని సవరించాలని వైద్యాధికారులకు సూచించింది. వారి సూచన ప్రకారం ఈ పనులు పూర్తి కావడానికి మరో రెండు నెలల సమయం పట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మే నెలఖారు నాటికి పనులు పూర్తి చేసి, జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.



నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమైనట్లుగా కనిపిస్తున్న సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి

### అంతర్గత పనులతో ఆలస్యం



లోపల ఇంకా కొనసాగుతున్న పనులు

సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు 2023లో ప్రారంభించారు. బయటి నుంచి చూస్తే పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైనట్లు కనిపిస్తుంది. కానీ అంతర్గతంగా చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆస్పత్రిలోని ఏసీ ప్లాంట్ ఇంకా సిద్ధం కాలేదు. కొన్ని విభాగాలలో ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయి. ఆస్పత్రి వెనక భాగంలో ఛాతీవాదుల ఆస్పత్రి ప్రాంతంలో ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆపరేషన్ థియేటర్లలో పరికరాలను పూర్తిస్థాయిలో అమర్చలేదు. ప్రధాన ద్వారం ఎదుట గార్డెనింగ్ పనులు పూర్తయినా, లోపల పెండింగ్‌లో ఉన్నాయి.

## రోడ్లకు మరమ్మతులు చేపట్టండి: బీజేపీ నాయకులు



ఉప్పర్‌పల్లి శివాలయం మార్గంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

రాజేంద్రనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హైదర్‌గూడ డివిజన్‌లో రోడ్లు అధ్వానంగా మారాయని, అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేపీ సీనియర్ నాయకులు బొక్క బాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు రోడ్లు బాగు చేయాలని కోరుతూ గురువారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాజేంద్రనగర్ కోర్టు ప్రాంగణంతో పాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నివాసం ఉండే ప్రాంతంలో రోడ్లు ధ్వంసమయ్యాయని అన్నారు. ఉప్పర్‌పల్లి పిల్లర్ నంబర్ 179 నుంచి రాజేంద్రనగర్ కోర్టు ప్రాంగణం వరకు, ఉప్పర్‌పల్లి శివాలయం నుంచి పిల్లర్ నంబర్ 143 వరకు, అలాగే ఉప్పర్‌పల్లి నుంచి బాపుఘాట్ బ్రిడ్జికి వెళ్లే మార్గం కూడా అధ్వాన్నంగా మారాయని అన్నారు. వర్షం పడితే రోడ్లన్నీ చెరువుల్లా మారుతున్నాయన్నారు. ఉప్పర్‌పల్లిలో అత్తాపూర్ డివిజన్ కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి రోడ్లు బాగు చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ నిర్మాణ పనులు, పారిశుధ్య నిర్వహణ పనులు మెరుగుపరచాలని బాల్‌రెడ్డి అధికారులను కోరారు.

## 27న శ్రీరామనవమి శోభాయాత్రకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖులు

గోషామహల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27న శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు డా.భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవిందచారి తెలిపారు. సిద్ధింబర్‌బజార్ బహేతిభవన్‌లో భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి కార్యాలయానికి గురువారం పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సీతారాంబాగ్ ఆలయం నుంచి ఈ నెల 27న వేలాది మంది భక్తులతో శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. సీతారాంబాగ్, బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్, అనిత టవర్స్, పురానపూల్‌చౌరస్తా, జుమ్మెరాత్‌బజార్, బేగంబజార్ ఛత్రి, గౌలిగూడ నుంచి పుత్లిబౌలి కోఠి వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, బీజేపీ, హిందూ సంఘటన్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

### ● ఆత్మీయ అభినందన సభ



శ్రీమహాశివరాత్రి జాగారణ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆత్మీయ అభినందన సభ రహీంపురా ప్లేగ్రౌండ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, వాసవీ సేవా కేంద్రం మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- అఫ్జల్‌గంజ్, (ఆంధ్రజ్యోతి)

## కుంట్లూర్-హయత్‌నగర్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు

● వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

హయత్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్- కుంట్లూర్‌కు వెళ్లే దారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు అతి వేగంగా వెళ్లడంతో తరుచూ విజయనగర్ కాలనీ కమాన్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. గత శనివారం మధ్యాహ్నం విజయనగర్ కాలనీకి చెందిన శివ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాలనీ నుంచి హయత్‌నగర్ టు కుంట్లూర్ రోడ్డుకు వెళ్తుండగా కుంట్లూర్ వైపు నుంచి వేగంగా వచ్చిన బైకిస్టు ఢీ కొట్టాడు. దీంతో శివ కిందపడి తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్థానికులు బాధితుడిని హయత్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్థానికంగా వేగం నియంత్రణకు ఏలాంటి సూచికలు లేక పోవడంతో వాహనదారులు అతి వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు విజయనగర్ కమాన్ వద్ద రోడ్డుపైన వేగం నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## 'వేదాలు హిందూ ధర్మానికి మూలాలు'

మన్సూరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మానికి మూలాలు వేదాలేనని, అలాంటి వేదపండితుల ఆశీర్వచనాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు వక్రీకరించడం హిందూ సంప్రదాయానికే అవమానకరమని శ్రీవైష్ణవ సేవా సంఘం తెలంగాణ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మందుల సామేలు వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబారిపేట లక్ష్మీనరసింహాచార్యులు, ప్రధాన కార్యదర్శి కందాల కృష్ణమాచార్యులు మాట్లాడుతూ వేదాలను ద్వేశిస్తూ ప్రసంగించి హిందువులను అవమానపరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, బీజేపీ సైతం నామమాత్రపు ఖండనతో ఎందుకు ఊరుకుందని ప్రశ్నించారు. వెంటనే మందుల సామేలుపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరంగా పోరాడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కోశాధికారి కేవీఆర్ ప్రసాద్, కార్యదర్శి పరంకుశం రోహిత్, వెంకటాచార్యులు, హైకోర్టు అడ్వోకేట్ హరీష్‌కుమార్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు దేవదాసు, రవీందర్



హరినాథ్‌శర్మ పంతులును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డితో మాజీ కార్పొరేటర్ వై.కృష్ణ



ఉప్పర్‌పల్లి శివాంజనేయస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న కృష్ణప్రసాద్‌శర్మ



రామచందర్‌రావుకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ నేత శంకర్‌రెడ్డి, గణపతి తదితరులు

# ఘనంగా ఉగాది

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

● పంచాంగ శ్రవణం చేసిన పండితులు

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ బృందం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్లలోని అన్ని ప్రాంతాల్లో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ శ్రవణంలో ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రజలు వారి ఇళ్లలో పూజలు చేసి ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు



చాంద్రాయణగుట్ట కుమ్మరివాడిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ మహేశ్‌గౌడ్ తదితరులు



అఫ్జల్‌గంజ్ సీఐ మోహన్‌రావుకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ నాయకులు దినేశ్‌యాదవ్, శివాజీ



లాల్‌దర్వాజ గౌలిపురా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు



ఫలక్‌నుమా మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వాతల రాజేందర్ తదితరులు



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ నేత వెంకటేశ్



అత్తాపూర్ లక్ష్మీహారన్ అపార్ట్‌మెంట్‌లో ఉగాది వేడుకలు

### ఉగాది వేడుకల్లో హరీశ్‌రావు



కోకాపేట్‌లోని శ్రీవిశాఖ శారదాపీఠం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రస్వామి, మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్రస్వామివారి ఆశీస్సులను హరీశ్‌రావు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- నార్సింగ్, (ఆంధ్రజ్యోతి)

## బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలి

● జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

బర్కత్‌పుర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత బడ్జెట్ సమావేశాలలో బీసీల సంక్షేమానికి 20వేల కోట్ల రూపాయలు కేటాయించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీల సంక్షేమానికి ప్రతియేటా 20వేలకోట్ల రూపాయలు కేటాయిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. ఇషామియా బజార్ మోతీమార్కెట్‌లోని మహాసభ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీల సంక్షేమానికి కేటాయించిన నిధులు, ఖర్చుచేసిన నిధులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క దీనిపై తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని ఆయన కోరారు. బీసీలను విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించిన తరువాతనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ మహాసభ నేతలు పాల్గొన్నారు.

## బంగారు పోచమ్మ దేవాలయంలో అన్నదానం



బంగారు పోచమ్మను దర్శించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ధర్మారెడ్డి, యాదయ్య, సుమలత తదితరులు



భక్తులకు అన్నం వడ్డిస్తున్న తెలంగాణ ఉద్యమ నాయకుడు యాదయ్య, సుమలత తదితరులు

రాజేంద్రనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆవరణలోని బంగారు పోచమ్మ దేవాలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని తెలంగాణ ఉద్యమ నాయకుడు ఎర్రొళ్ల యాదయ్య నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎర్రొళ్ల సుమలత పాల్గొన్నారు. అనంతరం యాదయ్య మాట్లాడుతూ, "మా నాన్న దివంగత ఈఆర్‌గోపాల్ గగన్‌పహడ్ సర్పంచ్‌గా అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించారు"ని అన్నారు. ఆయన అడుగు జాడలలో పనిచేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామన్నారు. అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, బంగారు పోచమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, సూర్యం, నాయకులు జీవన్‌దాస్, దుర్గేశ్, గౌతమ్, జగదీశ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలి

చిక్కడపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందసంస్థలు ప్రజలను సైబర్ నేరాల నుంచి తప్పించే విషయంలో తమ వంతు సహకారం అందించాలని చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ సూచించారు. ఆలిండియా క్రిష్టియన్ ఫెడరేషన్ రజతోత్సవాల సందర్భంగా రమేశ్‌కుమార్‌ను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.గిడియోన్‌బాబు సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం సైబర్‌నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. స్వచ్ఛంద సంస్థలు తాము నిర్వహించే సేవా కార్యక్రమాలతోపాటు సైబర్‌నేరాలు అరికట్టే విషయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పకూడదని ఆయన సూచించారు. గిడియోన్‌బాబు మాట్లాడుతూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పటిష్ఠంగా అమలుచేస్తూ సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ప్రధానకార్యదర్శి బిషప్ డా.శామ్యూల్, జాన్, కార్యనిర్వాహకకార్యదర్శి శాంతికుమార్ గిలా, బుడిగే కలేబు తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌నగర్ కాలనీ ఐఎస్‌బ్ల్యూ కార్యాలయం వద్ద రహదారిపై చెట్టుకొమ్మలు



షకీలా లహరి అపార్ట్‌మెంట్ ఫుట్‌పాత్‌పై వ్యర్థాలు, చెట్టు ఆకులు




గుట్టలా చెట్టు ఆకులు

## ఆనంద్‌నగర్ కాలనీలో కానరాని స్వచ్ఛత

● రహదారి వెంట రోజుల తరబడి పేరుకుపోతున్న వ్యర్థాలు

● పట్టించుకోని అధికారులు

పంజాగుట్ట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ డివిజన్ ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలో విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని కొన్ని రోజుల క్రితం చెట్టుకొమ్మలు కొట్టారు. వాటిని తొలగించడం మరిచారు. అలాగే, కాలనీలోని పలు రహదారుల్లో వ్యర్థాలు, చెట్టుకొమ్మలు, ఆకులు గుట్టల్లా పేరుకుపోతున్నా వాటిని తొలగించడం లేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి మహిళా మండలికి వెళ్లే రహదారిలో గడిచిన కొన్ని రోజులుగా ఇరువైపులా చెట్టుకొమ్మలు, ఆకులు, వ్యర్థాలు పడి ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఆనంద్‌నగర్ కాలనీ మహిళా మండలి కార్యాలయానికి వెళ్లే మార్గంలో వ్యర్థాలు, చెట్టుకొమ్మలు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/3JRkIMx లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

### ● మల్లన్న బోనాలు



శివరాంపల్లిలో గురువారం మల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మల్లన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు సాంబ భిక్షపతి, భక్తులు పాల్గొన్నారు.

- రాజేంద్రనగర్, (ఆంధ్రజ్యోతి)

### ● ఈద్గా పరిశీలన



ఈ నెల 21న జరిగే రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం రాజేంద్రనగర్ ఈద్గాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్, సీఐ ముత్తుయాదవ్ తదితరులు

- రాజేంద్రనగర్, (ఆంధ్రజ్యోతి)

## కుమార్తె పెళ్లి రద్దయిందని తండ్రి ఆత్మహత్య

బోరబండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుమార్తె పెళ్లి రద్దయిందని మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హబీబ్ ఫాతిమానగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన దుర్గం రవీందర్(50) కొన్నేళ్లుగా హెచ్.ఎఫ్.నగర్‌లో ఉంటున్నాడు. మాదాపూర్ సైబర్ టవర్స్ వద్దనున్న గ్రీన్‌కో సంస్థలో కేటరింగ్ పనిచేసేవాడు. గురువారం తెల్లవారుజామున ఇంటిపై ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురి పెళ్లి రద్దయినందుకు తీవ్ర మనస్తాపంతో రవీందర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రవీందర్ కొడుకు అఖిల్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మాదాపూర్ సర్కిల్ కార్యాలయం న్యాక్ భవనంలోకి తరలింపు

హైటెక్‌సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న మాదాపూర్ సర్కిల్-50 కార్యాలయం హైటెక్స్ సమీపంలోని ఇజ్జత్‌నగర్ వద్ద ఉన్న న్యాక్ కార్యాలయం భవనంలోకి తరలించినట్టు డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరసేవల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు గుర్తించాలని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీ.. కేసు నమోదు

బోరబండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పరస్పరం బాహాబాహికి దిగారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు ఇద్దరు కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంజాన్ సందర్భంగా ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో సామూహిక ప్రార్థనల ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి మాజీ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చారు. ఆ సమయంలో వాగ్వాదానికి దిగిన ఎం.డి.మన్సూర్, సయ్యద్ షరీఫ్ తనపై దాడి చేసి కొట్టారని ఎం.డి.ఇక్బాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంతేగాకుండా తనపై రాళ్లు రువ్వారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మాజీ కార్పొరేటర్ సమక్షంలోనే ఇదంతా జరిగిందని పోలీసులకు చెప్పారు. ఇక్బాల్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు మన్సూర్, షరీఫ్‌పై కేసు నమోదు చేశారు.

## ఉచిత భోజనం ప్రశంసనీయం : తలసాని

అమీర్‌పేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆకలితో ఉన్న వారికి ఉచితంగా భోజనం అందించడం ప్రశంసనీయమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్ మోడల్ కాలనీ కమాన్ వద్ద మానవ సేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిత ఆహారం పంపిణీ, తాగునీటి పంపిణీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ట్రస్టీ బుచ్చిబాబు, సభ్యులు మాచారావు, సాయి, చావా శ్రీనివాసరావు, శశికాంత్, రవిబాబు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పీయూష్‌గుప్తా, ఖలీల్‌బేగ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389 కె. అనిల్ కుమార్: 99854 03628

## 'రాజ శ్యామల' దేవస్థానంలో ఉగాది వేడుకలు



గంటల పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ, స్వరూపానందేంద్ర సరస్వతి తదితరులు

**నార్సింగ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** కోకాపేట విశాఖ శారదా పీఠంలోని రాజ శ్యామల అమ్మవారి దేవస్థానంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ శారదా పీఠం గంటల పంచాంగాన్ని ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణంలో చిర్రావూరి విజయనాథ్ శర్మ నూతన తెలుగు సంవత్సరాది ఫలితాలను వివరించారు. అనంతరం స్వరూపానందేంద్ర సరస్వతీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ వేడుకలకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, పట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ నరసింహా రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ ఎంపీ సంతోష్ కుమార్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మురళీధర్ రావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సతీష్ రెడ్డి, ఎన్‌సీఎల్‌టీ సభ్యుడు జస్టిస్ బద్రీనాథ్, మాజీ న్యాయమూర్తి మఠం వెంకటరమణ, మాజీ డీజీపీ అంజన్ కుమార్, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, గజల్ గాయకుడు శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

## శిల్పారామంలో సాంస్కృతిక సంబురం



కళాకారుల నృత్య ప్రదర్శన

**మాదాపూర్, మార్చి19(ఆంధ్రజ్యోతి) :** మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం పరాభవనామ సంవత్సర ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉస్మానియా వర్సిటీ తెలుగుశాఖ ఆచార్యులు, జ్యోతిష్యులు సాగి కమలాకరశర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం డాక్టర్ బిందు అభినయ శిష్య బృందం చేసిన ఉగాది వైభవం కూచిపూడి నృత్యరూపకం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

## ఏపీలో కూటమి ప్రభుత్వానికి తిరుగులేదు

- **ఎన్టీఆర్ భవన్‌లో పంచాంగకర్త మల్లికార్జున శర్మ**

**హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** ఏపీలో కూటమి ప్రభుత్వానికి తిరుగులేదని పంచాంగకర్త డాక్టర్ నాయకంటి మల్లికార్జునశర్మ అన్నారు. కొత్త ప్రాజెక్టులు సఫలీకృతం అవుతాయని, మంత్రుల శాఖల్లో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందని తెలిపారు. శ్రీ పరభావనామ ఉగాది పర్వదినం సందర్భంగా గురువారం, ఎన్టీఆర్‌భవన్‌లో ఆయన పంచాంగశ్రవణం చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని, పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉంటారన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు బాగా వృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి, జాతీయ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు అజ్మీరా రాజు నాయక్, కాణిపాకం దేవస్థానం బోర్డు సభ్యులు శ్రీపతి సతీష్, పొలంపల్లి అశోక్, కందికంటి అశోక్ కుమార్ గౌడ్, సూర్య దేవర లత తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకలకు విశిష్ట స్థానం

- **కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి**



ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**బర్కత్‌పుర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):** భారతీయ ఆధ్యాత్మికతలో ఉగాది వేడుకలకు విశిష్ట స్థానం ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రజలు పాడిపంటలతో విరాజిల్లాలని, సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి సూర్యప్రకాష్ సింగ్, కార్యదర్శి ఎక్కాల కన్నా, నేతలు బల్వీర్, వినోద్ యాదవ్, మూల రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్-2026 ప్రదానోత్సవం గురువారం హైటెక్స్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సినీ ప్రముఖులు, నటులు హాజరై సందడి చేశారు.

-ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

# వలస కార్మికుల పిల్లల కోసం 'వర్క్‌సైట్' స్కూళ్లు

- ప్రాథమిక విద్యతోపాటు భద్రత కల్పించేందుకు చర్యలు
- సైబరాబాద్ సీపీ రమేష్ సరికొత్త ఆలోచన
- త్వరలో అమలుకు కసరత్తు

**హైదరాబాద్ సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి) :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహా నగరానికి బిహార్, జార్ఖండ్, యూపీ, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది కార్మికులు బతుకుదెరువు కోసం నగరానికి వలస వస్తున్నారు. హోటళ్లు, పరిశ్రమలు, దుకాణాలు, భవన నిర్మాణ రంగంలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. గ్రేటర్ పరిధిలోనే సుమారు 8-10 లక్షల మంది వలస కార్మికులు ఉన్నట్లు అధికారులు అంచనా. ఏజెంట్లు, మధ్యవర్తులు, ఇతర నిర్వాహకులు వారికి పని ప్రదేశంలో తాత్కాలిక వసతి కల్పించి వదిలేస్తున్నారు. దీంతో వారు అపరిశుభ్ర వాతావరణంలో బతుకు వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలో వలస కార్మికుల పిల్లలకు పని ప్రదేశంలో భద్రత లేకుండా పోతుంది. తల్లిదండ్రులు ఇద్దరూ పనికి వెళ్లినప్పుడు వారిని మిగిలిన పిల్లలతో కలిసి లేబర్ క్యాంపుల్లో వదిలేయడం లేదా మరీ చిన్న పిల్లలైతే తమతోపాటు పని ప్రదేశానికి తీసుకెళ్లి పనులు చేయడం చేస్తున్నారు. ఈ క్రమంలో లేబర్ క్యాంపుల్లో ఒంటరిగా ఉండే పిల్లలకు రక్షణ ఉండడం లేదు. కొంత మంది ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థులు, కామాంధులు ఆ చిన్నారులపట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. లైంగిక దాడులకు పాల్పడటం, ఎత్తుకెళ్లడం చేస్తున్నారు.



రక్షణతోపాటు విద్య

లేబర్ క్యాంపుల్లో ఒంటరిగా ఉంటున్న వలస కార్మికుల పిల్లలకు రక్షణ కల్పించడంతో పాటు.. ప్రాథమిక విద్యను అందించేందుకు సైబరాబాద్ సీపీ ఎం.రమేష్ కసరత్తు చేస్తున్నారు. పని ప్రదేశాల్లోనే వర్క్ సైట్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ మేరకు నిర్మాణ సంస్థల యాజమాన్యాలు, లేబర్ క్యాంపు నిర్వాహకులు, కన్‌స్ట్రక్షన్ సంస్థలు, ఎన్జీవోలు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) తదితర సంస్థల భాగస్వామ్యం తీసుకోవాలని నిర్ణయించారు. చిన్నారులకు అందించే విద్యను నర్సరీతో ప్రారంభించి ఏ తరగతి వరకు అందించాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీపీ రమేష్ వలస కార్మికుల గుర్తింపు కోసం చర్యలు తీసుకున్నారు. పని ప్రదేశాల్లో వారికి ఏదైనా ప్రాణ నష్టం సంభవిస్తే వెంటనే బాధిత కుటుంబాలకు ఇన్సూరెన్స్ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. సీపీ నిర్ణయాల వల్ల లక్షలాది కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండే అవకాశాలున్నాయి.

## రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలి

- **సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ**

**రాంనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 2026-27 వార్షిక బడ్జెట్‌లో బీసీల అభివృద్ధి, సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రతియేటా బీసీలకు రూ.20 వేల కోట్లను కేటాయిస్తామని ప్రకటించింది కానీ, రెండున్నర సంవత్సరంలో రూ.10 వేల కోట్లను కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్లు కేటాయించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో 290 గురుకుల పాఠశాలలు, 325 కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు, కనీస వసతుల కల్పనకు నిధులు కేటాయించాలన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు, 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తి ప్రకారం రూ.5 వేల కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విదేశీ విద్య స్టైఫండ్ కోసం రూ.300 కోట్లు కేటాయించాలని కోరారు. ప్రతీ నియోజకవర్గానికి బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మనీ పెంచాలని లేఖలో పేర్కొన్నారు.

## ఘనంగా కవి సమ్మేళనం





రవీంద్రభారతిలో కవులను సత్కరించిన అతిథులు

**రవీంద్రభారతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** శ్రీ పరాభవ నామ ఉగాది పర్వదినం పురస్కరించుకుని గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవులు ఎన్.గోపి, అన్నవరం దేవేందర్, నెల్లుట్ల రమాదేవి, వఝల శివకుమార్, జూకంటి జగన్నాథం, సిద్ధార్థ, వెంకటేశ్వర్‌రెడ్డి, యాకూబ్, రామోజు హరగోపాల్. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఆశారాజు, జపాక సుభద్ర, కందుకూరి శ్రీరాములు, గోగు శ్యామల, షాజహాన, మెర్సీ మార్గరేట్, ఐనంపూడి శ్రీలక్ష్మి, నాళేశ్వరం శంకరంతో పాటు 72మంది కవులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఐఏఎస్ ఏనుగు నరసింహారెడ్డి కవులందరినీ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ లలిత కళల్లో కవిత్వం అన్నింటి కంటే బాధ్యతాయుతమైనదన్నారు. సమాజహితం కోసం కవులు శక్తి మేరకు కృషి చేయాలని, నిర్మాణాత్మకమైన కవిత్వం రాయాల్సిన అవసరముందని తెలిపారు. అనంతరం నాలుగు సెషన్లుగా జరిగిన కవి సమ్మేళనంలో 72మంది కవులు ఉగాది విశిష్టతను చాటుతూ తమ కవితలను చదివి వినిపించారు.

# వేదాల గొప్పదనం నేటి తరానికి తెలియాలి

- **ఆర్‌వీఎస్‌ఎస్ అవధానులు**



ఆర్‌వీఎస్‌ఎస్ అవధానులును సత్కరిస్తున్న నిర్వాహకులు

**మియాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** రేపటి తరం పిల్లలు, ప్రజలకు అర్థమయ్యేలా వేదం, రామాయణం, మహాభారతం, ఇతిహాసాలను అందించడం కోసం కృషి చేస్తున్నానని వేదభారత వ్యవస్థాపకుడు ఆర్‌వీఎస్‌ఎస్ అవధానులు అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా గురువారం మియాపూర్ దీప్తిసనగర్‌లోని శ్రీధర్మపురి క్షేత్రంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులు, కవులను శ్రీ ధర్మపురి క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు నిర్వాహకురాలు గొట్టిపాటి సత్యవాణి తమ భారతీయం నిర్వాహకులతో కలిసి ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో ఆర్‌వీఎస్‌ఎస్ అవధానులు, రిటైర్డ్ న్యాయమూర్తి నాగమూర్తిశర్మతోపాటు నేషనలిస్ట్ హబ్ నిర్వాహకులు సాయిని తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆర్‌వీఎస్‌ఎస్ అవధానులు మాట్లాడుతూ రేపటి తరానికి వేదాలు అందించాల్సిన బాధ్యత ప్రస్తుత ఆధ్యాత్మిక గురువులకు ఉందన్నారు. అందులో భాగంగానే వేదభారత ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. ఉగాది పంచాంగ శ్రవణాన్ని భారతీయం కన్వీనర్ మావుదూరు సూర్య నారాయణమూర్తి చదివి వినిపించారు. ధర్మపురి క్షేత్ర నిర్వాహకురాలు గొట్టిపాటి సత్యవాణి మాట్లాడుతూ నిరాశ ప్రతి మనిషిలో దరిచేరనంత వరకు ఏ రాశి ఏ గ్రహాలు ఏమీ చేయలేవన్నారు. అనంతరం కలర్స్ ఆఫ్ డ్యాన్స్ నిర్వాహకురాలు ప్రవీణ బృందం నిర్వహించిన చిన్నారుల శ్రీనివాస కల్యాణం నృత్యం రూపకం అలరించింది. బుర్రకథ పితామహుడు షేక్ నాజర్ కుమారుడు 101 బుర్ర కథలను పుస్తకాల రూపంలో రాసిన షేక్ బాహుజీకి బంగారు కంకణంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంటినెంటల్ కాఫీకింగ్ చల్లా రాజేంద్ర ప్రసాద్, సత్య దేవ, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మళ్లీ తెరపైకి వట్టినాగులపల్లి భూ వివాదం

- **245 సర్వే నంబర్‌లో ప్రహరీ నిర్మాణం.. అడ్డుకున్న మరో వర్గం**

**రాయదుర్గం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** గచ్చిబౌలి వట్టినాగులపల్లి సర్వే నంబర్ 245లో మరోసారి భూ వివాదం తెరపైకి వచ్చింది. ఈ భూమిపై గతంలో ఓ మంత్రి కుమారుడిపై కేసు నమోదైంది. దీంతో గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ బదిలీకావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదంపై న్యాయస్థానం స్టేటస్‌కో ఆర్డర్ విధించింది. తాజాగా 245 సర్వే నంబర్‌లో భూ యజమానులు బుధవారం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. అదే సమయంలో మరో వర్గానికి చెందిన సుమారు 15 మంది అక్కడకు వచ్చి ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్నారని భూ యజమానులు తెలిపారు. వారు ముఖానికి మాస్కులు ధరించి ప్రహరీని నేలమట్టం చేశారు. కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేసిన భూ యజమానులనుపై దాడికి ప్రయత్నించారు. దీంతో స్థల యాజమానులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. గూండాలకే పోలీసులు సపోర్టు చేశారని యజమానులు ఆరోపించారు. స్టేటస్‌కో ఉండటంతో స్థలంలో ఎవరూ ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి కేసులు నమోదు చేయ్యలేదని చెప్పారు.

## దత్తత తీసుకుంటే హతమార్చాడు

(5వ పేజీ తరువాయి)

పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వేరే వారితో ఫోన్‌లో మాట్లాడేదని పోలీసులకు చెప్పాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పుప్పురామ్‌పై అనుమానంతో బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా జరిగిన విషయం చెప్పి నేరాన్ని అంగీకరించాడు. అతడితోపాటు సహకరించిన రాకేష్, సునీల్‌కుమార్‌ను గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

## డ్రగ్స్ టెస్ట్‌కు సై అంటే సై

- **ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం**



ఎల్‌బీనగర్‌లో మహనీయుల విగ్రహాల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

**మన్సూరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) :** ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య డ్రగ్‌వార్ ఉద్రిక్తంగా మారింది. బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులు డ్రగ్స్ టెస్ట్‌కు రావాలంటూ బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. దీంతో ఎల్‌బీనగర్ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నేతలు గురువారం ఎల్‌బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్దకు చేరుకున్నారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొని డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధపడ్డారు. తాము సైతం సిద్ధమంటూ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, తమ బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులతో కలిసి అక్కడికి వచ్చారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల్లో కొందరిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతియుతంగా సవాలు స్వీకరించేందుకు వచ్చిన తాము వేసే ప్రశ్నలకు సమాధానం ఎక్కడ చెప్పాల్సి వస్తుందోనన్న భయంతో కాంగ్రెస్ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. తాము ఎప్పుడైనా.. ఎక్కడైనా డ్రగ్ టెస్టుకు సిద్ధమని, తమ నాయకుడు కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు చేసిన డ్రగ్స్ ఆరోపణలు నిరాధారమని తెలిపారు.

## ప్రత్యేక అలంకరణలో బల్కంపేట ఎల్లమ్మ

**అమీర్‌పేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలు పురస్కరించుకుని గురువారం బల్కంపేట ఎల్లమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. దాతలు అందజేసిన పూలు, పండ్లు, మామిడి కాయలతోపాటు రకరకాల పిండి వంటలు, స్వీట్లు పెట్టి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇన్‌చార్జి ఈవో వినోద్‌రెడ్డి, చైర్మన్ సాయిబాబా గౌడ్, ధర్మకర్తలు భక్తులకు అన్ని ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

**WANTED**

★ బేగంపేట్, షామ్‌లాల్ బాంబే హల్వా కాంపౌండ్‌లోని చిన్న కుటుంబానికి Veg & Non Veg. చేయుటలో 15 సం.ల అనుభవం ఉండాలి. మగ వంటమనిషి కావలెను. మంచిజీతం కలదు. ఫోన్: 9701949444 AJH-003773

**PLOT FOR SALE**

★ విజయవాడ, అమరావతి, కంచికచర్ల, బందరురోడ్, ఔటర్ రింగ్‌రోడ్‌లో CRDA, DTCP ప్లాట్స్, నందిగామ టౌన్ హైవేకి దగ్గర ఇళ్ల ప్రక్కన, చ.గ. 3,999/- నుండి 7,999/- సం్రప: ✆ 70750 46088 AJB-194

**CHANGE OF NAME**

★ I, Sakamuri Suresh, No. 589, Vasanth Nagar, Kukatpally-85 has changed my daughter name from Sakamuri Sahasri to Sakamuri Sahasri Priya for all purposes ref SSC 28144427 AJH-4298

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు. 99859 21380, 99859 21386 97036 18806

# రైళ్లలో ఏటా 58కోట్ల భోజనాలు!

- సగటున 0.0008 శాతమే ఫిర్యాదులు
- మూడేళ్లలో రూ.2.6కోట్ల జరిమానా
- నివేదిక వెల్లడించిన ఇండియన్ రైల్వే

**హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** దేశవ్యాప్తంగా ప్రతీరోజూ 13వేలకు పైగా రైళ్లను భారతీయ రైల్వే నడుపుతోంది. ఈ రైళ్ల ద్వారా ఏడాదికి సుమారు 850కోట్లమంది ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తోంది. అయితే, దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ప్రయాణించే వారికి ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ద్వారా వివిధ రకాల సేవలను అందిస్తున్నారు. అందులో భాగంగా ప్రతియేటా 58కోట్ల మంది రైల్వే ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ ద్వారా భోజనాలను సరఫరా చేస్తున్నట్లు ఇండియన్ రైల్వే తాజాగా ఒక నివేదికలో పేర్కొంది. సగటున 0.0008శాతం ఫిర్యాదులు మాత్రమే అందాయని, గత మూడేళ్లలో అందిన ఫిర్యాదులపై విచారణల ఆధారంగా రూ.2.6కోట్ల జరిమానాలను విధించినట్లు తెలిపింది. రైల్వేలో మరిన్ని సంస్కరణలు తీసుకువస్తున్నట్లు పేర్కొంది. ప్రధానంగా రైళ్లలో క్యాటరింగ్ సదుపాయాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవడానికి రైల్వే అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైలులోని సేవలను నిరంతరం పర్యవేక్షించడానికి, ప్రయాణికుల సమస్యలను రియల్ టైమ్‌లో పరిష్కరించడానికి పర్యవేక్షకులను ఐఆర్‌సీటీసీ నియమించింది. ప్రయాణికులకు నిర్దేశించిన ధరల ప్రకారం ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచడానికి, రైళ్లలో అధిక చార్జీలను అరికట్టడానికి పలు చర్యలు చేపట్టింది.

### ఆన్‌బోర్డు క్యాటరింగ్‌లో చేపట్టిన సంస్కరణలు

- ప్రయాణికులకు ధరల గురించి అవగాహన కల్పించడానికి, మెనూ, టారిఫ్ వివరాలతో కూడిన లింక్‌ను మొబైల్‌కు పంపడం.
- బిల్లింగ్, నగదు రహిత చెల్లింపుల కోసం పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాలను ఏర్పాటు చేయడం.
- బిల్లింగ్‌ను ప్రోత్సహించడానికి, అధిక వసూళ్లను అరికట్టడానికి అవగాహన/ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం.
- ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బకెట్లు, టీ/కాఫీ కప్పులపై ధరల స్టిక్కర్లను అతికించడం.
- ప్రయాణికులు ఆన్‌లైన్ మాడ్యూల్ ద్వారా భోజనం బుక్ చేసుకోవడానికి వీలుగా, మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఇ-ప్యాంట్రీ సేవను ప్రవేశపెట్టడం.
- ఆన్‌బోర్డ్ క్యాటరింగ్ సిబ్బందికి క్యూఆర్ కోడ్ ఎనేబుల్ చేయబడిన గుర్తింపు కార్డులను జారీ చేయడం.
- క్యాటరింగ్ వస్తువులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిళ్ల ధరల గురించి అవగాహన కోసం కరపత్రాలను పంపిణీ చేయడం.
- అధిక వసూళ్లు, బిల్లింగ్ సమస్యలను తనిఖీ చేయడానికి ప్రత్యేక తనిఖీ డ్రైవ్‌లు.
- అధిక వసూళ్లు జరిగినట్లయితే, తగిన జరిమానా విధించడం.



## ఆటో డ్రైవర్లకు ఎల్‌పీజీ కష్టాలు

- **గ్యాస్ కోసం కిలోమీటర్ల మేర క్యూ**



బేగంపేటలోని శివం పెట్రోల్ పంపు వద్ద రహదారి పై క్యూ కట్టిన ఆటోలు





బస్టాపులో నిద్రపోతున్న ఆటో డ్రైవర్

**బేగంపేట మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** గల్ఫ్ యుద్ధం ఆటో డ్రైవర్లపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ముఖ్యంగా ఎల్‌పీజీతోపాటు సీఎన్‌జీ గ్యాస్‌తో నడిచే ఆటోలకు ఇబ్బందిగా మారింది. నగరంలో సీఎన్‌జీ గ్యాస్ కొరత కారణంగా బంకుల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బేగంపేటలోని శివం పెట్రోల్ బంక్‌కు వద్ద ప్రతీ రోజూ ఆటోవాలాలు సీఎన్‌జీ గ్యాస్ కోసం క్యూలో ఉండాల్సి వస్తోంది. అక్కడ కిలోమీటరు వరకు ఆటోలను రోడ్డు పక్కకు నిలిపి పడిగాపులు పడుతున్నారు. గంటల కొద్దీ వేచి ఉండలేక కొందరు ఖాళీ ప్రదేశాలు, ఆటోల్లో విశ్రాంతి తీసుకుంటూ కనిపిస్తున్నారు.

## ఈద్... ఆధ్యాత్మిక ఆరాధన

ఇస్లాం ధర్మం అత్యున్నతంగా పరిగణించే ఈద్ ఒక ఆధ్యాత్మిక ఆరాధన. అది పవిత్రమైన రంజాన్ నెలవంకను చూసిన తరువాత ఆరంభమై... నెల రోజులు కొనసాగుతుంది. రంజాన్ నెల ముగిసి, షవ్వాల్ నెలవంక కనిపించిన తరువాత... పండుగ (ఈదుల్ ఫిత్ర్) నమాజ్‌తో ముగుస్తుంది. పండుగ (ఈద్) అంటే కరుణామయుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేయడం, ఆయన ప్రసాదించిన వరాలను గుర్తించడం, విశ్వాసులు తమ నమ్మకాలను స్థిరపరుచుకోవడం, ధర్మాన్ని బలపరపరచడం. రంజాన్ మాసంలో ఆచరించిన ఉపవాసాలలో ఏవైనా పొరపాట్లు జరిగినట్టయితే... వాటికి పరిహారంగా నిరుపేదలకు జకాతుల్ ఫిత్ర్‌ను రంజాన్ రోజున కచ్చితంగా చెల్లించాలి. అది పేదలకు అమితమైన సంతోషాన్ని కలిగిస్తుంది. విశ్వాసులలో పరస్పర దయ, సహకార గుణాలను పెంపొందిస్తుంది.

**ఈదుల్ ఫిత్ర్ విధులు:** ఈదుల్ ఫిత్ర్ పర్వదినాన ఉదయాన్నే లేవాలి, కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఫజ్ర్ నమాజ్ తప్పనిసరిగా చదవాలి. తలంటు స్నానం చేయాలి. ఉన్నవాటిలో మంచి దుస్తులు ధరించాలి. పరిమళ ద్రవ్యాలు పూసుకోవాలి. కళ్ళకు సుర్మా పెట్టుకోవాలి. ఈద్ నమాజ్ కన్నా ముందే జకాత్, ఫిత్రా దానాలు చెల్లించాలి. తీపి పదార్థం తినాలి. ఒకటి, మూడు, అయిదు, ఏడు... ఇలా బేసి సంఖ్యలో ఖర్జూరపు పండ్లు తినాలి. ఈద్గా మైదానానికి వెళ్ళేటప్పుడు ఒక దారిలో వెళ్ళాలి, వచ్చేటప్పుడు మరో దారిలో రావాలి. ఈద్ నమాజ్‌కు వెళ్ళేటప్పుడు తక్బీర్ ప్రార్థనను మెల్లగా పలుకుతూ ముందుకు సాగాలి. కాలి నడకన వెళ్ళడం పుణ్యప్రదం. పండుగ నమాజ్ తరువాత తోటివారిని సలామ్ చెబుతూ పలకరించాలి. పిల్లలకు ఈదీ (బహుమతి) ఇవ్వాలి. బంధువుల ఇళ్ళకు వెళ్ళి శుభాకాంక్షలు తెలపాలి. ఇరుగు పొరుగువారిని ఇంటికి ఆహ్వానించి తీపి పదార్థాలను అందించాలి. ఆర్తులు ఎవరైనా ఇంటికి వస్తే వారికి తప్పనిసరిగా దానం చేయాలి. పండుగ నమాజ్‌ను ఇరుకైన జనావాసాలలో కాకుండా... విశాలమైన బహిరంగ ప్రదేశాలలో (ఈద్గా మైదానంలో) చేయడం ఉత్తమం. అది దైవప్రవక్త మహమ్మద్ సంప్రదాయం. ఈద్గా మైదానం అందుబాటులో లేనప్పుడు... స్థానికంగా ఉన్న పెద్ద మసీదుల్లో ఈద్ నమాజ్ చేయాలి.

సందేశం



• మహమ్మద్ వహీదుద్దీన్

## మనసు చేసే మార్గ నిర్దేశం



ప్రపంచం సాంకేతికంగాను, మానవ విలువల పరంగాను వేగంగా మార్పు చెందుతోందని మనకు తెలుసు. సాంకేతికత మానవాళిని మునుపెన్నడూ లేనంత ఎత్తుకు తీసుకువెళుతోందని మనలో చాలామంది భావిస్తూ ఉంటాం. కానీ అదే సమయంలో విలువల పతనం పట్ల వ్యక్తమయ్యే ఆందోళనకు కూడా సాక్షులుగా ఉంటున్నాం. ఒక కార్డియాలజిస్ట్‌గా, నేను కాలంలో ఒక కీలకమైన దశలో ఉన్నాను. ఒక వైపు, నేను నిరంతరం నేర్చుకోవాల్సిన, వాటికి అనుగుణంగా మారాల్సిన సాంకేతికతలు పుట్టగొడుగుల్లా పెరుగుతున్నాయి. మరోవైపు, వృత్తిపరమైన ఆచరణలో నైతిక సరిహద్దులు అస్పష్టంగా మారుతున్నాయి. 'సైన్స్ రంగంలో మనం ముందంజ వేస్తూ, అదే సమయంలో నైతిక సరిహద్దుల్లో ఎలా ఉండగలం?' అని ఈ పరిస్థితి నన్ను ప్రశ్నించుకొనేలా చేసింది.

### పరిణామాల భయం

ఒక రోగి అనారోగ్యంతో నన్ను సంప్రతించినప్పుడు, నేను క్లినికల్ డేటాను విశ్లేషించి, శాస్త్రీయ ఆధారాల సహాయంతో పరిష్కారాన్ని కనుగొంటాను, వ్యక్తిగత అనుభవం ద్వారా మార్గనిర్దేశం పొందుతాను, అంతర్ దృష్టి ద్వారా పరిపూర్ణం అవుతాను. ఈ ప్రక్రియలో ఏర్పడే నిఇడ్న 'పవిత్రమైన మానసిక అక్షం (ఇరుసు)'గా నేను పిలుచుకుంటాను వైద్యుడు వైద్యపరమైన నిర్ధారణలు చేసేటప్పుడు ఆ కక్ష్యలోనే స్థిరంగా నిలిచి ఉండాలి. కానీ మన మనసులు బాహ్యమైన, అంతర్గతమైన అనేక అంశాలతో ప్రభావితం అవుతాయి. ఉదాహరణకు, రోగి ఒక రాజకీయ నాయకుడు లేదా పోలీసు ఉన్నతాధికారి లాంటి ఉన్నత స్థాయి వ్యక్తి అయినప్పుడు... రాబోయే పరిణామాల పట్ల వైద్యునికి భయం ఉండొచ్చు. ఆర్థికమైన పరిగణనలు, ఫలితాలు, అంచనాలకు సంబంధించిన ఒత్తిళ్ళు మన స్వభావంలో అహం, నిరాశ, సూక్ష్మస్థాయిలో దురాశ కూడా ఉండవచ్చు. ఇవన్నీ అంతిమమైన వైద్య నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. మనసు ఇటువంటి ప్రభావాల వల్ల అల్లకల్లోలంగా ఉన్నప్పుడు... మనం ఇచ్చే తీర్పు, ఆ స్వచ్ఛమైన మానసిక అక్షం నుంచి ఉత్పన్నం అయ్యే తీర్పు... రెండు ఒకేలా ఉండకపోవచ్చు.

### ఏకాగ్రతకోసం మొదలుపెట్టి...

మనసు చేసే ఈ మార్గ నిర్దేశం వైద్యులకు మాత్రమే కాదు... ఇంజనీర్లు, రాజకీయ నాయకులు, మేనేజిమెంట్ లీడర్స్, మార్కెట్ నిపుణులు, ఇంకా అనేక ఇతర రంగాల నిపుణులకు కూడా ఎంతో ముఖ్యమైనది. ఆ పాత్రలు పోషిస్తున్న నిపుణులు అంతర్గతమైన స్పష్టత, నైతికమైన సంయమనం లేకపోతే పరిణామాలు ఎలా ఉంటాయో సులభంగానే ఊహించవచ్చు. మరి ఈ చిక్కు ప్రశ్నను ఎదుర్కోవడానికి, వైద్యునిగా నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు స్పష్టతతో కొనసాగడానికి నాకు సాయపడింది ఏమిటి? నేను వైద్య విద్యార్థిగా ఉన్నప్పుడే షాజహాన్‌పూర్‌కు చెందిన రామ్‌చంద్ర స్థాపించిన 'హార్ట్‌ఫుల్‌నెస్' ధ్యానాన్ని అభ్యసించడం ప్రారంభించాను. ఆ సమయంలో ఆధ్యాత్మికత గురించి, క్లినికల్ ప్రాక్టీస్ మీద దాని ప్రభావం గురించి నాకు లోతైన అవగాహన ఏమాత్రం లేదు. కేవలం ఏకాగ్రతను మెరుగుపరుచుకోవడానికే దాన్ని మొదలుపెట్టాను. కాలక్రమేణా, స్థిమితంగా లేని నా మనస్సుకు ఆ అభ్యాసాలు ఒక సమయంలో కేవలం ఒకే విషయం మీద దృష్టిని పెట్టేలా నెమ్మదిగా, స్థిరంగా శిక్షణ ఇచ్చాయి. నా విద్య, శిక్షణ సమయంలో వైద్య శాస్త్రం లోతుల్ని అన్వేషిస్తున్న దశలోనే ఈ అంతర్గత క్రమశిక్షణ కూడా అభివృద్ధి చెందింది.

### 'మంచి' పెరగాలంటే...

ఒకటిన్నర దశాబ్దానికి పైగా కార్డియాలజీని ప్రాక్టీస్ చేసిన తర్వాత... సైన్స్‌లో పురోగతులు మనకు శక్తిని ఇస్తాయని ఇప్పుడు నేను నమ్మకంగా చెప్పగలను, కానీ మార్గనిర్దేశం పొందిన మనస్సు మాత్రమే ఆ సాధికారతను మానవీయమైన ఉదారతగా విస్తృత స్థాయిలోకి మార్చగలదు. వైద్య శాస్త్రంలోని నిష్కళంకమైన జ్ఞానం మమ్మల్ని వైద్యులుగా చేస్తుంది. కానీ 'మంచి వైద్యుడు' అనే మాటలోని 'మంచి' అనేది 'హార్ట్‌ఫుల్‌నెస్' ధ్యానం లాంటి అంతర్గత అభ్యాసాల ద్వారా పెంపొందుతుంది. అది అంతర్గతంగా నైతిక దిక్సూచిని నిర్మించుకోవడానికి సాయపడుతుంది.

> మనసు చేసే మార్గ నిర్దేశం వైద్యులకు మాత్రమే కాదు... ఇంజనీర్లు, రాజకీయ నాయకులు, మేనేజిమెంట్ లీడర్స్, మార్కెట్ నిపుణులు, ఇంకా అనేక ఇతర రంగాల నిపుణులకు కూడా ఎంతో ముఖ్యమైనది. ఆ పాత్రలు పోషిస్తున్న నిపుణులు అంతర్గతమైన స్పష్టత, నైతికమైన సంయమనం లేకపోతే పరిణామాలు ఎలా ఉంటాయో సులభంగానే ఊహించవచ్చు

**డాక్టర్ శరత్‌రెడ్డి**, కార్డియాలజిస్ట్, ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్. 9440087532



## శాంతి మార్గదర్శి



సహజయోగ

మానవతావాదం, ఆధ్యాత్మిక వ్యక్తిత్వం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మూర్తీభవించిన ఆదర్శ మహిళ శ్రీమాతాజీ నిర్మలాదేవి. సామాజిక పరివర్తన కోసం, శాంతికోసం అహర్నిశలు శ్రమించిన నిస్వార్థ సేవకురాలు. సహజయోగ ద్వారా లక్షలాది మందికి ధ్యాన మార్గాన్ని ఆమె చూపించారు. శారీరక ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు దోహదం చేశారు.

స్వాతంత్ర్య సమరయోధులైన ప్రసాదరావ్ సాల్వే, కార్నెలియా సాల్వే దంపతులకు 1923 మార్చి 21న మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో నిర్మలాదేవి జన్మించారు. బాల్యంలో గాంధీజీ ఆశ్రమంలో, ఆధ్యాత్మిక చింతనతో ఆమె పెరిగారు. 1970 మే అయిదున... గుజరాత్‌లోని నార్గోల్ సముద్ర తీరంలో ధ్యానంచేస్తూ... మానవాళి అందరికీ కుండలినీ జాగృతిని కలిగించే మార్గాన్ని కనుగొన్నారు. అదే సహజయోగ. 'సహజ' అంటే పుట్టుకతో వచ్చినది, 'యోగ' అంటే కలయిక. పుట్టుకతోనే మనలో ఉన్న కుండలినీ శక్తిని మేల్కొలపడం ద్వారా పరమాత్మతో అనుసంధానం కావడమే సహజయోగం. ఎటువంటి సభ్యత్వ రుసుము లేకుండా, ధనార్జనాపేక్ష లేకుండా... 120 దేశాల్లో సహజయోగను 'విశ్వ నిర్మల ధర్మం'గా ఆమె ప్రచారం చేశారు. కుండలినీ జాగృతి ద్వారా శారీరకమైన వ్యాధులు నయంకావడంతో పాటు... మానసిక ఒత్తిడి తగ్గి, మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడు అవుతాడని, మద్యపానం, మత్తుపదార్థాల వ్యసనాలు మానడం, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం లాంటివి సహజయోగ ద్వారా సాధ్యమని నిరూపించారు. "శాంతి అంటే యుద్ధాలు లేకపోవడం కాదు, అది ప్రతి మనిషిలో అంతర్గతంగా ఉండవలసిన స్థితి. ప్రతి వ్యక్తి అంతర్గతంగా శాంతి పొందినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది" అని ఆమె స్పష్టం చేశారు. మనలో కోపం, అసూయ, ద్వేషం ఉన్నంత వరకూ బయట ప్రపంచంలో శాంతిని స్థాపించడం సాధ్యం కాదనీ, అది బలవంతంగానో, చట్టాల ద్వారానో జరిగేది కాదనీ, ప్రేమ ద్వారా మాత్రమే శాంతి స్థాపన సాధ్యమనీ చెప్పారు.

ఇప్పుడు నిర్మలాదేవి భౌతికంగా మన మధ్య లేకపోయినా... ఆమె ప్రవేశపెట్టిన సహజయోగ కార్యక్రమాలు ప్రత్యక్షంగానూ, సోషల్ మీడియా ద్వారా విద్యాలయాల్లో, కార్పొరేట్ సంస్థల్లో, సమాజంలోని వివిధ వర్గాలవారికి అందుబాటులో ఉన్నాయి. వీటి వల్ల వారు నిత్య జీవితంలో ఎదురవుతున్న ఒత్తిడి నుంచి, శ్రమ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ప్రపంచ శాంతికి, మానవ కళ్యాణానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆమె ఎన్నో అరుదైన గౌరవాలను సత్కారాలను అందుకున్నారు. శ్రీమాతాజీ 103 జయంతి వేడుకలు ఆమె జన్మస్థలమైన ఛింద్వారాలో... ఈనెల 21 వరకూ మూడు రోజులపాటు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్నాయి. వీటిలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సహజయోగ సాధకులు పాల్గొంటున్నారు.

**డాక్టర్ పి. రాకేష్**, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



## గ్యాస్ ధరలు ఇప్పట్లో పెరగవు

- దూరదృష్టి గల మోదీ నాయకత్వమే ఇందుకు కారణం
- పంచాంగ పఠనంలో సూర్యనారాయణమూర్తి



పండితుడి ఆశీర్వాదం తీసుకుంటున్న కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): "ప్రపంచ వ్యాప్తంగా యుద్ధమేఘాలు కమ్ముకున్నా భారత్‌లో గ్యాస్ సిలిండర్ ధరలు పెరగలేదు.. ఇప్పట్లో పెరగబోవు.. భవిష్యత్తులో ఏం జరగబోతుందో ముందే ఊహించే దృక్పథం ఉన్న, దూరదృష్టి కలిగిన మోదీ నాయకత్వమే ఇందుకు కారణం"అని పంచాంగకర్త కె.సూర్యనారాయణ మూర్తి అన్నారు. కుజుడు మంత్రి కావడం వల్ల, ఏ దేశం కూడా మనవైపు రాకుండా రక్షణ మంత్రి కాపాడతారని వివరించారు. సనాతన ధర్మాన్ని గౌరవించే ఏకైక పార్టీ బీజేపీ అని, సానుకూల ఆలోచన ఎలా ఉండాలో పార్టీ సూచిస్తుందని పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ పార్టీపరంగా అయినా, వ్యవస్థాపరంగా అయినా 'అప్‌డేట్ ' కాకపోతే 'ఔట్‌డేట్ ' అవుతామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. పొరుగు వారి దగ్గర ఉన్నది మన దగ్గర లేదని బాధ పడకుండా, మనమెందుకు సాధించలేక పోయామో గుర్తించి అందుకనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఈ ఏడాది మహిళలకు అధికారాలు పెరుగుతాయని చెప్పారు. బంగారం ధరలు ఆకాశంలో నాట్యం చేస్తాయని, కొనుగోలు చేయకపోవడమే మేలని అభిప్రాయపడ్డారు. విద్యావిధానంలో మార్పులు చోటుచేసుకోబోతాయని పేర్కొంటూ.. జాతీయ నూతన విద్యావిధానం ఈ సంవత్సరం నుంచే కేంద్రం అమలు చేయబోతుందన్నారు. యమునా నది పుష్కరాలు జూన్ 2నుంచి 13వ తేదీ వరకు ఉంటాయన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని పార్టీ శిక్షణ కార్యక్రమాల్లో తాము కూడా చెబుతున్నామన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'పరాభవం'.. మన దేశానికి కాదు.. అది శత్రువులు, దేశద్రోహులకు మాత్రమేనన్నారు.

### ప్రతిపక్షం బలపడే అవకాశం

- పంచాగ పఠనంలో మృత్యుంజయశర్మ, ఫణీంద్రశర్మ
- తెలంగాణ భవన్‌లో ఉగాది వేడుకలు.. హాజరైన కేటీఆర్



కేటీఆర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న పండితులు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వంలో ఉన్న లోటు పాట్ల తో పాటు పాలనా వైఫల్యాలు కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, ఈ ఏడాది ప్రతిపక్షానికి గణనీయంగా బలం చేకూరే అవకాశం ఉందని వేద పండితులు మృత్యుంజయశర్మ, ఫణీంద్రశర్మ వెల్లడించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రత్యామ్నాయ శక్తిగా బీఆర్ఎస్ ఎదిగే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మృత్యుంజయశర్మ, ఫణీంద్రశర్మ పంచాంగ పఠనం చేశారు. విద్యావిధానంలో జరుగుతున్న మార్పులు... విద్యార్థులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోతే నిరుద్యోగం మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. విదేశీ శక్తుల కుట్రలను మన సైనికులు సమర్థవంతంగా ఎదుర్కొంటారని, ఇరుగు-పొరుగు దేశాలతో కొన్ని ఉద్రిక్తలు చోటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసే సూచనలున్నాయని, ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలు బాగా పండే అవకాశం ఉందని, రైతుల ఆత్మహత్యలు తగ్గే సూచనలు ఉన్నాయని చెప్పారు. బంగారం, వెండి, ఆహార ధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉందని, కూరగాయల ధరలు కొంతవరకు తగ్గవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు.

## ఈ ఏడాది రేవంత్‌రెడ్డికి తిరుగులేదు

- ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేస్తారు
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతారు
- జూన్ నుంచి అక్టోబరు మధ్య మారనున్న రాజకీయ పరిణామాలు
- బ్రాహ్మణులను నిందిస్తే పరాభవం తప్పదు
- పంచాగ పఠనంలో సంతోష్‌కుమార్ శాస్త్రి



ఉగాది వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి

రవీంద్రభారతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి ఈ ఏడాది రాజయోగం బలంగా ఉందని, రాజకీయంగా ఎదురయ్యే అడ్డంకులను, ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో పటాపంచలు చేస్తారని సిద్ధాంతి బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి వెల్లడించారు. శత్రువులపై పైచేయి సాధిస్తారని వివరించారు. రేవంత్‌రెడ్డి తీసుకునే కొన్ని సంచలన నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తును మారుస్తాయని, పట్టుదలతో అనుకున్నది సాధిస్తారని వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొనగా, బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం చేశారు. ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు, అంతర్గత కలహాలు సృష్టించే శక్తులు యాక్టివ్‌గా ఉంటాయని, సీఎం తన బృందాన్ని(మంత్రులు, అధికారులను) సమన్వయం చేసుకోవడంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా ఈ ఏడాది రేవంత్ రెడ్డి జాతీయ స్థాయిలో గుర్తింపు, గౌరవం పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో పోరాడి.. విజయం సాధిస్తారని వివరించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి ఈ ఏడాది ప్రజల మద్దతు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. అయితే, పాలనాపరంగా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని, అవి దీర్ఘకాలంలో రాష్ట్రానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగే కొన్ని అంతర్గత కుట్రలను ముఖ్యమంత్రి తన చాకచక్యంతో తిప్పికొడతారని, జూన్ నుంచి అక్టోబర్ మధ్య కాలం రాజకీయంగా అత్యంత కీలకమని, రాజకీయ పరిణామాలు వేగంగా మారుతాయని విశ్లేషించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత అదుబాటులో ఉండాలని, ప్రజా సమస్యల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పారిశ్రామికీకరణ, వ్యవసాయ అవసరాల దృష్ట్యా ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అదనపు విద్యుత్ కొనుగోలు లేదా కొత్త ఉత్పత్తి కేంద్రాల ద్వారా ఈ డిమాండ్‌ను తట్టుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందని, కొత్త పెట్టుబడులు వచ్చే సూచనలు ఉన్నాయని తెలిపారు. బంగారం, వెండి ధరల్లో ఒడిదొడుకులు ఉంటాయని, నిత్యవసరాల ధరలు సామాన్యులకు కొంత భారంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పదవులు, ఇతర కీలక రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతుందని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వివరించారు. రాష్ట్రంలో ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి జలాశయాలు నిండుతాయని చెప్పారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సమృద్ధిగా పండుతాయని పేర్కొన్నారు. ధాన్యం, పప్పు దినుసులు, వాణిజ్య పంటలు రైతులకు లాభం చేకూరుస్తాయని అన్నారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమ గణనీయంగా వృద్ధి చెందతుందని తెలిపారు. "మంచి వాళ్లను తిట్టడం, దేవతలను నిందించడం, వేదాలను నిందించడం, బ్రాహ్మణులను నిందించడం, ధర్మాన్ని నిందించడం.. ఇవి ఎవరైతే చేస్తారో వాళ్లకు హింస తప్పదు గాక తప్పదు. వారికి పరాభవం తప్పదు. నాయకులు కూడా మైకు దొరికింది కదా అని ఎక్కువ మాట్లాడడం సరికాదు. కొన్ని సందర్భాల్లో మౌనంగా ఉండడమే మంచిది. యూట్యూబ్‌లో పిచ్చి థంబ్ నెయిల్స్ పెడుతూ సనాతన ధర్మాన్ని నిందించే వాళ్లకు పరాభవం తప్పదు" అని స్పష్టం చేశారు.

### ఈ ఏడాది ప్రభుత్వానికి అనుకూలం

పరాభవ నామ సంవత్సరం ప్రభుత్వానికి అనుకూలంగా ఉందని, కాంగ్రెస్ మరింత బలోపేతమవుతుందని పండితుడు చిలుకూరు శ్రీనివాసమూర్తి తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా పండితుడు చిలుకూరు శ్రీనివాసమూర్తి పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురిసి, పాడి పంటలు వృద్ధి చెందుతాయన్నారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రజలకు అన్ని రంగాల్లో మేలు జరగాలని, ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

## అయ్యో.. రామచంద్రా..!

(మొదటిపేజీ తరువాయి)

కూడా లక్ష్మీదేవి గోత్రమైన సౌభాగ్య అని చదువుతున్నారు. ప్రవర కూడా లక్ష్మీదేవి ప్రవరే. సరిగ్గా ఇక్కడే పండిత వర్గం రెండుగా విడిపోయింది. అన్నదానం చిదంబర శాస్త్రి ఏకంగా ఒక గ్రంథం రాశారు. భద్రాద్రిలో సీతారామ కల్యాణం జరగకపోవడం బాధాకరమనీ పేర్కొన్నారు. ఆయన తాను రాసిన పుస్తకాన్ని అనేకమంది పండితులకు కూడా పంపించారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు, గరికపాటి నరసింహారావు, రేజేటి వేంకట వేణుగోపాలాచార్యులు, బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి, వేదాల వేంకట సీతారామాచార్యులుతోపాటు చాలా మంది భద్రాద్రిలో ఉన్నది దశరథ పుత్రుడు రాముడే అని పేర్కొన్నారు.



### అర్చకుల వాదన ఇలా..

రాముడు భద్రుడికి దర్శనమిచ్చినప్పుడు నాలుగు చేతులతో శంఖచక్రాలతో సీతామాతను తొడపై కూర్చోబెట్టుకుని ఉన్నారు కాబట్టి ఆయన రామనారాయణుడని, దశరథ తనయుడు కాదని కొందరు పండితులు, కొందరు ఆలయ అర్చకులు వాదిస్తున్నారు. ఆయనకు తల్లి, తండ్రీ ఆయనే అంటూ 'విభవ వాసుదేవ శర్మ పుత్రాయ' అని చెబుతున్నారు. కల్యాణ ప్రక్రియలో గత 14 ఏళ్లుగా రామనారాయణ వరాయః అని, అమ్మవారు జనకుని కూతురు కాదంటూ క్షీరార్ణవ శర్మ పుత్రీం సీతామహాలక్ష్మీం అనీ చెబుతున్నారు. శుభలేఖ మీద సీతారామ కల్యాణమని ఉంటుంది, కానీ వివాహ ప్రక్రియలో ఎక్కడా దశరథుడి పేరు, జనకుడి పేరు వాడడం లేదు.

### మూడు తాళిబొట్లు చేయించిన రామదాసు..

పోకల దమ్మక్క నిర్మించిన తాటాకు పాకలో రామదాసు మొదటిసారి స్వామివారి విగ్రహాన్ని చూసి, ఆయనకు ఆలయాన్ని నిర్మించారు. దానికి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయమని పేరు పెట్టారు. దేవాదాయ శాఖ రికార్డుల్లోనూ అలాగే ఉంది. ఆయన స్వామివారిని దశరథ తనయుడిగా భావించి దాశరథీ శతకం అంటూ వందకుపైగా పద్యాలు రాశారు. పూర్తి అవగాహనతోనే అక్కడ ఉన్న విగ్రహాన్ని దశరథ తనయుడైన రామచంద్రుడిగా కొలిచారు. కల్యాణంలో వాడడానికి కూడా భక్తరామదాసు మూడు మంగళసూత్రాలను చేయించారు. దశరథుడు, జనకుడు, భక్తుల తరఫున వీటిని చేయించారు. 2012 వరకూ సీతారామచంద్రస్వామి కల్యాణంలోనూ 'రామచంద్రస్వామినే వరాయ' అని స్పష్టంగా ఉంది. అదేవిధంగా భక్తరామదాసు దాశరథ శతకంలో 'దాశరథీ.. కరుణాపయోనిధి' అని చెప్పారు. దాశరథి అంటే దశరథ పుత్రుడని అర్థం.

### హైకోర్టులో కేసు.. నివేదిక సమర్పణే ఆలస్యం..

భద్రాద్రి రామయ్యకు సంబంధించిన ఈ అంశంపై 2022లో హైకోర్టులో కేసు నమోదైంది. విచారణ అనంతరం న్యాయస్థానం ఈ విషయంలో అన్ని అంశాల్ని పరిశీలించి, నిగ్గు తేల్చేందుకు ఐదుగురు పండితులతో కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీలో వేదాంతం రాజగోపాల చక్రవర్తి, ప్రభాకర శర్మ, చింతపల్లి సుబ్రమణ్య శర్మ, సన్యాసి శర్మతోపాటు మరొకరు ఉన్నారు. అన్ని అంశాలను పరిశీలించిన కమిటీ 2024లో నివేదికను దేవాదాయ శాఖకు సమర్పించింది. ఇక ఆ నివేదిక హైకోర్టుకు అందడమే తరువాయి. అలా అందితేనే పండితులు ఏం తేల్చారన్నది తెలుస్తుంది. భద్రాద్రి రాముడి పుట్టుపూర్వోత్తరాల పంచాయితీకి శుభం కార్డు పడుతుంది. ఐదుగురు సభ్యుల కమిటీ నివేదికను ఇప్పటికే దేవాదాయ శాఖకు సమర్పించినప్పటికీ దాన్ని బయట పెట్టడం లేదని, హైకోర్టుకు సమర్పించడం లేదని పేర్కొంటూ పిటిషనర్ కంచర్ల వెంకటరమణ హైకోర్టులో మళ్లీ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ చేపట్టిన కోర్టు ఇటీవల దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 23న జరగనుంది.

## గోత్రాలు, ప్రవర మార్చేశారు!

వాల్మీకి రామాయణం, ఆంధ్ర వాల్మీకిగా ప్రసిద్ధికెక్కిన వావిలికొలను సుబ్బారావు తెలుగులోకి అనువదించిన 'మందరం' గ్రంథాల ప్రకారం.. వైవస్వత మన్వంతరం, త్రేతాయుగం, విళంబి నామ సంవత్సరం, చైత్ర శుక్లపక్ష నవమి తిథి నాడు పునర్వసు నక్షత్రంలో బుధవారం శ్రీరామ జననం జరిగింది. శ్రీరాముడికి ఆ ఏడాది చైత్ర బహుళ పంచమి నాడు నామకరణం, తొమ్మిదో యేట పరాభవ నామ సంవత్సరంలో ఉపనయనం జరిగాయి. ఆయనకు పన్నెండేళ్లు, సీతకు ఆరేళ్లు ఉన్నప్పుడు.. సౌమ్య నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ త్రయోదశి - ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో సీతారాముల కల్యాణం జరిగింది. అంతేకాని చైత్ర శుద్ధ నవమి నాడు కాదు. సీతారాముల కల్యాణంలో ఇక్ష్వాకు వంశానికి కులగురువైన వశిష్టుడు సూర్యవంశ క్రమాన్ని, జనక మహారాజు తన వంశ క్రమాన్ని వివరించారు. ఆ ప్రకారం శ్రీరాముడిది వశిష్ట గోత్రం, సీతాదేవిది గౌతమస గోత్రం. ఇక శ్రీరామ పట్టాభిషేకం.. ధాత నామ సంవత్సరం చైత్ర శుద్ధ సప్తమి, గురువారం, పుష్యమి నక్షత్రంలో జరిగింది. ఇటీవల భద్రాచలంలో నిర్వహిస్తున్న రామనారాయణ, లక్ష్మీదేవిల కల్యాణం సందర్భంగా ఎదురుకోలు, కల్యాణం, పట్టాభిషేక ఉత్సవాలు విశేషంగా జరుగుతున్నాయి. శ్రీరాముడి వివాహ తంతులో అర్చక, పండిత మహాశయులు ఇటీవలి కాలంలో భక్తులను గందరగోళానికి గురిచేస్తున్నారు. 'అచ్యుత గోత్రోద్భవాయా' అంటూ శ్రీరామచంద్రుడి స్థానంలోకి రామనారాయణ స్వామిని తెచ్చారు. క్షత్రియుడైన శ్రీరాముణ్ని 'అచ్యుత గోత్రం'తో బ్రాహ్మణుడిగా మార్చేశారు!! సీతాదేవి స్థానంలో సీతామహాలక్ష్మిని తెచ్చి.. ప్రవర మార్చేశారు! 'సౌభాగ్య గోత్రం' ఇచ్చేశారు!! శ్రీరాముడి 'వశిష్ట గోత్రం', సీతాదేవి 'గౌతమస గోత్రం'.. ఎలా, ఎందుకు, ఎక్కడికి వెళ్లిపోయాయో తెలియదు. వైష్ణవ సంప్రదాయాల ప్రకారం మహా విష్ణువు శాస్త్రోక్త ఆవిర్భావాన్ని 'ఆది మధ్యాంత రహితమైన నిత్య స్వరూపం'గా పేర్కొనడం జరిగింది. శ్రీమహావిష్ణువు కారణజలధిపై యోగనిద్రలో విరాజిల్లుతూ ఉంటాడని భాగవత పురాణం వివరిస్తోంది. విష్ణువును సాధారణ అర్థంలో జన్మించిన వాడిగా కాకుండా సర్వసృష్టికి మూలకారకుడిగా అవతరించిన పరతత్త్వ స్వరూపుడిగా భావిస్తారు. అలాంటప్పుడు ఆయన అచ్యుత గోత్రోద్భవుడు ఎలా అవుతాడు? విష్ణు పురాణం, భాగవతం తదితర గ్రంథాల ప్రకారం క్షీరసాగర మథనం సమయంలో లక్ష్మీదేవి ఆవిర్భవించింది. ఆ సమయంలో ఆమె స్వయంగా మహావిష్ణువును తన నిత్య సహచరుడిగా (భర్తగా) ఎంచుకుంది. అలాంటప్పుడు ఆమె సౌభాగ్య గోత్రోద్భవి' ఎలా అయింది? అంతేకాదు.. వారి వర్ణం, ప్రవర, గోత్రం తదితర వివరాల గురించి కూడా శాస్త్రాల్లో ఎక్కడా ప్రస్తావన లభించదు. అలాంటప్పుడు అచ్యుత, సౌభాగ్య గోత్రాల సాధికారత ఏమిటి? అంతా అగమ్యగోచరం! విశేషమేంటంటే.. గతంలోని ఎదుర్కోలు వేడుకలో సీతాదేవి, శ్రీరాముడి పక్షం వహించిన ఇద్దరు 'విశిష్ట వశిష్టుల స్థాయి' ఆచార్యవర్యులు మాటల ద్వంద్వ యుద్ధం చేశారేమో? అనిపించింది. సీతారాముల గుణగణాలను వర్ణించేటప్పుడు వాస్తవానికి దగ్గరగా ఉండాలి. కానీ, రామాయణాన్ని తమదైన శైలిలో అన్వయించుకుంటూ వివాహానంతర కాండలలో ఉన్న విషయాలను ప్రస్తావించడం భావ్యమా? కనీసం ఈ పరాభవ నామ సంవత్సరంలోనైనా భక్త రామదాసు భావాలకు, వాల్మీకి మహర్షి సంస్కృత రామాయణ రచనకు, ఆంధ్ర వాల్మీకి యథాతథ తెలుగు అనువాదానికి అనుగుణంగా.. వచ్చే శుక్రవారం భద్రాచలం క్షేత్రంలో నిర్వహించే వేడుకను రామనారాయణ, మహాలక్ష్మీ కల్యాణంగా కాకుండా.. శ్రీ సీతారాముల కళ్యాణంగా జరిపించాలి. కల్యాణానికి వచ్చే ఆహూతులకు, భక్తులకు, టీవీ ప్రేక్షకులకు అర్థమయ్యేలా, తప్పుదారి పట్టించకుండా సరళమైన తెలుగులో చెప్పాలి. ఎదుర్కోలు, పట్టాభిషేకం వివరాలు కూడా అలాగే చెప్పాలి. ఆ వేడుక పవిత్రతను కాపాడాలి.



- వనం జ్వాలా నరసింహారావు

# అట్టహాసంగా గద్దర్ అవార్డుల ప్రదానం

**తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులు-2025 ప్రదానోత్సవం గురువారం మాదాపూర్‌లోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో అట్టహాసంగా జరిగింది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల సావనీర్‌ని మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. విజేతల్లోని పలువురికి ఉప ముఖ్యమంత్రి, మరి కొందరికి హీరో నాగార్జున పురస్కారాలు అందజేశారు. జ్యూరీ కమిటీకి గోల్డెన్ మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు రూ.లక్ష నగదును ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు అందజేశారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ 'ఫిల్మ్ ఇండస్ట్రీని హైదరాబాద్‌కు ఒక ఇంటర్నేషనల్ హబ్‌గా చూడాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆకాంక్ష. ఎఫ్‌డీసీ ఆ దిశగా అడుగులు వేస్తోంది' అని తెలిపారు.**




ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మొదట వనజ, ఉదయ్ బృందం నృత్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. కథానాయిక నిధి అగర్వాల్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే గాయకులు శ్రేయా ఘోషల్, మంగ్లీ, దేవిశ్రీ ప్రసాద్ తమ బృందంతో గీతాలు ఆలపించారు. నాగబంధం సినిమా కథానాయిక నభా నటేష్ ఆ చిత్రంలోని 'నమోరే..' పాటకు చేసిన డ్యాన్స్ ఆహ్వానితులను విశేషంగా అలరించింది.

- ఈ కార్యక్రమంలో పలువురు తారలు హాజరై వేడుకకు వన్నె తెచ్చారు. చిరంజీవి, రామ్‌చరణ్, అల్లు అరవింద్, నాగార్జున, అమల, నాగ చైతన్య, శోభిత, సీనియర్ నటి జయసుధ, ఆర్.నారాయణ మూర్తి, రితేశ్ దేశ్‌ముఖ్ - జెనీలియా దంపతులు, మాధురీ దీక్షిత్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొందరు సెలబ్రెటీలు రెడ్‌కార్పెట్‌పై హొయలొలికించారు.

### ఏపీ కూడా అవార్డులు ఇస్తే బావుంటుంది

ఎక్కడైతే కళాకారులు గౌరవించబడతారో అక్కడ ఆ రాష్ట్రం, దేశం, రాజ్యం సుభిక్షంగా ఉంటుందనేది నానుడి. దాన్ని సరిగ్గా అర్థం చేసుకుని గౌరవ ముఖ్యమంత్రి గారు అవార్డులను మళ్లీ పునరుద్ధరించినందుకు మనస్ఫూర్తిగా నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ఇస్తే కళాకారులకు ప్రోత్సాహకంగా ఉంటుంది.

- చిరంజీవి

### ప్రపంచస్థాయి సినీ కేంద్రంగా హైదరాబాద్

ఇక్కడున్న వాళ్లంతరూ నా కుటుంబ సభ్యులే. కాకపోతే వారి నివాసాన్ని చెన్నై నుంచి హైదరాబాద్‌కు మార్చారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన 'శ్రీమంతుడు' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయడానికి పదహారేళ్ల వయసులో తొలిసారి హైదరాబాద్ వచ్చాను. అప్పటి నుంచి హైదరాబాద్‌తో నాకు అనుబంధం ఏర్పడింది. చిరంజీవిగారు నేను లీడ్‌రోల్ యాక్టర్లుగా 1970లో ఒకేసారి తెరపైకి వచ్చాము. గద్దర్‌గారు ఒక మహాకవి. ప్రజల మనిషి. ఆయన పేరుతో ఈ అవార్డులను ప్రారంభించడం నిజంగా గర్వకారణం. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సీఎం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. ముఖ్యమంత్రిగారు యువకులు, ఉత్సాహవంతులు. ఆయన ఆలోచనలు సినీ రంగానికి ఎంతో మేలు చేస్తాయి. కళకు భాషా భేదాలు లేవు. నేను తమిళుడిని అయినా తెలుగు ప్రేక్షకులు నన్ను ఎప్పుడూ తమ సొంత మనిషిగా ఆదరిస్తారు. హైదరాబాద్ నగరం సినిమా నిర్మాణానికి ప్రపంచ స్థాయి కేంద్రంగా మారుతోంది. ప్రభుత్వం ఇచ్చే మద్దతుతో ఇది మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుంది. నాకు ఈ అవార్డు ఇచ్చినందుకు కృతజ్ఞతలు.

- కమల్ హాసన్


సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎన్టీఆర్ పురస్కారం అందుకుంటున్న చిరంజీవి


పైడి జయరాజ్ పురస్కారం అందుకుంటున్న కమల్ హాసన్


అశ్వనీ దత్ (నాగిరెడ్డి చక్రపాణి అవార్డ్)


అల్లు అరవింద్ (జాతీయ సమైక్యతా చిత్రం - తండేల్)


శివాజీ
ఉత్తమ సహాయ నటుడు - దండోరా


నాగ చైతన్య (ఉత్తమ నటుడు - తండేల్)


జయసుధ (ఏఎన్‌ఆర్ అవార్డ్)


రష్మిక మందన్న (ఉత్తమ నటి - ది గర్ల్‌ఫ్రెండ్)


ఆర్. నారాయణ మూర్తి (కాంతారావు అవార్డ్)


సుద్దాల అశోక్ తేజ (సినారె జాతీయ పురస్కారం)


రాజు వెడ్స్ రాంబాయి చిత్ర బృందం

## ప్రతిసారీ '44' అంటారెందుకు?



హీరోయిన్ అనుష్క ఈ ఏడాది చివర్లో బెంగుళూరుకు చెందిన ఓ వ్యాపారవేత్తతో వివాహబంధంలోకి అడుగుపెడుతున్నట్లు కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై అనుష్క టీమ్ తాజాగా స్పందించింది. దీనిని ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ఒకరి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక అంశాన్ని అది అధికారికమా.. కాదా అని ఏ మాత్రం పరిశీలించకుండా హైలైట్ చేసి పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారు. నిర్ధారణ కాని ఓ విషయాన్ని ఊహించి లేదా అంచనా వేసి ఇలా పదేపదే ప్రచురించడం తగిన పద్ధతి కాదు. అన్నింటికంటే బాధాకరం ఏంటంటే ఆమె వయసుపై ఎక్కువగా ఫోకస్ పెట్టడం. ఈ విషయంలో అంత అత్యుత్సాహం ఎందుకు? ప్రతీ పోస్టులోనూ '44' అనే అంకెను వివాదాస్పదమైన అంశంలా ఎందుకు ప్రత్యేకంగా హైలైట్ చేస్తున్నారు. వయసు అంత పెద్ద సమస్య అయితే.. హీరోల వయసు విషయంలో కూడా ఇదే ఉత్సాహం ఎందుకు చూపించడం లేదు? మహిళల విషయంలోనే ఈ కథనం ఎందుకు భిన్నంగా ఉంటుంది?. అనుష్క శెట్టి తన కెరీర్‌ను గౌరవం ప్రతిభతో హుందాగా నిర్మించుకున్నారు. ఆమె ఎప్పుడూ పీఆర్ స్టంట్స్‌పై ఆధారపడలేదు. తన వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవాలని కోరుకునే వ్యక్తిని ఇలా టార్గెట్ చేయడం అన్యాయం. ప్రతీ ఒక్కరు తమ జీవితంలో జరిగే విషయాలను అందరికీ చెప్పాలనుకోరు. ఇలాంటి విషయాల్లో వారి నిర్ణయాన్ని గౌరవించాలి. వివాహం అనేది వ్యక్తిగత విషయం. ఇది బ్రేకింగ్ న్యూస్ కాదు, ట్రెండ్ కాదు. కేవలం వ్యూస్ కోసం సంచలనంగా మార్చాల్సిన విషయం అంతకంటే కాదు. ఇకనైనా బాధ్యతలో వ్యవహరించి ఒకరి వ్యక్తిగత గోప్యతకు.. హద్దులకు గౌరవమివ్వండి. ప్రచురించే ముందు అది నిజమో కాదో తనిఖీ చేసుకోండి. ముఖ్యంగా హీరోయిన్‌లను కూడా హీరోలతో సమానంగా గౌరవంగా చూడండి' అని టీమ్ పేర్కొంది. ప్రస్తుతం 'కథనార్' అనే మలయాళ చిత్రంలో నటిస్తున్నారు అనుష్క. ఈ పీరియడ్ ఫాంటసీ థ్రిల్లర్‌ను రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్నారు. ఈ నెల 31న ఈ సినిమా గురించి ఓ క్రేజీ అప్‌డేట్ వస్తున్నట్లు అనుష్క ఇటీవలే తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

## విడుదలకు సిద్ధం



తమిళ హీరో సూర్య 45వ చిత్రం 'కరుప్పు' విడుదలకు సిద్ధమైంది.. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ భారీ స్థాయిలో నిర్మించిన ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో పూర్తయినా విడుదల తేదీ వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు ఇప్పుడు మే 14న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సూర్య ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటించిన ఈ ఫాంటసీ యాక్షన్ చిత్రంలో త్రిష కథానాయిక. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనుఘ మాయ రవి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతాన్ని, జీకే విష్ణు సినిమాటోగ్రఫీని నిర్వహించారు. ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు ఈ చిత్రానికి నిర్మాతలు.






## మరో సేవా కార్యక్రమానికి శ్రీకారం



సినిమాల ద్వారా అభిమానులను అలరిస్తూనే.. సేవా కార్యక్రమాల ద్వారా తన సహృదయాన్ని చాటుకునే కథానాయకుల్లో మెగాస్టార్ చిరంజీవి ముందుంటారు. ఇప్పటికే ఆయన స్థాపించిన చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్, బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ ప్రజలకు విశేష సేవ చేస్తున్నాయి. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా ఆయన మరో సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. త్వరలోనే పేద ప్రజల కోసం ఉచిత విద్యను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పండగ సందర్భంగా నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'రక్తదానం ప్రాముఖ్యతను గుర్తించి 25 ఏళ్ల క్రితమే బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేశాను. అందులో అభిమానులందరూ పాల్గొనేలా స్ఫూర్తినిచ్చాను. నేను కేవలం అక్కడితోనే ఆగిపోవాలనుకోవట్లేదు. భవిష్యత్తులో పేద ప్రజలకు ఎలా ఉచిత విద్యను అందించవచ్చని ఆలోచిస్తున్నాను. తమిళ కథానాయకుడు సూర్య నా ద్వారా స్ఫూర్తి పొంది 'అగరం ఫౌండేషన్'ను స్థాపించారు. ఆయన చేస్తున్న విద్యాదానం ద్వారా స్ఫూర్తి పొంది ఉచిత విద్యాబోధనను ప్రారంభించాలనుకుంటున్నాను. కుటుంబంలోని ఒక వ్యక్తి విద్యావంతుడైతే.. ఆ ఫ్యామిలీ అంతా బాగుపడుతుంది. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఎక్కడైతే అవసరం ఉందో అక్కడ ఉచిత విద్యను అందించడానికి కృషి చేస్తాను' అని చెప్పారు. ప్రస్తుతం 'విశ్వంభర' చిత్రంతో పాటూ శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రాల్లో నటిస్తున్నారు చిరంజీవి.

## ఊహించిన దాని కన్నా గొప్ప విజయం సాధించింది



**హరీశ్ శంకర్**

'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ రావడం ఆనందాన్నిస్తోంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా చేసిన ఈ ప్రయత్నం విజయవంతమైంది. ఈ చిత్రం చూసిన వారంతా కంటెంట్ గొప్పగా ఉందని ప్రశంసిస్తున్నారు. నేను ముందు నుంచి చెప్పినట్లే ఇందులో వింటేజ్ పవన్‌కల్యాణ్‌ను చూపించాను. కమర్షియల్ కథగా దీన్ని తెరకెక్కించినా సందేశాన్ని కూడా జోడించాను. పవన్‌కల్యాణ్ అభిమానులకు ఓ ఫుల్‌మీల్స్ లాంటి సినిమా ఇది. ఊహించిన దాని కన్నా గొప్ప విజయం దక్కింది' అని దర్శకుడు హరీశ్ శంకర్ అన్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రీ మూవీమేకర్స్‌పై నవీన్‌యర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై ఘనవిజయం దిశగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నవీన్ యర్నేని మాట్లాడుతూ 'అన్ని చోట్లా ఈ సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ సినిమా చూస్తున్నంత సేపూ ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. పవన్‌కల్యాణ్ వన్ మాన్ షో చూపించారు. ఈ సినిమాకు కచ్చితంగా లాంగ్‌రన్ ఉంటుంది' అని చెప్పారు. వై రవిశంకర్ మాట్లాడుతూ 'అందరూ సెలబ్రేట్ చేసుకునేలా ఈ సినిమా ఉంది. నిర్మాతలుగా మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రమిది. ఇంత గొప్ప సినిమాను మాకు అందించిన పవన్‌కల్యాణ్, హరీశ్ శంకర్‌కు కృతజ్ఞతలు' అని తెలిపారు.



అనిల్‌కుమార్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా కొత్త చిత్రం ఉగాది సందర్భంగా పూజా కార్యక్రమాలతో మొదలైంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

## ఈగో రాజా స్టైలే వేరు!



ఆది సాయికుమార్ తాజా చిత్రం 'ఈగో రాజా'. తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి ఆది సాయికుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఉగాది పండగ సందర్భంగా విడుదల చేశారు. చుట్టూ రౌడీలు, ఒంటిపై గాయాలు, రక్తపు మరకలు చూస్తుంటే హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాలో ఉండేట్టు కనిపిస్తున్నాయి. ఆది లుక్ కూడా డిఫరెంట్‌గా, అగ్రెసివ్‌గా ఉంది. తమిళ దర్శకుడు కె.ఎస్.రవికుమార్ దగ్గర పనిచేసిన గురు శరవణన్‌కు 'ఈగిల్ రాజా' మూడో సినిమా. దీంతో హ్యాట్రిక్ సాధించాలనే పట్టుదలతో ఆయన పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: గిబ్రాన్. సంగీతం: దురై రాజ్, నిర్మాత: జి. సురేశ్

## న్యాయం చెయ్యరా దేవుడా



సుమన్, సాయికుమార్, వితికా షేరు ప్రధాన పాత్రధారులుగా జై జ్ఞానప్రభ తోట తెరకెక్కిస్తున్న పొలిటికల్ ఎంటర్టైనర్ 'ధర్మస్థల నియోజకవర్గం'. మేరుం భాస్కర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లో ఉంది. తాజాగా ఈ చిత్రం నుంచి తొలి లిరికల్ సాంగ్ 'న్యాయం చేయరా దేవుడా'ను గీతరచయిత చంద్రబోస్ విడుదల చేసి చిత్రబృందానికి బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ ప్రత్యేక గీతంతో కొరియోగ్రఫర్ శ్రష్టి వర్మ సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె నటన, స్టెప్పులు ప్రధానాకర్షణగా నిలిచాయి. ఈ పాటను చంద్రబోస్ రచించగా, సునీత ఆలపించారు. మహావీర్ ఎల్లెందర్ సంగీతం అందించారు.

## వినోదం పంచే కల్యాణం



అనుపమా పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్‌రాజ్ ఉద్దెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకత్వంలో యూరో సినిమాస్ బ్యానర్‌పై బూసమ్ జగన్‌మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం నుంచి అఖిల్ రాజ్ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన ఉదయ్ అనే యువకుడి పాత్రలో కనిపించారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో ఆద్యంతం వినోద ప్రధానంగా సాగేలా రూపొందిస్తున్నట్లు యూనిట్ తెలిపింది.

# స్పోర్ట్స్



## ఐర్లాండ్‌తో టీ20 సిరీస్

» జూన్‌లో భారత్ పర్యటన
» కెప్టెన్ స్టిర్లింగ్ రాజీనామా



**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ చాంపియన్ భారత క్రికెట్ జట్టు జూన్‌లో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. అయితే పూర్తి షెడ్యూల్‌ను ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఆ తర్వాత జట్టు పరిమిత ఓవర్ల సిరీస్ కోసం ఇంగ్లండ్‌కు వెళ్తుంది. మరోవైపు మెగా టోర్నీలో తమ జట్టు పేలవ ప్రదర్శనకు బాధ్యత వహిస్తూ ఐర్లాండ్ కెప్టెన్సీకి పాల్ స్టిర్లింగ్ రాజీనామా చేశాడు. కొత్త కెప్టెన్‌ను త్వరలోనే నియమిస్తామని ఐర్లాండ్ క్రికెట్ బోర్డు పేర్కొంది.

## ఫేక్ వీడియోలపై హైకోర్టుకు.. గంభీర్ పిటిషన్



**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో డీప్‌ఫేక్ వీడియోలు సృష్టించి, తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తున్నారంటూ భారత క్రికెట్ జట్టు కోచ్ గౌతం గంభీర్ కోర్టును ఆశ్రయించాడు. ఆన్‌లైన్‌లో తన పేరు, ముఖం, గొంతును సైతం ఉపయోగించి నకిలీ వీడియోలు, అనధికారిక కంటెంట్ పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తంచేశాడు. దీనిపై 16 మందిని ప్రతివాదులుగా పేర్కొంటూ ఢిల్లీ హైకోర్టులో గంభీర్ పిటిషన్ దాఖలు చేశాడు. నకిలీ వీడియోలను తక్షణమే తొలగించేందుకు ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, రూ.2.5 కోట్ల నష్టపరిహారం ఇప్పించాలని కోరాడు. తను ప్రధాన కోచ్ పదవికి రాజీనామా చేసినట్టు, సీనియర్ ఆటగాళ్లపై అసభ్యకరంగా మాట్లాడినట్టు సోషల్ మీడియాలో గంభీర్ ఫేక్ వీడియోలు చక్కర్లు కొడుతుండగా.. వీటికి లక్షల్లో వ్యూస్ ఉండడం గమనార్హం.

# బ్యాటింగ్.. బ్లాక్‌బస్టర్

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్




## ప్లేఆఫ్స్‌పై పంత్ సేన గురి

### షమి, మయాంక్‌తో బలంగా బౌలింగ్

భారీ హిట్టర్లు.. మెరుగైన బౌలింగ్ విభాగంతో ఎంతటి జట్టుకైనా సవాల్ విసరగల టీమ్ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ). 2022లో మెగా లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన లఖ్‌నవూ తొలి రెండు సీజన్లలో ప్లేఆఫ్స్‌కు చేరినా.. 2024లో ఏడో స్థానానికే పరిమితమైంది. ఈ క్రమంలో కెప్టెన్ రాహుల్‌ను వదులుకొని.. 2025లో రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్లకు ఖరీదు చేసినా ప్రయోజనం లేకపోయింది. మరోసారి ఆ టీమ్ ఏడో స్థానానికే పరిమితమైంది. అయితే, లోటుపాట్లను సరిదిద్దుకొని ఈసారి టైటిల్ నెగ్గాలనే పట్టుదలలో లఖ్‌నవూ ఉంది. కెప్టెన్ పంత్ అందుకు తగిన విధంగా శ్రమిస్తున్నాడు. తన బ్యాటింగ్‌తోపాటు ఫిట్‌నెస్‌పై శ్రద్ధ కనబరుస్తున్నాడు. జోస్ ఇన్‌గ్లిస్ రాకతో బ్యాటింగ్ డెప్త్ పెరిగింది. షమి, అవేశ్ ఖాన్, మయాంక్ యాదవ్ పేస్ భారాన్ని మోయనుండగా.. హసరంగ స్పిన్ మాయాజాలం ప్లస్ కానుంది. నికోలస్ పూరన్, మిచెల్ మార్ష్, పంత్, మార్‌క్రమ్, ఆయుష్ బదోనితో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. జట్టు లోగోనూ కూడా సరికొత్తగా డిజైన్ చేశారు.

**బలాలు:** విధ్వంసం సృష్టించగలిగే టాపార్డర్. మార్‌క్రమ్, మార్ష్, ఇన్‌గ్లిస్, పంత్, పూరన్ నిలబడితే భారీ స్కోర్లు ఖాయం. మార్‌క్రమ్ జట్టులో నిలకడ తీసుకురానుండగా.. ఇన్‌గ్లిస్ జోరు కొనసాగించనున్నాడు. మిడిలార్డర్‌లో పంత్, పూరన్ కీలకం. గత సీజన్‌తో పోల్చితే బౌలింగ్ విభాగం మెరుగ్గా కనిపిస్తోంది. షమి అనుభవం జట్టుకు అదనపు బలం. ఇక, మయాంక్ తన పేస్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను భయపెడతాడు. హసరంగ వికెట్ టేకర్. మొత్తంగా చూస్తే జట్టు సమతుల్యంగా కనిపిస్తోంది.

**బలహీనతలు:** అందరూ భారీ హిట్టర్లు కావడం వల్ల అంతా సాఫీగా సాగితే ఎదురుండదు. కానీ, ఏదైనా తేడా జరిగితే.. నిలబడి జట్టును ఆదుకొనే ప్లేయర్ ఎవరా? అని చూడాల్సిన పరిస్థితి. ఒత్తిడిని ఎదుర్కొంటూ నిలదొక్కుకోగలిగే విధంగా జట్టు తయారు కావాలి. లోయర్ మిడిలార్డర్ మరింతగా మెరుగుపడాలి. ఇక, పేసర్లు షమి, మయాంక్‌పై అతిగా ఆధారపడడం కూడా ఒక బలహీనతగా చెప్పుకోవాలి.

**అంచనా:** గత రెండు సీజన్లతో పోల్చితే ఈసారి లఖ్‌నవూ మెరుగైన ప్రదర్శనతో ప్లేఆఫ్స్ దశకు చేరే అవకాశాలున్నాయి.

**జట్టు: బ్యాటర్లు:** రిషభ్ పంత్ (కెప్టెన్), నికోలస్ పూరన్, జోష్ ఇన్‌గ్లిస్, మార్‌క్రమ్, హిమ్మత్ సింగ్, మాథ్యూ బ్రీజ్‌టెక్, అక్షత్ రఘువంశీ, ముకుల్ చౌదరి.

**ఆల్‌రౌండర్లు:** మిచెల్ మార్ష్, హసరంగ, బదోని, అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్, అర్షిన్ కులకర్ణి.

**బౌలర్లు:** షమి, మయాంక్, అన్రిచ్ నోకియా, అవేశ్ ఖాన్, సిద్దార్థ్, మొహిసిన్ ఖాన్, దిగ్వేష్ రాఠీ, ఆకాంక్ష్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అర్జున్ టెండూల్కర్, నమన్ తివారీ.

## అమ్మో.. అంత బరువా?

### అర్జున్ బ్యాట్‌పై పంత్ ఆశ్చర్యం

**లఖ్‌నవూ:** సచిన్ తనయుడు అర్జున్ టెండూల్కర్ బ్యాట్‌ను చూసి లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ షాకయ్యాడు. ఎందుకంటే.. ఈ యువ ఆల్‌రౌండర్ బ్యాట్ ఏకంగా 1220 గ్రాముల అధిక బరువుతో ఉందట. ఇది పంత్ బ్యాట్ బరువుకన్నా ఎక్కువే. ఈ ఇద్దరి బ్యాట్ల సంభాషణను ఎల్ఎస్‌జీ జట్టు వీడియో ద్వారా షేర్ చేసింది. 'నా బ్యాట్ 1220 గ్రాములుంటుంది. 1200 గ్రాములకంటే తక్కువ బరువున్న బ్యాట్‌ను నేను వాడను. పాపా (సచిన్) అయితే 1310-1315 గ్రాముల బరువున్న బ్యాట్ వాడేవాడు' అని పంత్‌తో అర్జున్ అన్నాడు. అసలు ఇంత బరువున్న బ్యాట్‌తో లాభమేంటి? అన్న పంత్ సందేహానికి జవాబిస్తూ.. బంతిని టచ్ చేస్తే చాలు ఎక్కడికో పోతుందంటూ అర్జున్ సమాధానమిచ్చాడు. ఇటీవలే అర్జున్ పెళ్లి చేసుకోగా.. ఆ మర్నాడే ప్రాక్టీస్ కోసం జట్టుతో పాటు కలవడాన్ని పంత్ కొనియాడాడు.



పంత్‌తో అర్జున్

## మద్యం మానేశా: చాహల్



**న్యూఢిల్లీ:** భారత స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ తన ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయం తీసుకున్నాడు. అల్కహాల్‌ను తీసుకోవడం పూర్తిగా మానేసినట్టు పంజాబ్ కింగ్స్ ప్లేయర్ చాహల్ తెలిపాడు. 'గత ఆరు నెలలుగా నేను మద్యం తీసుకోవడం లేదు. నాకిప్పుడు 35 ఏళ్లు. అందుకే శారీరకంగా మరింత ఫిట్‌గా ఉండి, జట్టు కోసం 150 శాతం కృషి చేయాలన్నదే నా లక్ష్యం. అలాగే ఐపీఎల్‌లో సీనియర్ ఆటగాడిగా నా నుంచి ఇతరులు ఏమైనా నేర్చుకోవాలని ఆశిస్తున్నా. గత సీజన్‌లో గాయం కారణంగా క్వాలిఫయర్ 2, ఫైనల్లో ఆశించిన మేర రాణించలేదు. అందుకే ఈసారి నా శరీరం విషయంలో దృష్టి సారించా' అని డివిల్లీర్స్‌కు ఇచ్చిన ప్యాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో చాహల్ పేర్కొన్నాడు. కాగా గతేడాది ఐపీఎల్‌లో 14 మ్యాచ్‌లాడిన చాహల్ 16 వికెట్లు పడగొట్టాడు. ఇక మొత్తం ఐపీఎల్ కెరీర్‌లో 174 మ్యాచ్‌ల్లో 221 వికెట్లు పతనంచేశాడు.

## ఎలిస్, కర్రాన్ అవుట్

### గాయాలతో ఐపీఎల్‌కు దూరం



కర్రాన్

**చెన్నై:** ఐపీఎల్ ఆరంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు గట్టిదెబ్బ తగిలింది. ఆ జట్టు కొనుగోలు చేసిన ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఎలిస్ తొడ కండర గాయంతో లీగ్ మొత్తానికే దూరమైనట్టు చెన్నై ఫ్రాంచైజీ గురువారం ప్రకటించింది. కాగా, రాజస్థాన్ రాయల్స్ ఆల్‌రౌండర్ సామ్ కర్రాన్ కూడా గాయంతో మెగా లీగ్‌కు దూరం కానున్నట్టు సమాచారం. అతడికి గజ్జల్లో గాయమైనట్టు తెలుస్తోంది. చెన్నై నుంచి కర్రాన్‌ను రాజస్థాన్ ట్రేడింగ్‌లో కొనుగోలు చేసింది. మరోవైపు పంజాబ్ కింగ్స్ ఆటగాడు లూకీ ఫెర్గూసన్ కూడా తొలి 7 మ్యాచ్‌లు ఆడబోవడం లేదు. ఈ న్యూజిలాండ్ పేసర్ వ్యక్తిగత కారణాలతో దూరం కానున్నట్టు సమాచారం.

## క్వార్టర్స్‌లో తన్వీ, మాళవిక

● ఓర్లీన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్



తన్వీ శర్మ

**ఓర్లీన్స్ (ఫ్రాన్స్):** భారత వర్ధమాన షట్లర్లు తన్వీ శర్మ, ఇస్రానీ బారువా, మాళవిక బన్సోడ్ ఓర్లీన్స్ మాస్టర్స్ క్వార్టర్స్‌కు చేరుకోగా.. ఎనిమిదో సీడ్ ఆయుష్ శెట్టి రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. మహిళల సింగిల్స్‌లో సహచరుల మధ్య గురువారం జరిగిన రౌండ్-16లో తన్వీ 21-14, 21-17తో అన్‌మోల్ ఖర్బ్‌పై, ఇస్రానీ 21-11, 14-21, 21-17తో వెన్ యు జాంగ్ (కెనడా)పై, మాళవిక బన్సోడ్ 24-22, 21-13తో వోంగ్ లింగ్ చింగ్ (మలేసియా)పై గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ 21-9, 18-21, 9-21తో యుడాయ్ ఒకిమోటో (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్-హరిహరన్ జంట 26-24, 21-14తో స్కాట్లాండ్ జోడీ అలెగ్జాండర్ డున్-ఆడమ్ ప్రింగిల్‌పై నెగ్గింది.

## ప్రీ క్వార్టర్స్‌లో ఆడ్వాణీకి ఝులక్

**ముంబై:** సీసీఐ స్నూకర్ క్లాసిక్‌లో లెజెండరీ క్యూయిస్ట్ పంకజ్ ఆడ్వాణీకి షాక్ తగిలింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో పంకజ్ 2-4తో క్రీయిష్ గురుబాక్సాని చేతిలో పరాజయం పాలయ్యాడు. భారత నెం:2 ఆదిత్య మెహతా 4-1తో మనుదేవ్‌పై గెలిచి ముందంజ వేశాడు.

## ప్చ్..ఐపీఎల్

టాప్-10 క్రికెట్ లీగ్‌లలో మూడోస్థానంతో సరి



**లండన్:** ఇటీవలి కాలంలో ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్‌లకు ఆదరణ పెరిగింది. ముఖ్యంగా ఐపీఎల్‌కున్న పేరు ప్రతిష్ఠలు అంతా ఇంతా కావు. ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ లీగ్‌గా ఖ్యాతి గడించింది. అయితే క్రికెటర్లకు సంబంధించిన హక్కులు, భద్రత, వివాదాల పరిష్కారం వంటి పలు అంశాల్లో మాత్రం వెనుకంజలోనే ఉంది. అందుకే ప్రపంచ క్రికెటర్ల సంఘం (డబ్ల్యూసీఏ) ప్రకటించిన టాప్-10 క్రికెట్ లీగ్‌ల ర్యాంకుల్లో ఐపీఎల్‌కు మూడో స్థానం మాత్రమే దక్కింది. వీరి జాబితా ప్రకారం ది హండ్రెడ్ (ఇంగ్లండ్), ఎస్ఏ టీ 20 (దక్షిణాఫ్రికా) టాప్-2లో ఉన్నాయి. ఇక బిగ్ బాష్, పాక్ క్రికెట్ లీగ్ 4, 5 స్థానాల్లో నిలిచాయి. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌కు పదో స్థానం దక్కింది. ఈ ర్యాంకుల ప్రక్రియలో మొత్తం 13 అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఐపీఎల్‌కు సంబంధించి లభించే భారీ పేమెంట్లు, అలాగే గత రెండేళ్లలో డబ్బు ఎగవేతలు ఏమీ లేకపోవడం ప్లస్ పాయింట్లుగా నిలిచాయి.

## '2028 ఇండోర్ అథ్లెటిక్స్'కు భారత్ ఆతిథ్యం

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఇండోర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్-2028 ఆతిథ్య హక్కులను భారత్ సొంతం చేసుకొంది. గురువారం పోలెండ్‌లో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు వరల్డ్ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో ప్రకటించాడు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈ పోటీలు జరుగుతాయి. కాగా, 2030 ఈవెంట్ హక్కులను కజకిస్థాన్‌కు కేటాయించారు.

## మరో ఏడాది పొడిగించరూ..

బీసీసీఐకి అగార్కర్ వినతి



**న్యూఢిల్లీ:** టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తన పదవీ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగించాల్సిందిగా బీసీసీఐకి విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. 2027 అక్టోబరు-నవంబరుల్లో జరిగే వన్డే వరల్డ్‌కప్ వరకు తనకు అవకాశం కల్పించాలని కోరాడట. జూలై 2023లో అగార్కర్ చైర్మన్‌గా నియమితుడయ్యాడు. 2024లో టీ20 వరల్డ్‌కప్, 2025లో చాంపియన్స్ ట్రోఫీ నెగ్గడంతో బహుమతిగా ఓ సంవత్సరంపాటు...అంటే ఈ ఏడాది జూన్ వరకు పదవీకాలాన్ని బీసీసీఐ పొడిగించింది. తాజాగా పొట్టికప్‌ను మరోసారి గెల్చుకున్న నేపథ్యంలో ఇంకో ఏడాదిపాటు చీఫ్ సెలెక్టర్‌గా కొనసాగే చాన్స్ ఇవ్వాలని కోరినట్టు చెబుతున్నారు. వెస్ట్‌జోన్‌కు చెందిన మరో భారత మాజీ క్రికెటర్ కూడా సెలెక్షన్ కమిటీ చైర్మన్ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.

# బిజినెస్

# క్రూడ్ సుడిలో మార్కెట్ మునక

» రూ.12.87 లక్షల కోట్ల సంపద ఉఫ్
» సెన్సెక్స్ 2,497 పాయింట్లు డౌన్
» ఒక దశలో 23,000 దిగువకు నిఫ్టీ
» 2024 జూన్ తర్వాత అతి పెద్ద పతనం



ముంబై: ముడి చమురు ధర భగ్గుమనడంతో భారత్ సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లు బెంబేలెత్తాయి. ఇందుకు తోడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చైర్మన్ ఆకస్మిక రాజీనామాతో ఆ బ్యాంక్ షేరు భారీగా నష్టపోయింది. దాంతో మన ఈక్విటీ సూచీలు కుప్పకూలాయి. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ ఒకదశలో 2,753.18 పాయింట్లు (3.58%) పతనమై ఇంట్రాడే కనిష్ఠ స్థాయి 73,950.95 పాయింట్లకు దిగజారింది. చివరికి 2,496.89 పాయింట్ల (3.26%) నష్టంతో 74,207.24 వద్ద స్థిరపడింది. 2024 జూన్ తర్వాత సెన్సెక్స్ ఒక రోజులో నమోదు చేసిన భారీ నష్టం ఇదే. అలాగే గత ఏడాది ఏప్రిల్ 7 తర్వాత నమోదైన కనిష్ఠ ముగింపు స్థాయి ఇది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఒక దశలో 23,000 స్థాయిని కోల్పోయినప్పటికీ.. చివర్లో 775.65 పాయింట్ల (3.26%) నికరంగా నష్టంతో 23,002.15 వద్ద ముగిసింది. అమ్మకాలు పోటెత్తడంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్క రోజులో రూ.12.87 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.426.13 లక్షల కోట్ల స్థాయికి (4.61 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

◆ సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లూ నష్టపోయాయి. ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, ఎం అండ్ ఎం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 5 శాతానికి పైగా నష్టంతో సూచీ టాప్ లూజర్లుగా మిగిలాయి. ఎల్ అండ్ టీ, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ షేర్లు 4 శాతానికి పైగా తగ్గాయి.

◆ బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 3.34%, స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 2.77% పతనమయ్యాయి. రంగాలవారీ సూచీలన్నీ నష్టపోగా.. ఆటో ఇండెక్స్ అత్యధికంగా 4.07% క్షీణించింది. రియల్టీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్స్యూమర్ డిస్క్రెషనరీ, టాప్ టెన్ బ్యాంక్స్, ఇండస్ట్రియల్స్, సర్వీసెస్, ఫోకస్డ్ ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు 3 శాతానికి పైగా తగ్గాయి.

◆ బీఎస్ఈలో 4,404 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,359 నష్టపోయాయి. అందులో 368 సంస్థల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠానికి జారుకోగా.. 7 దిగువ సర్క్యూట్‌ను తాకాయి.

◆ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ.7,558.19 కోట్ల విక్రయాలు జరుపగా.. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐ) 3,863.96 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు.

### ఇంధన షేర్లు విలవిల

క్రూడ్ షాక్‌తో ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ కంపెనీల షేర్లు విలవిల్లాడాయి. కంపెనీల మార్జిన్లకు భారీగా గండిపడవచ్చన్న ఆందోళనలు ఇందుకు కారణం. బీఎస్ఈలో హెచ్‌పీసీఎల్ షేరు ఒకదశలో 7.87% క్షీణించి రూ.321.80 వద్ద కొత్త ఏడాది కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 7.01 శాతం నష్టంతో రూ.324.80 వద్ద స్థిరపడింది. బీపీసీఎల్ షేరు 5.83%, ఐఓసీ షేరు 3.91% నష్టపోయాయి.

### సూచీల నష్టాలకు కారణాలివీ..

- ◆ బ్రెంట్ ముడిచమురు ధర 120 డాలర్లకు చేరువ కావడం
- ◆ చైర్మన్ రాజీనామాతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు భారీ పతనం
- ◆ ఇంధన ధరాఘాతంతో మార్కెట్లో వస్తు, సేవల ధరలు మరింత ప్రియం కావడంతోపాటు ఆర్థిక వృద్ధికి గండిపడవచ్చన్న ఆందోళనలు
- ◆ ప్రామాణిక వడ్డీ రేట్ల భవిష్యత్‌పై ఫెడ్ రిజర్వ్ కఠిన వైఖరి
- ◆ అమెరికాకు ఆర్థిక మాంద్యం ముప్పు మరింత పెరగడం
- ◆ అంతర్జాతీయ మార్కెట్లు సైతం అమ్మకాల ఒత్తిడికి లోను కావడం
- ◆ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నిరవధిక పెట్టుబడుల ఉపసంహరణ

### రూపాయికి తిప్పలే..!

క్రూడ్ కొండెక్కడంతో రూపాయి మరింత ఒత్తిడికి లోనుకానుందని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. చమురు ధరలు దీర్ఘకాలంపాటు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగితే, ఈ ఏడాది చివరిలోగా డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.95కు చేరుకోవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ హెచ్చరించింది. దాంతో ప్రభుత్వంపై దిగుమతుల వ్యయ భారం మరింత పెరగనుంది. కాగా, ఉగాది సందర్భంగా ఫారెక్స్ మార్కెట్ సెలవు పాటించాయి. బుధవారం సెషన్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 49 పైసలు క్షీణించి సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయి రూ.92.89 వద్ద ముగిసింది.

### సూచీల దారెటు..?

ముడిచమురు ధరలు మరింత ఎగబాకితే బేర్ మరింతగా పట్టు బిగించవచ్చని విశ్లేషకులు అంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర మరో 3-4 నెలల వరకు 100 డాలర్ల ఎగువనే కొనసాగితే, నిఫ్టీ 21,000 స్థాయికి క్షీణించే అవకాశాలు లేకపోలేవని ఎమ్కే గ్లోబల్ అంచనా.

### అమీర్ చంద్ షేరు ధర రూ.201-212

హర్యానాకు చెందిన బాస్మతి బియ్యం ఎగుమతిదారు అమీర్ చంద్ జగదీశ్ కుమార్ (ఎక్స్‌పోర్ట్స్) లిమిటెడ్ రూ.440 కోట్ల ఐపీఓ ఈనెల 24న ప్రారంభమై 27న ముగియనుంది. ఐపీఓలో షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.201-212గా నిర్ణయించింది.



## చమురు, గ్యాస్ భగ్గు

### ఒక దశలో 120 డాలర్లకు చేరువైన ధర

#### ఒక్క రోజులో 5 శాతం పైగా పెరిగిన సహజ వాయువు

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. ప్రపంచానికి 20% సహజవాయువు సరఫరా చేసే ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ టెర్మినల్‌తో పాటు కువైట్‌లోని రెండు చమురు రిఫైనరీలపై ఇరాన్ దాడితో వాటిని తాత్కాలికంగా మూసి వేయాల్సిరావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. ఈ తాజా దాడులు చమురు, గ్యాస్ కొరతను మరింత తీవ్రం చేయవచ్చన్న ఆందోళనలతో వాటి ధరలు భారీగా ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర ఒక దశలో 119.13 డాలర్లను తాకింది. తదుపరి క్రమంలో కాస్త తగ్గి 116.38 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అమెరికన్ బెంచ్‌మార్క్ క్రూడాయిల్ రేటు 96.45 డాలర్లకు చేరుకుంది. అలాగే, యూఎస్ నేచురల్ గ్యాస్ ధర ఒకదశలో 5.74% పెరిగి 3.24 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

### 200 డాలర్ల దిశగా ధర..?

గత నెల 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి సమయానికి బ్రెంట్ క్రూడాయిల్ రేటు 73 డాలర్ల స్థాయిలో ఉంది. గడిచిన 20 రోజుల్లో దాదాపు 120 డాలర్లకు ఎగబాకింది. అంటే, 47 డాలర్లు పెరిగింది. యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో చమురు, గ్యాస్ సరఫరా, ఉత్పత్తి మూడో వంతుకు పడిపోవడం ఇందుకు ప్రధాన కారణం. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, క్రూడ్ త్వరలోనే 150 డాలర్లకు చేరుకోవచ్చని, ఇంధన క్షేత్రాలపై దాడులు తీవ్రతరమై ఉత్పత్తి, సరఫరా స్తంభించిపోతే ధర 200 డాలర్ల దిశగా పయనించవచ్చని కమోడిటీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

| ఫామ్‌గేట్ ధర | | వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్ | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 170 | విజయవాడ | 165 |
| వరంగల్ | 170 | గుంటూరు | 165 |
| కరీంనగర్ | 170 | ఒంగోలు | 165 |
| మహబూబ్‌నగర్ | 170 | చిత్తూరు | 160 |
| కర్నూలు | 170 | నెల్లూరు | 165 |
| విశాఖపట్నం | 150 | అనంతపురం | 165 |
| గోదావరి | 165 | | |



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,51,910 ▼ | 1,39,250 ▼ | 2,65,000 ▼ |
| విజయవాడ | 1,61,000 ▲ | 1,49,000 ▲ | 2,57,000 ▼ |
| విశాఖపట్నం | 1,49,387 ▼ | 1,43,000 ▼ | 2,65,000 ▼ |
| రాజమండ్రి | 1,57,750 ▼ | 1,44,600 ▼ | 2,45,000 ▼ |
| ప్రొద్దుటూరు | 1,51,000 ▼ | 1,38,920 ▼ | 2,42,000 ▼ |
| ముంబై | 1,47,890 ▼ | 1,35,470 ▼ | 2,29,870 ▼ |

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ముసలం?

### చైర్మన్ రాజీనామా.. షేరు విల విల



న్యూఢిల్లీ: దేశంలో రెండో పెద్ద బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సంక్షోభం తలెత్తింది. బ్యాంకు స్వతంత్ర డైరెక్టర్, పార్ట్ టైమ్ చైర్మన్ అతాను చక్రబర్తి తన పదవులకు రాజీనామా చేశారు. విలువలు, నైతికతపై బ్యాంకు యాజమాన్యంతో విభేదించి తాను వైదొలగుతున్నట్టు ఆయన ప్రకటించి అందరినీ విస్మయానికి గురి చేశారు. ఈ అనూహ్య పరిణామం మార్కెట్‌ను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఫలితంగా గురువారం బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు భారీ నష్టానికి గురయింది. అమ్మకాల హోరుతో ఆ షేరు నికరంగా 5.13% నష్టంతో రూ.799.70 వద్ద ముగిసింది. బ్యాంకు షేర్ల మార్కెట్ విలువ ఒక్క రోజే రూ.65,946 కోట్లు దిగజారింది.

**కేకి మిస్త్రీకి పగ్గాలు:** చక్రబర్తి రాజీనామాతో హెచ్‌డీఎఫ్‌సీ మాజీ వైస్ చైర్మన్ కేకి మిస్త్రీని బ్యాంకు మూడు నెలల కాలానికి తాత్కాలిక చైర్మన్‌గా నియమించింది. ఆర్‌బీఐ కూడా వెంటనే ఇందుకు ఆమోదం తెలిపింది. గురువారం నుంచే ఈ నియామకం అమల్లోకి వచ్చింది.

**నచ్చకే రాజీనామా చేశా:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అనుసరిస్తున్న విధానాలు తాను నమ్మే నైతిక విలువలకు విరుద్ధంగా ఉన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చక్రబర్తి తన రాజీనామా లేఖలో పేర్కొన్నప్పటికీ అవేమిటో వివరించలేదు. బ్యాంకు డైరెక్టర్ల బోర్డు అత్యవసరంగా సమావేశమై రాజీనామాపై పునఃపరిశీలించాలని చక్రబర్తిని కోరింది. అలాగే బ్యాంకుకు సంబంధించిన ఏ విధానాలు నచ్చలేదో చెప్పాలని కోరింది. రాజీనామా లేఖలో వాడిన భాషను కూడా మార్చాలని అభ్యర్థించింది. ఆయన స్పందించకపోవడంతో మిస్త్రీకి తాత్కాలికంగా పగ్గాలు అప్పగించాలని తీర్మానించింది.

**మాకు నమ్మకం ఉంది:** మరో వైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వ్యాపార విధానాలు, నిర్వహణ విధానాలపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్‌బీఐ పూర్తి నమ్మకం వ్యక్తం చేశాయి. బ్యాంకు ఆర్థిక పునాదులు అత్యంత బలంగా ఉన్నట్టు తెలిపాయి. ఈ మేరకు ప్రకటన విడుదల చేశాయి.

## బులియన్ మార్కెట్ కుదేలు

### పసిడి రూ.7,000.. వెండి రూ.17,800 పతనం



న్యూఢిల్లీ: గురువారం బులియన్ మార్కెట్ కూడా 'బేర్' పట్టులోకి జారుకుంది. ఢిల్లీలో కిలో వెండి ధర ఏకంగా రూ.17,800 (7%) నష్టపోయి రూ.2,38,700కి పడిపోయింది. 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) పసిడి ధర సైతం రూ.7,000 (4.37%) నష్టపోయి రూ.1,53,300 వద్ద ముగిసింది. ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు వెలవెలబోతున్నాయి. గురువారం ఎంసీఎక్స్‌లో వచ్చే నెల డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి రూ.3,616 (2.36%) నష్టపోయి రూ.1,49,409 వద్ద ముగిసింది.

### ఎగిసి 'పడిన' మార్కెట్

ఈ ఏడాది జనవరి 29న కిలో వెండి రూ.4,04,500కు, 10 గ్రాముల పసిడి రూ.1.83 లక్షలకు చేరి రికార్డు సృష్టించాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు చూస్తే కిలో వెండి ధర 41% (రూ.1,65,800), పసిడి ధర 16.23% (రూ.29,700) తగ్గాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 20వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 420 | విజయవాడ | 445 |
| వరంగల్ | 422 | గోదావరి | 415 |
| చిత్తూరు | 498 | విశాఖపట్నం | 415 |
| | | డజను గుడ్లు రూ. 60 | |

## అవమాన భారంతోనే
# శ్రీవిద్య ఉసురు తీసుకుందా?

- కేయూ విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో మరో కోణం
- రాత్రి 9 వరకు పోలీస్‌స్టేషన్‌లోనే పడిగాపులు
- తోటి విద్యార్థుల ఫిర్యాదుతో మనస్తాపం


శ్రీవిద్య (ఫైల్)

కేయూ క్యాంపస్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ రెండో ఏడాది స్టూడెంట్ పెద్దమళ్ల శ్రీవిద్య ఆత్మహత్య ఘటనలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తోటి విద్యార్థుల వేధింపులతో పాటు పోలీసుల విచారణ పేరుతో జరిగిన అవమానం భరించలేకే ఆమె తనువు చాలించిందనే అనుమానాలు బలపడుతున్నాయి. ల్యాప్‌టాప్ దొంగతనం జరిగిందంటూ తోటి విద్యార్థులు చేసిన ఫిర్యాదుపై మార్చి 4న కేయూ పోలీస్‌స్టేషన్ చేరుకున్న శ్రీవిద్యను, రాత్రి తొమ్మిదింటి వరకు స్టేషన్‌లోనే పడిగాపులు కాయించినట్లు, అధికారులు లేరంటూ ఆమెను అక్కడే ఉంచినట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కడం, అక్కడ గంటల తరబడి వేచి ఉండడాన్ని ఆమె భరించలేకపోయింది. తీరా రాత్రి 9 గంటల సమయంలో 'రేపు మళ్లీ రావాలి' అని పోలీసులు చెప్పడంతో శ్రీవిద్య కుంగిపోయినట్లు సమాచారం. తనను పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధపడింది. తన ప్రమేయం లేకపోయినా దొంగతనం నింద మోపడం, అది పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం శ్రీవిద్యను ఆత్మహత్య వైపు ప్రేరేపించాయని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు.

## పెంపుడు పిల్లి మరణం తట్టుకోలేక..
# విద్యార్థిని ఆత్మహత్య

సరూర్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఓ మూగజీవిపై పెంచుకున్న మమకారం ఆ యువతి ప్రాణాలు తీసింది. తాను ప్రాణప్రదంగా పెంచుకున్న పిల్లి చనిపోవడాన్ని జీర్ణించుకోలేక ఓ డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్ నగర శివారు మీర్‌పేట్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. బడంగ్‌పేట్‌లోని అంజనాద్రి నివాస్‌కు చెందిన హిమబిందు(20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. మూగజీవాలపై మక్కువతో రెండేళ్ల నుంచి ఓ పిల్లిని పెంచుకుంటోంది. బుధవారం తెల్లవారుజామున ఆ పెంపుడు పిల్లి ఇంటిముందే విగతజీవిగా కనిపించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనైన హిమబిందును తల్లిదండ్రులు ఓదార్చారు. అయితే, పిల్లి మరణించిన బెంగతో ఇంట్లోని పురుగుల మందు(ఎలుకలు, బొద్దింకలు చంపడానికి ఉపయోగించేది) తిని బలవన్మరణానికి పాల్పడింది.

## డాడీ.. మోడీ.. చిన్న మోడీపైనే
# నా పోరాటం

### నేను దూరమయ్యాక నిజామాబాద్‌లో బీఆర్ఎస్ బాగా నష్టపోయింది

- వనపర్తి నుంచి పోటీ చేయమని కార్యకర్తలు కోరుతున్నారు
- బీఆర్ఎస్‌తో నాకున్న విభేదాలను రేవంత్ అవకాశంగా చేసుకుంటున్నారు
- త్వరలోనే కొత్త పార్టీని ప్రకటిస్తా
- దాని కంటే ముందు జాతీయ స్థాయి నేతలను కలుస్తా
- మీడియా చిట్‌చాట్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత


జాగృతి కార్యాలయంలో గురువారం జరిగిన ఉగాది ఉత్సవాల్లో కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): "నేను ఎవరితోనూ రాజీపడను.. ఆ అవసరం కూడా నాకు లేదు. నా పోరాటమంతా డాడీ (కేసీఆర్), మోడీ (ప్రధాని), చిన్నమోడీ (సీఎం రేవంత్‌రెడ్డి) పైనే" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో గురువారం ఆమె మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. తాను బీఆర్ఎస్‌కు దూరమైన తర్వాత నిజామాబాద్ జిల్లాలో ఆ పార్టీ పూర్తిగా నష్టపోయిందన్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో జాగృతి పార్టీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ అని కాదు.. చాలాచోట్ల నుంచి తనను ఎన్నికల్లో పోటీ చేయమంటున్నారని, ఇటీవల వనపర్తి నుంచి పోటీ చేయాలని జాగృతి కార్యకర్తలు కోరుతున్నారని తెలిపారు. అయితే, ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలనే విషయాన్ని సమయానుగుణంగా నిర్ణయించుకుంటానని చెప్పారు. బీఆర్ఎస్‌తో తనకున్న విభేదాలను సీఎం రేవంత్‌రెడ్డి అవకాశంగా తీసుకుంటున్నార ని ఆరోపించారు. తనకు ఎటువంటి బేషజాలు లేవని, అందరినీ కలుపుకొని పోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో విశారదన్, ప్రజా సంఘాలు, సీపీఎం, సీపీఐఎం ఎల్ న్యూడెమొక్రసీ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని వెల్లడించారు. సామాజిక తెలంగాణ ధ్యేయంతో.. సర్వోదయ రాష్ట్రం దిశగా ముందుకు వెళ్తున్నామని, ఇందుకోసం గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాన్ని అధ్యయనం చేస్తున్నానని చెప్పారు. మంచి ముహూర్తం చూసుకొని తన కొత్త పార్టీని త్వరలోనే ప్రకటిస్తానని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన యువతకు రాజకీయంగా అవకాశం కల్పిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ప్రభావం కచ్చితంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే పార్టీ ప్రకటనకు ముందే... శ్రీరామనవమి తర్వాత పలువురు జాతీయ స్థాయి నేతలను కలవనున్నానని కవిత తెలిపారు. కాగా, తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కవిత కొత్త పార్టీని త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

### 2,15,200 కోట్లతో జాగృతి ప్రజా బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జాగృతి ప్రజా బడ్జెట్ పేరిట ఆ సంస్థ అధ్యక్షురాలు కవిత రూ.2,15,200కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ప్రభుత్వం 3లక్షల కోట్లకు పైగా అంచనాలతో బడ్జెట్ ప్రవేశపెట్టనుందని, తాము 2.15లక్షల కోట్లతోనే బడ్జెట్ ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. ప్రజల సూచనల మేరకే ప్రజా బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ప్రజా బడ్జెట్‌లో విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్ద పీట వేశామని, కాగా సంక్షేమ పథకాలను గాంధీ కుటుంబ సభ్యులే కాదు తమకు నచ్చిన వారి పేర్లతో ప్రకటించుకోవచ్చన్నవారు. తాము ప్రతిపాదించిన బడ్జెట్ వల్ల రాష్ట్ర పురోగతితో పాటు సంపద సృష్టి కూడా జరుగుతుందని కవిత పేర్కొన్నారు.

## తెలంగాణ ప్రజా జాగృతిపై త్వరగా తేల్చండి

- ఈసీఐకి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు చెందిన 'తెలంగాణ ప్రజా జాగృతి' (టీపీజే) పార్టీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ)ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. కొత్తపార్టీ నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా ఈసీ జాప్యం చేస్తోందని కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈసీ తీరు తెలంగాణలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనే తన సామర్థ్యాన్ని దెబ్బతీస్తోందని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అమిత్ బన్సల్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కవిత తరపున సీనియర్ అడ్వొకేట్ రిషికుమార్ సింగ్ గౌతమ్ వాదిస్తూ.. ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 కింద పార్టీ నమోదు కోసం జనవరి 23న కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసినట్లు కోర్టుకు తెలిపారు. అవసరమైన అన్ని పత్రాలు, పార్టీ రాజ్యాంగం, నోటరీ చేసిన అఫిడవిట్లు, 151 మంది సభ్యుల సభ్యత్వ జాబితా సహా అన్ని పత్రాలను సమర్పించామని, నిర్ణీత రుసుము కూడా చెల్లించామని చెప్పారు. కానీ తమ దరఖాస్తు అంశంలో ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం కవిత దరఖాస్తుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీని ఆదేశించింది. విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది.

## రాజ్యసభ సభ్యుల్లో
# 31 మంది బిలియనీర్లు

- వారిలో 9 మంది తెలుగు రాష్ట్రాల ఎంపీలే
- అందులో నలుగురు టాప్ 10 జాబితాలో
- రూ.5,300 కోట్లతో బండి పార్థసారథి ఫస్ట్
- మూడో స్థానంలో వైసీపీ అయోధ్యరామిరెడ్డి
- ఏడీఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎంపీల్లో 31 మంది బిలియనీర్లు ఉండగా వారిలో తెలుగు రాష్ట్రాల ఎంపీలే 9మంది ఉన్నారు. వారిలో నలుగురు తెలంగాణకు, ఐదుగురు ఏపీకి చెందినవారు. అత్యధిక ఆస్తులున్న ఎంపీల్లో బండి పార్థసారథి (బీఆర్ఎస్) రూ.5,300 కోట్లతో ప్రథమ స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో ఆప్ ఎంపీ రాజేందర్ గుప్తా (రూ.5,053 కోట్లు), మూడో స్థానంలో వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి (రూ.2,577 కోట్లు) ఉన్నారు. టాప్ 10 బిలియనీర్లలో తెలుగు రాష్ట్రాల నుంచి బండి పార్థసారథితో పాటు అయోధ్య రామిరెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ, మేడా రఘునాథ్ రెడ్డి ఉన్నారు. 31 మంది బిలియనీర్లలో బీజేపీ (6), కాంగ్రెస్ (5), వైసీపీ (4), బీఆర్ఎస్ (2), టీడీపీకి చెందిన ఒకరు ఉన్నారు. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) గురువారం ఓ నివేదిక విడుదల చేసింది. ఏడీఆర్.. 233 మందికిగాను 229 మంది రాజ్యసభ సభ్యుల అఫిడవిట్లను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది. రాజ్యసభ ఎంపీల సగటు ఆస్తి రూ.120.69 కోట్లు అని నివేదిక పేర్కొంది. రాజ్యసభ ఎంపీల మొత్తం ఆస్తులు రూ.27,638 కోట్లు కాగా, రాష్ట్రాలవారీగా తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడుగురు ఎంపీలు అత్యధికంగా మొత్తం రూ.8,130 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారు. పంజాబ్ రెండో స్థానంలో ఉండగా, ఏపీ మూడో స్థానంలో ఉంది. పార్టీల వారీగా అత్యధికంగా ఆప్‌కు చెందిన 10 మంది ఎంపీలు మొత్తం రూ.5,740 కోట్లు, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు ఎంపీలు రూ.5,524 కోట్లు, వైసీపీకి చెందిన ఏడుగురు ఎంపీలు మొత్తం రూ.3,658 కోట్లు ఆస్తులు కలిగి ఉన్నారు. పార్టీల వారీగా ఎంపీల సగటు ఆస్తుల్లో ఆప్ (రూ.574.09 కోట్లు) ముందుంది. రెండో స్థానంలో ఏడుగురు వైసీపీ ఎంపీలు రూ.522.63 కోట్ల సగటు ఆస్తులు కలిగి ఉన్నారు. ఇటీవల తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సింఘ్వీకి రూ.2,558 కోట్లు, వేం నరేందర్ రెడ్డి రూ.41కోట్ల ఆస్తులున్నాయి. మరోవైపు, ఆప్ ఎంపీ సంత్ బల్బీర్ సింగ్ రూ.3 లక్షలతో అతి తక్కువ ఆస్తులు ఉన్న ఎంపీగా నిలిచారు. అతి తక్కువ ఆస్తులు ఉన్న 10 మంది ఎంపీల్లో ఇద్దరు సీపీఎం నేతలు ఉండడం గమనార్హం. కాగా, రాజ్యసభ ఎంపీల్లో 73 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. సీరియస్ క్రిమినల్ కేసులున్న వారు 36 మంది. తెలంగాణలో ఐదుగురిపై, ఏపీలో ముగ్గురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

# దుబాయి, ఢిల్లీకి సిట్?

(మొదటి పేజీ తరువాయి)

మరణించారు. కేదార్‌పై హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసులు ఉన్నాయి. అలాగే, తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కేదార్ ద్వారా దుబాయ్‌లో రియల్ ఎస్టేట్, ఇతర రంగాల్లో కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కేదార్ దుబాయ్‌లోని తన ఫ్లాట్‌లో మరణించిన సమయంలో రోహిత్ రెడ్డితోపాటు మరో మాజీ ఎమ్మెల్యే అక్కడే ఉన్నారని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే, రోహిత్ రెడ్డి ఫాంహౌస్‌లో ఇటీవల జరిగిన డ్రగ్స్ పార్టీకి కేదార్‌తో సంబంధాలున్న వారు కూడా హాజరయ్యారని అంటున్నారు. దుబాయిలో యుద్ధ పరిణామాల నేపథ్యంలో తమ పెట్టుబడుల విషయంలో వీరంతా రోహిత్ రెడ్డితో చర్చించారనే అనుమానాలు ఉన్నాయి. విచారణ ముందుకు వెళుతున్న కొద్దీ ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి. మరో పక్క, నిందితుల్లో కొందరు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా డ్రగ్స్ రాకెట్ నడుపుతున్నట్లు పోలీసులు బలంగా నమ్ముతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన సమాచారం ఆధారంగా డ్రగ్స్ కేసు మూలాలు దుబాయి, ఢిల్లీలో ఉన్నట్లు తేలింది. దీంతో సిట్ బృందాలు విచారణ నిమిత్తం త్వరలో దుబాయ్, ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. నిందితుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా డ్రగ్స్ మాఫియా మూలాలను తెలుసుకునేందుకు ఇప్పటికే పలు బృందాలు పని చేస్తున్నాయి. అయితే, ప్రధాన నిందితులను కస్టడీకి తీసుకున్న తర్వాత లోతుగా విచారణ మొదలవుతుందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

### ఇద్దరు నిందితుల విచారణ

ఉగాది పండుగ రోజు కూడా సిట్ బృందం ఈ కేసు దర్యాప్తులో నిమగ్నమైంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న శరత్, కౌశిక్ రవిని శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం విచారించింది. వారి నుంచి వాంగ్మూలాల పత్రాలపై సంతకాలు తీసుకుంది. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితుడు బీఆర్ఎస్ నేత రోహిత్ రెడ్డితో పాటు రితేశ్ రెడ్డి, నమిత్ శర్మ కస్టడీపై ఉప్పరిపల్లి కోర్టు శుక్రవారం తీర్పు ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో కోర్టు అనుమతి ఇచ్చిన తర్వాత ఏం చేయాలనే దానిపై సిట్ బృందం కసరత్తు చేస్తోంది. రిమాండ్‌లో ఉన్న వారిని కస్టడీకి తీసుకోగానే ఇప్పటి వరకు బయట ఉన్న నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా రోహిత్‌రెడ్డి, రితేశ్ రెడ్డి, నమిత్‌శర్మను అధికారులు విచారించనున్నారు. వీరిని ఒక సారి విచారించిన తర్వాత భిన్నమైన సమాచారం ఇచ్చిన నిందితులను ఎదురెదురుగా కూర్చోబెట్టి సాక్ష్యాలతో విచారించే అవకాశముంది. నిందితుల్లో ఒకరైన కౌశిక్ రవి డ్రగ్స్‌ను సిమ్లాలో కొనుగోలు చేసినట్లు చెప్పినప్పటికీ విచారణలో అది అవాస్తవమని తేలింది. డ్రగ్స్‌ను హైదరాబాద్‌లో అభిషేక్ సింగ్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు తేలినట్లు సమాచారం. ఇలా నిందితులు మరికొన్ని విషయాల్లో కూడా పరస్పరం విరుద్ధంగా సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. రిమాండ్‌లో ఉన్న వారిని కస్టడీకి తీసుకున్న తరువాత ఈ కేసు మరిన్ని మలుపులు తిరిగే అవకాశాలు ఉన్నాయి.

# ఈ ఏడాది వైఎస్ జగన్ జాతకం 'వీక్'

- వైసీపీ ఉగాది పంచాగ శ్రవణంలో పంచాంగకర్త పిడపర్తి

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జాతకం బలహీనంగా ఉందని పంచాంగకర్త పిడపర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆయన సమక్షంలోనే వెల్లడించారు. ఉగాదిని పురస్కరించుకుని గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో శ్రీ పరాభవనామ సంవత్సర పంచాంగ శ్రవణం జరిగింది. జగన్ దంపతులు హాజరయ్యారు. పంచాంగకర్త పిడపర్తి రాశి ఫలాలను చదివారు. జగన్ నక్షత్రం ఆరుద్ర.. మిథున రాశి అని.. ఈ రాశి వారికి ఈ ఏడాది సామాన్య ఫలితాలే ఉంటాయని.. వచ్చే సంవత్సరం కొంత మెరుగవుతాయని.. ఆ పై ఏడాది ఇంకొద్దిగా మెరుగవుతాయని చెప్పారు. ఆయన జాతకం బలహీనంగా ఉన్నా.. ఆయన భార్య భారతి జాతకం (రోహిణి నక్షత్రం-మృగశిర రాశి) బలంగా ఉందని.. ఆ ప్రభావంతో జగన్ అనుకున్నవి జరిగే అవకాశముందని తెలిపారు. ఇదే సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం గురించి చెప్పారు. 'రాష్ట్రంలో ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖంగా, సుభిక్షంగా ఉంటారు..' అని వివరించారు. పంటలు పుష్కలంగా పండుతాయని.. చిరుధాన్యాల దిగుబడి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం స్థిరంగా ఉంటుందన్నారు.

# ఏపీ జాబ్ క్యాలెండర్ వచ్చేసింది

- 'ఎక్స్'లో విడుదల చేసిన మంత్రి లోకేశ్
- ఈ ఏడాదికి 10,060 ఉద్యోగాల భర్తీ
- 4 విడతల్లో మొత్తం 41 నోటిఫికేషన్లు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ జాబ్ క్యాలెండర్ వచ్చేసింది. 10,060 పోస్టులతో దీన్ని కూటమి ప్రభుత్వం ఉగాది సందర్భంగా గురువారం విడుదల చేసింది. మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి లోకేశ్ 'ఎక్స్' ద్వారా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ ఏడాది నాలుగు విడతల్లో మొత్తం 41 నోటిఫికేషన్ల ద్వారా ఈ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. మే 15, ఆగస్టు 15, సెప్టెంబరు 15, అక్టోబరు 15 తేదీల్లో ఈ నోటిఫికేషన్లను విడుదల చేస్తారు. నిర్దేశిత కాలంలో ఆ ఉద్యోగాలను ఆయా రిక్రూట్‌మెంట్ శాఖలు భర్తీచేస్తాయి. డీఎస్సీ ద్వారా మరోసారి 2535 ఉద్యోగాలను పాఠశాల విద్యాశాఖ భర్తీ చేయనుంది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 1970 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ 400 పోస్టుల నియామకాలను ఏపీపీఎస్సీ పూర్తిచేస్తుంది. 147 ఫైర్ డ్రైవర్ ఆపరేటర్ పోస్టులను అగ్నిమాపక శాఖ భర్తీ చేస్తుంది. మిగిలిన పోస్టులను ఏపీపీఎస్సీ పరీక్షల ద్వారా భర్తీ చేస్తారు. అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1500 పోస్టులకు ఏపీపీఎస్సీ రాత పరీక్ష నిర్వహిస్తుంది. అనంతరం వర్సిటీల్లో ఇంటర్వ్యూల ద్వారా ఆ పోస్టులను భర్తీ చేస్తారు. గ్రూప్-1లో 91 పోస్టులు, ఎస్ఐ 418, జైల్ వార్డెన్(మెన్) 171, ఫోరెన్సిక్ లేబొరేటరీ పోస్టులు 64, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ 93, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ 48, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ 100, ప్లానింగ్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ 251, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ 95, గ్రూప్-2లో 750, గనుల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 503, ఏఎంవీఐ 50, డైట్ లెక్చరర్ 104, డైట్ సీనియర్ లెక్చరర్ 46, ఇంటర్మీడియట్‌కు జూనియర్ లెక్చరర్ 209, పాఠశాల విద్యా శాఖలో లైబ్రేరియన్స్ 100 పోస్టులు ఉన్నాయి.

### ఇతర శాఖల్లో పోస్టులు

ఎఫ్ఎస్ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్-8, సోషల్ వెల్ఫేర్ ఏఎస్‌డబ్ల్యూవో-11, ట్రైబల్ వెల్ఫేర్ ఏటీడబ్ల్యూవో-6, ట్రైబల్ వెల్ఫేర్ ఏడీ-1, అటవీ శాఖలో ఎఫ్ఆర్‌వో-4, బీట్ ఆఫీసర్-35, ఎఫ్ఎస్‌వో-41, టెక్ అసిస్టెంట్-20, పీసీబీలో పర్యావరణ ఇంజనీర్లు-40, ప్లానింగ్ ఏడీ-17, ఉద్యాన అధికారులు- 25, పశుసంవర్ధక శాఖ-80, కార్మిక శాఖలో ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్-12, జువైనల్ శాఖలో సూపర్‌వైజర్-49, గనుల శాఖలో ఏడీ-1, టెక్నికల్ అసిస్టెంట్-36, రాయల్టీ ఇన్‌స్పెక్టర్-9, ల్యాబ్ అసిస్టెంట్-1, ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ కెమికల్ ఎగ్జామినర్-9, ఎస్‌సీఈఆర్‌టీ లెక్చరర్-10 పోస్టులు ఉన్నాయి.


**దక్షిణ మధ్య రైల్వే**
మమ్మల్ని ♥ @ SCRailwayindia అనుసరించండి
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

**బహిరంగ టెండరు ప్రకటన నం. B-E29-TRD-TNDR-47-2025-26, తేది. 16.03.2026** PUB/2141

భారత రాష్ట్రపతి తరపునదిగువ సంతకందారు దిగువ పనులకు IREPS లో టెండర్లు కోరడమైనది.

**టెండరు నం.:** B-E29-TRD-TNDR-47-2025-26, **పని పేరు:** విజయవాడ డివిజన్‌లోని బయ్యావరం వద్ద UP సైడ్‌పై చిట్ట చివరన 750m యొక్క CSR తో ప్రతిపాదించిన అదనపు కామన్ లూప్ లైన్‌కు సంబంధించి విద్యుదీకరణ మరియు OHE కు మార్పులు. **సుమారు విలువ:** రూ. 1,81,74,333.20. **పూర్తి చేయు కాలం:** 12 నెలలు. **బిడ్ సెక్యూరిటీ (EMD):** రూ. 2,40,900/– **ముగింపు తేది:** 07.04.2026. **టెండరు ఫారమ్ ధర:** లేదు.

పూర్తి వివరాలు మరియు నిబంధనల కొరకు మా సైట్ **www.ireps.gov.in** దర్శించ గలరు.
**NB:** ఒకవేళ టెండరు తెరుచు తేది సెలవుగా ప్రకటిస్తే మరుసటి పనిరోజున అవి తెరువబడతాయి.
**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, TrD, విజయవాడ**

**ఇ-టెండరు ప్రకటన నం. GNT/SG/36/372 తేది:13.03.2026** PUB/2142

దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు **06.04.2026న 16.00 గం.ల** వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

**ఐడి నం.:** 372, **పని పేరు:** గుంటూరు డివిజన్ పై 1.NLPD-PRCA మధ్యన కి.మీ 6/5-6 మరియు 2. TEL-VJA స్టేషన్ల మధ్యన కి.మీ.21/30-32 వద్ద కాచ్ వాటర్ డ్రైన్, రిటైనింగ్ వాల్స్‌తోపాటు కొత్త ఆర్‌సిసి బాక్స్ బ్రిడ్జిల నిర్మాణంకు సంబంధించి సిగ్నలింగ్ మరియు టెలికాం ఏర్పాట్లు. **ప్రకటిత టెండరు విలువ:** రూ.41,60,032.00, **బయానా / బిడ్ సెక్యూరిటీ:** రూ.83,200/. **టెండరు డాక్యుమెంట్ ధర:** రూ. లేదు.

1. ఆన్‌లైన్‌లో ఇ-బిడ్ల దాఖలుకు చివరి తేది **06.04.2026న 16:00 గం. వరకు.** సవివరమైన సమాచారం కొరకు వెబ్‌సైట్ **www.ireps.gov.in** కు లాగిన్ అవండి.
2. ఏదేని తదుపరి సమాచారం / సవరణ ఇ-పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / గుంటూరు**

**టెండరు ప్రకటన నం.CRS-E-08-R1-25-26, తేది: 17.03.2026** PUB/2143

భారత రాష్ట్రపతి తరపున **డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్/ క్యారేజ్ రిపేర్ షాప్/ తిరుపతి** వారు పేర్కొన్న ముగింపు తేదిన 11.00 గం.ల వరకు పేర్కొన్న టెండరు నం.లకు ఎదురుగా ఇ-టెండర్లు కోరుచున్నారు. బిడ్డర్లు తమ ఒరిజినల్/ప్రైవేట్ బిడ్లను ముగింపు తేది & సమయం వరకు మాత్రమే దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ టెండరుకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించిన వెంటనే తిరస్కరించబడును

క్ర.సం. 1. **పని వివరణ:** టెండరు నం.CRS-E-08-R1-25-26, తేది: 10.01.2026. 24 నెలల కాలానికి క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతిలో ఏసి సెక్షన్ వద్ద ఏసి కోచులు-పిటిహెచ్ యాక్టివిటీలో RMPUs పిట్టెడ్ యొక్క సమగ్ర నిర్వహణ కాంట్రాక్టు. **సుమారు వ్యయం :** రూ.10,30, 22,285.98/. **బిడ్ సెక్యూరిటీ:** రూ.20,60,400/. **పూర్తి చేయు కాలం :** 24 నెలలు. **ముగింపు తేది :** 08.04.2026న 11.00 గం.లకు.

**వెబ్‌సైట్ వివరాలు :** www.ireps.gov.in

**టెండరు పూర్తి వివరాలు చూచుటకు నోటీసు బోర్డు ఉంచిన ప్రదేశం:** చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి

తదుపరి టెండరు నియమాలు / వివరాల కొరకు (టెండర్ డాక్యుమెంట్లలో అందుబాటులో ఉన్నాయి) మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్, సవరణ కొరకు, దయచేసి మా వెబ్‌సైట్ **https://www.ireps.gov.in** ని సందర్శించగలరు.
**చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, (CRS), తిరుపతి**

**టెండరు ప్రకటన నం.: 02-GS-SC-II-26-OT, తేది:17.03.2026** PUB/2146

భారత రాష్ట్రపతి తరపున Dy.CE/ GS/ HYB, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు 14.04.2026న 15.00 గం.ల వరకు ఇ-ప్రొక్యూర్ మెంట్ ద్వారా దిగువ పనుల కొరకు బహిరంగ టెండర్లు కోరుచున్నారు.

**టెండరు నం.:** 02-GS-SC-II-26-OT; **పని పేరు:** అమృత్ స్టేషన్ పథకం క్రింద మెదక్ స్టేషన్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు. **ప్రకటిత విలువ:** రూ. 38,03,414.81. **బయానా:** రూ. 76,100.00.

తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ **www.ireps.gov.in** ను దర్శించవచ్చును.
**డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/గతి శక్తి, హైదరాబాద్**

**టెండరు ప్రకటన నం. 8-CWMLGDRBK-ET-2025-26, తేది: 13.03.2026** PUB/2145

భారత రాష్ట్రపతి తరపున చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్/లాలాగూడ వారు టెండరు నం. **8-CWMLGDRBK-ET-2025-26, తేది: 13.03.2026** కు ఎదురుగా ఇ-టెండర్లు కోరుచున్నారు. **ముగింపు తేది:** 06.04.2026న 11.00 గం.లకు. బిడ్డర్లు తమ ఒరిజినల్/ప్రైవేట్ బిడ్లను ముగింపు తేదీ & సమయం వరకు మాత్రమే దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ టెండరుకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించిన వెంటనే తిరస్కరించబడును.

**టెండరు నం. 8-CWMLGDRBK-ET-2025-26, పని వివరణ:** రైల్ భోగి కార్ఖానా, దక్షిణ మధ్య రైల్వే, యాద్గిర్ జిల్లా, కర్ణాటక రాష్ట్రం-585221వద్ద కసేర్ మేక్ సిఏఎస్‌డిఎక్స్ 165టి/12 బార్ స్క్రూ ఎయిర్ కంప్రెసర్ యొక్క వార్షికా నిర్వహణ కాంట్రాక్టు. **పూర్తి చేయు కాలం:** 24 నెలలు, **టెండరు విలువ జీఎస్టీ కలుపుకొని** రూ.4,57,663/. (రూపాయలు నాలుగు లక్షల యాభై ఏడు వేల ఆరు వందల అరవై మూడు మాత్రమే) **బయానా:** రూ.9,200/-,**ముగింపు తేది:** 06.04.2026న 11.00 గం.లకు.

**టెండరు యొక్క పూర్తి వివరాలు చూచుటకు నోటీస్ బోర్డు ప్రదేశం:** చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్-500017.

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కొరకు (టెండరు డాక్యుమెంట్లలో లభిస్తాయి) మరియు టెండరు డాక్యుమెంట్, సవరణ డౌన్‌లోడింగ్ కొరకు మా వెబ్‌సైట్ **http://www.ireps.gov.in** వద్ద చూడగలరు.
**చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్,లాలాగూడ**

**టెండరు ప్రకటన నం. B-SGCN-S AND T-BZA-1-2025-26, తేది: 18-03-2026** PUB/2147

భారత రాష్ట్రపతి తరపున సిగ్నల్ మరియు టెలికాం (నిర్మాణం), దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు దిగువ పనుల కొరకు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో బహిరంగ టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం.:1. టెండరు ప్రకటన నం.: **B-SG-CN-S AND T-BZA-1-2025-26, తేది: 18-03-2026 పని పేరు:** రాజమండ్రి రైల్వే స్టేషన్ల వద్ద పునః అభివృద్ధి కొరకు ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్‌కు సంబంధించి టెలికాం పని. **ప్రకటిత విలువ:** రూ.3,14,11,117.38 పైసలు, **పూర్తి చేయు కాలం:** 06 నెలలు. ముగింపు తేది: 13.04.2026న 15.00 గం.కు.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలు కొరకు వెబ్‌సైట్ **https://ireps.gov.in** కు లాగిన్ కాగలరు.
2. టెండరుదారు టెండరు ముగింపు కాలం అయినట్టి సదరు పదిహేను రోజుల కాలం లోగా మాత్రమే టెండర్ దాఖలు/బిడ్డింగ్ ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను.
3. టెండరుదారు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కొరకు టెండరు దాఖలు/బిడ్డింగ్ ప్రారంభ కాలం తేది వరకు గమనించగలరు.

**డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/నిర్మాణం/విజయవాడ**

**ఇ-టెండరు ప్రకటన నం.N-SG-36-2025-26-ARC-32, తేది:16.03.2026** PUB/2148

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/ నాందేడ్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

**టెండరు నం. మరియు తేది:** N-SG-36-2025-26-ARC-32, తేది: 16.03.2026, **పని పేరు:** రెండు సంవత్సరాల కాలానికి నాందేడ్ డివిజన్‌లో మెసర్స్ జి.జి.ట్రోనిక్స్ మేక్ యొక్క హై అవలబిలిటీ సింగిల్ సెక్షన్ డిజిటల్ యాక్సిల్ కౌంటర్ (HASSDAC) కార్డ్స్ యొక్క ఏఆర్‌సి) వార్షిక మరమ్మతు కాంట్రాక్ట్.

**ప్రాజెక్టు అంచనా వ్యయం:** రూ.55,33,887/-
**బిడ్ సెక్యూరిటీ:** రూ.1,10,700/-,
**పని పూర్తి చేయు కాలం:** 24 నెలలు,
**బిడ్ ముగింపు తేది (బిడ్ గడువు తేది):** 08.04.2026న 15.00 గం.లకు.
**బిడ్ తెరుచు తేది:** 08.04.2026న 15.00 గం.ల తర్వాత,
**ఆఫర్ చెల్లుబాటు:** బిడ్ ముగింపు తేదీ నుండి 60 రోజులు
**టెండరు బుక్‌లెట్ ధర:** రూ.0/–

అన్ని బిడ్డింగ్ భారతీయ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ **www.ireps.gov.in** లో ఉండును. ఈ టెండరుపై మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. తదుపరి వివరాలు **www.ireps.gov.in** లో చూడవచ్చును.
**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/నాందేడ్**
A2714

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.



भारतीय विमानपत्तन आर्थिक विनियामक प्राधिकरण
**ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరి అథారిటీ ఆఫ్ ఇండియా (AERA)**
भारत सरकार/భారత ప్రభుత్వం
3వ అంతస్తు, ఉడాన్ భవన్, సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్ట్, న్యూఢిల్లీ - 110003
ఫోన్: 011-24695044

**బహిరంగ ప్రకటన**

**నవీ ముంబైలోని నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి మొదటి నియంత్రణ వ్యవధి (01.04.2025 - 31.03.2030) కోసం ఏరోనాటికల్ సేవల కొరకు టారిఫ్ నిర్ణయంపై వాటాదారుల సంప్రదింపుల సమావేశం.**

నవీముంబై లోని నవీముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి మొదటి నియంత్రణ వ్యవధి (01.04.2025 – 31.03.2030) కోసం ఏరోనాటికల్ సేవల కొరకు టారిఫ్ నిర్ణయానికి నిర్దేశంతో ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (AERA) 17.03.2026న సంప్రదింపు పత్రం నం.08/2025–26ను జారీచేసింది (ఇది AERA వెబ్‌సైట్ URL **www.aera.gov.in** లో లభిస్తుంది).

AERA చట్టం, 2008లోని సెక్షన్ 13(4)లోని నిబంధనకు అనుగుణంగా, సంప్రదింపు పత్రంలో ఉన్న టారిఫ్ నిర్ణయానికి సంబంధించి వివిధ ప్రతిపాదనలు వాటాదారుల సంప్రదింపుల కోసం ఉంచబడ్డాయి. ఇందుకు సంబంధించి హైబ్రిడ్ విధానం (భౌతిక/ఆన్‌లైన్)లో వాటాదారుల సంప్రదింపుల సమావేశం **02 ఏప్రిల్ 2026** (గురువారం) మ.3.00 గం.కు ఈ దిగువ ప్రదేశం వద్ద జరగనుంది.

**వాటాదారుల రూమ్, 3వ అంతస్తు, ఉడాన్ భవన్, సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్ట్, న్యూఢిల్లీ - 110003**

ప్రయాణీకులు/ ప్రయాణీకుల అసోసియేషన్లు, సాధారణ ప్రజలు, విమానాశ్రయ నిర్వాహకులు, విమానయాన సంస్థలు, పరిశ్రమ అసోసియేషన్లు / సంఘాలు, కార్గో కోసం ఇండిపెండెంట్ సర్వీస్ ప్రొవైడర్స్, గ్రౌండ్ హ్యాండింగ్ ఫ్యూయెల్ ఫామ్ మొదలైన వాటాదారులందరూ సదరు సమావేశంలో పాల్గొని, నవీముంబై అంతర్జాతీయ విమానాశ్రయం యొక్క టారిఫ్ ప్రతిపాదనపై పైన పేర్కొన్న సంప్రదింపు పత్రంపై తమ విలువైన సూచనలు/ వ్యాఖ్యలు/ అభిప్రాయాలను తెలియజేయాలని అభ్యర్థించబడుచున్నారు.

స్వయంగా చేరే పాల్గొనేవారు తమ నిర్ధారణను **పేరు, ఇమెయిల్ చిరునామా, మొబైల్ నంబర్, వాహనం నంబర్‌తో** పాటు AERAకి ఇమెయిల్ ద్వారా (director-ps@aera.gov.in మరియు rajan.gupta1@aera.gov.inకు) **01 ఏప్రిల్ 2026లోగా** పంపవచ్చును. పాల్గొనడానికి ఆన్‌లైన్ లింక్ AERA వెబ్‌సైట్ (https://aera.gov.in)లో "News and Announcements" ట్యాబ్ క్రింద వాటాదారుల సమావేశానికి ముందు షేర్ చేయబడుతుంది.

సం/- సెక్రటరీ, AERA
cbc03112/12/0026/2526



**पीएम श्री केंद्रीय विद्यालय एनपीए शिवरामपल्ली**
एसवीपी एनपीए साइट–ए परिसर, हैदराबाद – 500052 रंगारेड्डी जिला, तेलंगाना
**PM SHRI KENDRIYA VIDYALAYA NPA SHIVARAMPALLY**
**SITE-A CAMPUS OF SVP NPA, HYDERABAD – 500052 RR-DIST, TELANGANA**
**PH: 040-24015535; E-MAIL: kvsvpnpahyd@gmail.com; WEBSITE: https://npasvp.kvs.ac.in/**

**प्रत्यक्ष साक्षात्कार WALK-IN-INTERVIEW**

**Session:** 2026-27 **Venue:** PM SHRI KV NPA SHIVARAMPALLY
**DATE:** 24.03.2026 (Tuesday) **REGISTARTION:** https://samvida-sathi.kvs.gov.in

**सामान्य निर्देश:**
- पंजीकरण 24.03.2026 (मंगलवार) दोपहर 12:00 बजे तक खुले रहेंगे।
- प्रमाणपत्र सत्यापन 24.03.2026 को प्रातः 09:00 बजे से प्रारम्भ होगा।
- केवल पंजीकृत एवं सत्यापित अभ्यर्थियों को ही साक्षात्कार में उपस्थित होना चाहिए।
- शैक्षणिक योग्यता एवं अन्य पात्रता शर्तों के लिए विद्यालय की वेबसाइट देखें।
- साक्षात्कार में उपस्थित होने के लिए किसी भी प्रकार का TA/DA देय नहीं होगा।

**General Instructions:**
- Registrations are open till 12:00 noon of 24.03.2026 (Tuesday).
- Certificate verification starts from 09:00 AM on 24.03.2026.
- Only registered and verified candidates should appear for Interview.
- For Qualification and other eligibility conditions visit the school website.
- No TA/DA is admissible for attending the Interview.

**पदों के लिए पैनल की तैयारी:**
प्राथमिक शिक्षक (PRT); प्रशिक्षित स्नातक शिक्षक (TGT) – सभी विषय; स्नातकोत्तर शिक्षक (PGT) – सभी विषय; खेल प्रशिक्षक; योग प्रशिक्षक; कंप्यूटर एवं कृत्रिम बुद्धिमत्ता प्रशिक्षक (प्राथमिक एवं माध्यमिक); संगीत एवं नृत्य प्रशिक्षक; कला एवं शिल्प प्रशिक्षक; नर्स; परामर्शदाता (Counsellor); विशेष शिक्षक (Special Educator).

**Preparation of Panel for the POSTs:**
Primary Teachers (PRT); Trained Graduate Teachers (TGT) of all subjects; Post Graduate Teachers (PGT) of all subjects; Sports Instructor, Yoga Instructor, Computer & Artificial Intelligence Instructor (Primary & Secondary); Music & Dance Instructor; Art & Craft Instructor; Nurse; Counsellor; Special Educator.

प्राचार्य / PRINCIPAL



ఉగాది వేడుకల్లో పంచాంగం చదువుతున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

## ఇది రైతు నామ సంవత్సరం

- రైతు సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- రైతు బాగుంటేనే సుఖశాంతులతో రాష్ట్రం
- ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం రైతు నామ సంవత్సరమని వ్యాఖ్యానించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతిలో గురువారం భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు, రైతు కూలీలకు పెద్ద పండుగ ఉగాది అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆదుకొని, పంటకు బోనస్ కూడా అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే రైతుల విషయంలో అతి తక్కువ రుణభారం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని కేంద్రం ప్రకటించడం గర్వకారణమని పేర్కొన్నారు. రైతు బాగున్నప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో విరజిల్లుతుందని అభిప్రాయపడ్డారు. అందుకే 25,35,000 మంది రైతు కుటుంబాలకు రూ.20,616కోట్ల మేర రుణమాఫీ చేశామని తెలిపారు. ఇప్పటికే రైతు భరోసా పథకానికి రూ.18వేల కోట్లు ఖర్చు చేశామని, 22 న మరోసారి రైతు భరోసా నిధులను విడుదల చేయబోతున్నామని వెల్లడించారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు రాకుండా, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.



ఆయిల్‌ఫామ్ మొక్కను పరిశీలిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు తుమ్మల, పొన్నం, వాకిటి, ఎంపీ రఘునందన్

## ఈ ఏడాది మరో 5 ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీలు

- నర్మెట్ట రైతు ఉత్సవ మేళాలో మంత్రి తుమ్మల వెల్లడి

సిద్దిపేట/నంగునూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వద్ద 150 స్టాళ్లతో రైతు ఉత్సవ మేళా ప్రారంభమైంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ రఘునందన్‌రావు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఈ మేళాను ప్రారంభించారు. ఈ నెల 22న సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఫ్యాక్టరీని ప్రారంభించనున్నారు. మేళాలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాదిలో మరో 5 ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతంలో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు తన తోటలో ఆయిల్ పామ్ సాగు చూసి రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు చేయాలనే ఆలోచన చేశారని గుర్తుచేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ రావడానికి తుమ్మల నాగేశ్వరరావు స్ఫూర్తి అని తెలిపారు. మేళా సందర్భంగా రైతు సమస్యలపై మంత్రి తుమ్మలకు హరీశ్‌రావు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్రంలో రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల సంఖ్య లక్షల్లో ఉందన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పినట్లుగా పటిష్టమైన పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మేళా వద్ద కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేసుకోవడంతో ఇరువర్గాల నాయకులు నచ్చజెప్పాల్సి వచ్చింది. నినాదాలు చేస్తున్న వారిని వేదిక వద్ద నుంచి పోలీసులు తీసుకెళ్లారు. పార్టీలకతీతంగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం జరుగుతుందని, ఎవరూ రాజకీయాలు చేయవద్దని మంత్రులు సూచించడంతో కార్యకర్తలు శాంతించారు.

## వినియోగదారుల వివాద పరిష్కార ర్యాంకుల్లో తెలంగాణకు చివరిస్థానం: ఐజేఆర్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పెద్ద రాష్ట్రాల్లో వినియోగదారుల వివాద పరిష్కార వ్యవస్థ పనితీరులో తెలంగాణ చివరి స్థానంలో ఉందని ఇండియా జస్టిస్ పోర్ట్ (ఐజెఆర్) వినియోగదారుల న్యాయ నివేదిక-2026 పేర్కొంది.. దేశంలో మొట్టమొదటిసారిగా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ల పనితీరు, సామర్థ్యాలకు సంబంధించి 19 పెద్ద, మధ్య తరహా (కోటి కంటే ఎక్కువ జనాభాతో) రాష్ట్రాల్లో పరిశీలన జరిపి నివేదిక రూపొందించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడం విశేషం. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ నిలిచాయి. తెలంగాణ రాష్ట్ర కమిషన్‌లో కేసును పరిష్కరించడానికి దాదాపు వెయ్యి రోజులు పడుతోంది.. ఇది నిర్దేశించిన సమయం కంటే దాదాపు 6 రెట్లు ఎక్కువ. దీంతో తెలంగాణ ర్యాంకు గణనీయంగా పడిపోయి చిట్టచివరిస్థానంలో నిలిచింది.

## ఏబీఎన్ పూర్ణ హఠాన్మరణం

- అనారోగ్యంతో నాలుగు రోజులుగా చికిత్స
- పరిస్థితి విషమించడంతో మృతి
- ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల సంతాపం

విజయవాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): 'ఏబీఎన్ పూర్ణ'గా సుపరిచితుడైన 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' ఏపీ బ్యూరో సీనియర్ రిపోర్టర్ కేసనేని పూర్ణచంద్రరావు(54) గురువారం కన్నుమూశారు. కిడ్నీ సంబంధిత సమస్యలతో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నాలుగు రోజులుగా చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు సాత్విక, కార్తీక ఉన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం రేవేంద్రపాడు గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన రామచంద్రరావు, విజయలక్ష్మి దంపతులకు 1972లో పూర్ణచంద్రరావు జన్మించారు. 1995లో ఈటీవీలో కెమెరామన్‌గా చేరి 12 ఏళ్లపాటు పనిచేశారు. తరువాత రెండేళ్ళ ఎన్‌టీవీ రిపోర్టర్‌గా పనిచేశారు. 2009 నుంచి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో పనిచేస్తున్నారు. పరిశోధనాత్మక జర్నలిజంపై ఎంతో మక్కువ చూపే పూర్ణ... ఎన్నో సంచలనాత్మక కథనాలను అందించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాలు, పాలకుల దృష్టికి తేవడంలో రాజీలేని ధోరణిని అవలంబించేవారు. కాగా, పూర్ణచంద్రరావు మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే అనారోగ్యంతో దూరం కావడం కలచివేస్తోందన్నారు. 'క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపైనా, వర్తమాన రాజకీయలపైనా అవగాహన కలిగిన రిపోర్టర్ పూర్ణచంద్రరావు మరణించారని తెలిసి చింతిస్తున్నా' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'నాకు అత్యంత ఆత్మీయులు, ఏబీఎన్ పూర్ణ మృతి చాలా బాధాకరం' అని మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. పూర్ణ మృతిపై సమాచార మంత్రి పార్థసారథి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పలువురు నేతలు, పాత్రికేయులు సంతాపం ప్రకటించారు.



వరదల్లో రిపోర్టింగ్ చేస్తున్న పూర్ణచంద్రరావు (ఫైల్)

# సినీ హబ్‌గా హైదరాబాద్!

(మొదటిపేజీ తరువాయి)

కలిసి చార్మినార్‌కు ఉన్న 4 మినార్‌ల లాగా కృషి చేశారని చెప్పారు. సినీ కార్మికుల కోసం నటుడు ప్రభాకర్‌రెడ్డి తన సొంత స్థలాన్ని దానం చేసి, కార్మిక బంధుగా నిలిచారని కొనియాడారు. సినీ పరిశ్రమకు ఏ సమస్య వచ్చినా పెద్దన్నగా నిలబడి, సమస్యలను పరిష్కరించి శాశ్వతంగా సినీ పరిశ్రమ హైదరాబాద్‌లో నిలదొక్కుకోవడానికి, గుర్తింపు తేవడానికి పెద్దలంతా కృషి చేశారని చెప్పారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సినీ హబ్‌గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. కాగా, ఐటీ, ఫార్మా పరిశ్రమల మాదిరిగానే సినీ పరిశ్రమను కూడా గుర్తించామని.. అందుకే ఆగిపోయిన నంది అవార్డులను గద్దర్ పేరుతో తిరిగి ప్రవేశపెట్టామని రేవంత్ చెప్పారు. కొత్త ప్రతిభను గుర్తించడం, ప్రోత్సహించడం రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాన బాధ్యత అని పేర్కొన్నారు. జపాన్, కొరియా సినిమాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయంటే అది అక్కడి ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, విధానాల వల్లేనని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో నలుపు-తెలుపుతో మొదలైన సినీ ప్రస్థానం నేడు డాల్బీ థియేటర్లను ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగిందని చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ తమ స్టూడియోను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిందన్నారు. హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ కూడా వచ్చినట్లేనని పునరుద్ఘాటించారు. ఎవరైనా సినిమా నిర్మించాలనుకునే వారు కథతో వచ్చి రీల్స్‌తో వెళ్లేలా హైదరాబాద్‌లో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సినీ రంగానికి ఉపయోగపడే పరిశ్రమలను ఏకగవాక్ష విధానం ద్వారా తమ ప్రభుత్వం అనుమతులిస్తోందన్నారు.



గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్, మంత్రి జూపల్లి, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు సినీ నటులు మాధురీ దీక్షిత్, రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా

### గద్దర్ అంటేనే ఒక చైతన్యం..

"గద్దర్ అంటే ఒక చైతన్యం, ఒక స్ఫూర్తి. తన పాటతో వేలాది మందిలో చైతన్యం తీసుకొచ్చిన ఆయన పేరుతో ఈ అవార్డులు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది" అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. సినిమా అనేది ప్రభావవంతమైన, శక్తిమంతమైన ఆయుధమని అన్నారు. అలాగే సినిమా అనేది రెండువైపులా పదును ఉన్న కత్తిలాంటిదని, దీన్ని సమాజాన్ని చైతన్యపరిచేందుకు ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. గద్దర్ స్ఫూర్తితో సామాజిక రుగ్మతలను, సమస్యలను రూపుమాపేందుకు సినిమాల ద్వారా సందేశం అందించాలని కోరారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలను మన సైన్యం ఆపరేషన్ సిందూర్‌తో అణచివేసిందని.. ఆ సమయంలోనే తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించామని గుర్తుచేశారు. ఏ ప్రాంతంలో ఏం జరిగినా తెలంగాణలో మాత్రం కార్యక్రమాలు సజావుగా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణను మించిన సురక్షితమైన ప్రాంతం మరొకటి ఉండదని చెప్పారు. అందుకే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు ఇస్తున్నామన్నారు.

### డ్రగ్స్‌పై యుద్ధంలో ముందుండాలి..

"డ్రగ్స్ మహమ్మారి వల్ల ఒక తరం నాశనమైపోతోంది. దీనికి వ్యతిరేకంగా పోరాడడంలో సినీ పరిశ్రమ ముందుండాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. థియేటర్లలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహనా వీడియోలు ప్రదర్శించాలని నిర్మాతలకు సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని స్పష్టం చేశారు.

### సినీ పరిశ్రమకు హామీలు..

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే 'విజన్ 2047'లో సినీ రంగాన్ని ప్రత్యేక అధ్యాయంగా చేరుస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సినీ పరిశ్రమకు పలు హామీలు ఇచ్చారు.

- షూటింగ్ అనుమతుల కోసం వేగవంతమైన ఏకగవాక్ష విధానం అమలు.
- చిన్న సినిమాలకు థియేటర్ల లభ్యత, పన్ను మినహాయింపులు, పరిశ్రమల తరహాలో విద్యుత్తు రాయితీలు.
- సినీ కార్మికులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్పష్టమైన విధానం.
- హైదరాబాద్ చుట్టుపక్కల అంతర్జాతీయ స్థాయి స్టూడియోల ఏర్పాటుకు భూముల కేటాయింపు.

## తెలంగాణ ఆత్మను ప్రపంచానికి వ్యాప్తి చేసిన వ్యక్తి గద్దర్: భట్టి



నటి భూమికకు అవార్డు ప్రదానం చేస్తున్న భట్టి

గద్దర్ ఒక వ్యక్తిగా కాకుండా వ్యవస్థగా తన ఆట, పాటలతో తెలంగాణ ఆత్మను ప్రపంచానికి తెలియజెప్పారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అందుకే ఆయన పేరుమీదుగా తమ ప్రభుత్వం ఫిలిం అవార్డులను అందిస్తోందని తెలిపారు. తెలుగు సినిమా కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా.. దేశానికే తలమానికంగా ఎదగాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఈ అవార్డులను ప్రవేశపెట్టారని కొనియాడారు. తెలుగు సినిమాలు కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దక్షిణ భారత రాష్ట్రాలకు, బాలివుడ్‌తో పాటు, హాలీవుడ్ స్థాయికి ఎదిగిన తీరును మనమంతా చూస్తున్నామని ప్రశంసించారు. సినిమా అంటే కేవలం కళల కోసమే కాదు, ప్రజల కోసం అని చాటిన అనేక తెలుగు సినిమాలను చూశామన్నారు. సత్యహరిశ్చంద్ర, కన్యాశుల్కం, రోజులు మారాయి, మరో ప్రపంచం, కాలం మారింది, దానవీర శూరకర్ణ లాంటి అనేక చిత్రాలు సందేశాన్నివ్వడమేకాక, సమాజ మార్పు కోసం కృషి చేశాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సందేశాత్మక చిత్రాలు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, పారదర్శకంగా విజేతలను ఎంపిక చేసిన చైర్మన్ దిల్‌రాజుకు మంత్రి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు.

## హైకోర్టులోనే తేల్చుకోండి

- ప్రభుత్వ సిఫార్సులపై స్పందించకుంటే కోర్టుకెళ్లండి
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు
- పిటిషన్ల గందరగోళంపై ధర్మాసనం అసంతృప్తి
- తదుపరి విచారణ ఏప్రిల్ 22కు వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాల పంచాయితీపై సర్వోన్నత న్యాయస్థానం కీలక సూచన చేసింది. మంత్రిమండలి సిఫారసు చేసిన పేర్లను గవర్నర్ ఆమోదించకుండా పెండింగ్‌లో పెడితే, దానిపై హైకోర్టును ఆశ్రయించడమే సరైన మార్గమని స్పష్టం చేసింది. ఈ విషయంలో హైకోర్టు అనే పరిష్కారం అందుబాటులో ఉందని సూచించింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందని 2024 ఆగస్టు 4న దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని వారు సవాల్ చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత కాంగ్రెస్ సర్కార్ ప్రతిపాదనలతో ఎమ్మెల్సీలుగా నియమితులైన కోదండరాం, అమీర్ అలీఖాన్ ల ఎమ్మెల్సీ నియామకాన్ని గతేడాది ఆగస్టు 13న సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై విచారణ కొనసాగిస్తోంది. ఈక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ తరపున సీనియర్ న్యాయవాది సంజయ్ ఎం నూలీ ఇంప్లీడ్ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశారు. ఈ అన్ని పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. అలీఖాన్ తరపు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎమ్మెల్సీగా అమీర్ ఖాన్ ప్రమాణం చేశారని, ఆయనను ఎమ్మెల్సీగా కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. దీనిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం కోదండరాం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గతంలో రాష్ట్ర మంత్రివర్గం చేసిన సిఫారసులను గవర్నర్ ఆమోదించారని, కోదండరాం ఎమ్మెల్సీగా నియమితులయ్యారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆ ఎమ్మెల్సీ నియామకం రద్దు అయ్యిందని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి కోదండరాం పేరును గవర్నర్‌కు సిఫారసు చేసిందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో జస్టిస్ విక్రమ్ నాథ్ స్పందిస్తూ హైకోర్టుకు వెళ్లొచ్చు కదాని ప్రశ్నించారు. మరోసారి అలీఖాన్ తరపు న్యాయవాది కలుగజేసుకుని తమకు హైకోర్టుకు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

### ధర్మాసనం అసహనం

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకానికి సంబంధించిన అన్ని పిటిషన్లను కలపడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించిన అంశమే, అయినప్పటికీ ఒక్కొక్కరిదీ ఒక్కో వివాదం కదా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అన్ని కలపడంతో గందరగోళ పరిస్థితి నెలకొందని అభిప్రాయపడింది. తదుపరి విచారణ ఏప్రిల్ 22కు వాయిదా వేసింది. ఆ రోజు ఈ కేసును ప్రియారిటీగా భావించి తుది విచారణ చేపడతామని ధర్మసనం స్పష్టం చేసింది.

## నక్సలైట్లపై పోరాడినా ప్రమోషన్ ఇవ్వరా?

- కీలక పాత్ర ఆయనదేనని చెప్పి విస్మరిస్తారా
- తెలంగాణ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలకు తెగించి నక్సలైట్ల దాడిని తిప్పికొట్టిన ఒక కానిస్టేబుల్‌కు పదోన్నతి ఇవ్వకుండా ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పుతున్నందుకు తెలంగాణ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆయనతోపాటు విధుల్లో ఉన్న ఇతర సిబ్బందికి పదోన్నతి కల్పించి, అతనికి మాత్రం నిరాకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నక్సలైట్లపై పోరాడినా హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ ఇవ్వరా? అని ప్రశ్నించింది. పి. శ్రీనివాస్ అనే కానిస్టేబుల్‌కు సత్వరమే పదోన్నతి కల్పించాలని తేల్చిచెప్పింది. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ గత డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వీ. అంజారియాలతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. కానిస్టేబుల్ శ్రీనివాస్ ఎక్కువ రౌండ్లు కాల్పులు జరిపారని, నక్సలైట్ల దాడిని తిప్పికొట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారని ప్రభుత్వమే అంగీకరిస్తోందని గుర్తు చేసింది. అలాంటప్పుడు అతని పాత్రను తక్కువ చేసి చూపి ప్రమోషన్ నిరాకరించడం అన్యాయమని పేర్కొంది. సామూహికంగా పోరాడినప్పుడు ఒకరికి పదోన్నతి కల్పించి.. మరొకరికి నిరాకరించడం వివక్షే అవుతుందని పేర్కొంది. ఈ పోరాటంలో పాల్గొన్న వెంకట్ రెడ్డి అనే కానిస్టేబుల్‌కు పదోన్నతి కల్పించిన తేదీ నుంచే శీనివాస్‌కు కూడా హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించాలని ఆదేశించింది. 1999 జనవరి 30న బొమ్మల రామారం పోలీస్ స్టేషన్‌పై ముగ్గురు నక్సలైట్లు దాడి చేశారు. అప్పుడు విధుల్లో ఉన్న పి. శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ తన సహచరులతో కలిసి ఆ దాడిని ప్రతిఘటించారు. ఆ ఘటనలో పాల్గొన్న ఇతర పోలీసులకు ప్రభుత్వం సత్వర పదోన్నతి కల్పించింది. శ్రీనివాస్‌కు మాత్రం ప్రమోషన్ ఇవ్వలేదు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించారు.

# మండలి విప్‌లుగా అద్దంకి, బల్మూరి

### శాసనసభ విప్‌లుగా విజయరమణారావు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వేముల వీరేశం

- రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శాసన మండలి విప్‌లుగా కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, వెంకట్ నర్సింగరావు బల్మూరిలను.. శాసనసభ విప్‌లుగా ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వేముల వీరేశంలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. మండలికి ప్రస్తుతం చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయనకు అనుబంధంగా అద్దంకి, బల్మూరిలను విప్‌లుగా సర్కారు నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే శాసనసభ విప్‌లుగా పార్టీ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామచంద్రనాయక్‌లను నియమితులయ్యారు. అయితే ఈ నలుగురిలో అడ్లూరిని మంత్రివర్గంలోకి తీసుకోవడంతో ప్రస్తుతం ముగ్గురే విప్‌లుగా కొనసాగుతున్నారు. తాజాగా ముగ్గురి నియామకంతో శాసనసభ విప్‌ల సంఖ్య ఆరుకు చేరింది.

### వెలమలకు 2 పోస్టులు..

కొత్త నియామకాలతో శాసనసభ, మండలి కలిపి విప్‌ల సంఖ్య 8కి చేరుకుంది. ఈ ఎనిమిది పదవుల్లో రెడ్డి, లంబాడా, మాదిగ, మాల సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. బీసీ వర్గం నుంచి ఇద్దరు.. ఆది శ్రీనివాస్ (మున్నూరు కాపు), బీర్ల అయిలయ్య (కురుమ) ఉన్నారు. వెలమ సామాజిక వర్గం నుంచి బల్మూరి, విజయరమణారావు ఉన్నారు. ఈ ఇద్దరూ తాజాగా నియమితులైనవారే.. రెడ్డి సామాజిక వర్గం నుంచి విప్‌గా యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఒక్కరే ఉన్నా.. మండలి చీఫ్ విప్ పదవిలో ఇదే సామాజిక వర్గానికి చెందిన పట్నం మహేందర్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఇక మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్లూరిని మంత్రి పదవిలోకి తీసుకున్న నేపథ్యంలో ఆయన స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన వేముల వీరేశంను విప్‌గా ఎంపిక చేశారు. ఎస్టీ లంబాడా సామాజిక వర్గం నుంచి శాసనసభ విప్‌గా రామచంద్రనాయక్ కొనసాగుతుండగా.. మాల సామాజిక వర్గం నుంచి మండలి విప్‌గా అద్దంకిని ఎంపిక చేశారు.





### పెండింగ్‌లోనే ఆ రెండు పోస్టులు..

పార్టీ ఎమ్మెల్యేలు మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై ఆశలు పెట్టుకుని ఉండటంతో చాలాకాలంగా శాసనసభ చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులు పెండింగ్‌లోనే కొనసాగుతున్నాయి. వాస్తవానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలకు చీఫ్ విప్ పోస్టును పార్టీ నాయకత్వం గతంలోనే ప్రతిపాదించింది. అయితే మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న వారిద్దరూ ఆ పదవిని తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు. అలాగే వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లను మంత్రివర్గంలోకి తీసుకున్నప్పుడే విప్‌గా ఉన్న రామచంద్రనాయక్‌ను డిప్యూటీ స్పీకర్ అభ్యర్థిగా ప్రతిపాదనను కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదించింది. అయితే మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరిగితే లంబాడా సామాజిక వర్గం కోటాలో తనకు ఛాన్స్ దక్కుతుందన్న భావనలో ఆయన ఉన్నారు. ప్యానెల్ స్పీకర్‌గా సభను ఎమ్మెల్యే బాలూనాయక్ బాగా హ్యాండిల్ చేస్తున్నారంటూ ఇటీవల సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కితాబును ఇవ్వడంతో డిప్యూటీ స్పీకర్‌గా ఆయన్ను తీసుకుంటారన్న ప్రచారం జరుగుతోంది. అయితే మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో లంబాడా సామాజిక వర్గం కోటాలో సీనియర్ ఎమ్మెల్యేగా బాలూనాయక్ సైతం పోటీ పడుతున్నారు. మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణతో శాసనసభ చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులు ముడిపడి ఉండటంతో ఇవి మరికొంత కాలం పెండింగ్‌లోనే కొనసాగే అవకాశమున్నట్లు చెబుతున్నారు. ఇక ఈ నెలాఖరు కల్లా వివిధ కులాల అభివృద్ధి కార్పొరేషన్లు, ఇతర కీలకమైన కార్పొరేషన్లకూ చైర్మన్ల నియామకమూ జరగనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## 14 డీసీసీలను ప్రకటించిన టీపీసీసీ చీఫ్

రాష్ట్రవ్యాప్తంగా 36 జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లకు 14 కమిటీలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గురువారం ప్రకటించారు. రాష్ట్రంలోని డీసీసీలకు ఇప్పటికే అధిష్ఠానం అధ్యక్షులను నియమించిన సంగతి తెలిసిందే. గత కొద్దిరోజులుగా డీసీసీ అధ్యక్షులు, స్థానిక నేతలు.. మండల, జిల్లా కమిటీల కార్యవర్గాల కూర్పుపై కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు పూర్తయిన 14 డీసీసీలను ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్ గౌడ్ ప్రకటించారు. ఆయా డీసీసీల కార్యవర్గ సభ్యులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రకటించిన 14 డీసీసీలు ఇవే:** ఖైరతాబాద్, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, మెదక్, నిర్మల్, ఖమ్మం, కామారెడ్డి, మంచిర్యాల, ఆదిలాబాద్, వనపర్తి, ఆసిఫాబాద్, యాదాద్రి భువనగిరి, నిజామాబాద్ నగర కమిటీ..

# నేడే కొత్త పద్దు

## అసెంబ్లీలో 2026-27 బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

- 3.35 లక్షల కోట్లకు పైగా పద్దు ఉండే చాన్స్
- ప్రస్తుత బడ్జెట్ కంటే 10% పెరుగుదల!

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీ ముందు ఉంచనుంది. మధ్యాహ్నం 12 గంటలకు శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన మండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలను ప్రతిబింబించేలా ఈసారి బడ్జెట్‌కు రూపకల్పన చేసినట్లు ప్రభుత్వం వర్గాలు తెలిపాయి. ఈసారి బడ్జెట్ రూ.3.35 లక్షల కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూ.3,04,965 కోట్లు కాగా... దీనికి మరో 10 శాతం మేర పెంచి బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిసింది. ఈ బడ్జెట్‌ను ఆమోదించడానికి రాష్ట్ర క్యాబినెట్ శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశమవుతుంది. రేవతి నక్షత్రం, అభిజిత్ లగ్నం ముహూర్తాన మధ్యాహ్నం 12 గంటలకు ఉభయసభల్లో బడ్జెట్ ప్రసంగం ఒకేసారి ప్రారంభిస్తారు.

### కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు పెద్ద పీట వేయనున్నట్లు తెలిసింది. జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది. ప్రస్తుతం పాఠశాల వరకే ఈ పథకం అమలవుతోంది. దీనిని కాలేజీ విద్యార్థులకు కూడా అమలు చేస్తామని ఇదివరకే ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాలల్లో 'ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్'ను కూడా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించనున్నట్లు తెలిసింది. ఒకటో తరగతి నుంచి జూనియర్ కాలేజీ వరకు దీనిని అమలు చేయనున్నట్లు సమాచారం. ఈ పథకం కింద దాదాపు 21 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారని భావిస్తున్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురానుంది. గిగ్ వర్కర్ల సంక్షేమానికి 'వెల్ఫేర్ ఫండ్'ను ప్రకటించనుందని సమాచారం. దేవాదాయ శాఖ పరిధిలోని వృద్ధ అర్చకులకు పెన్షన్లను కూడా బడ్జెట్‌లో ప్రతిపాదించనున్నట్లు తెలిసింది. పారా అథ్లెట్లకు ఇళ్ల స్థలాలు, ఇతర ప్రోత్సాహకాల కోసం నిధుల కేటాయింపు ఉంటుందని భావిస్తున్నారు. కల్యాణ లక్ష్మి పథకం కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.1,00,116లతో పాటు తులం బంగారం ఇస్తామని 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. దీనిపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. కానీ... బంగారం ధర విపరీతంగా పెరిగిపోవటంతో.. తులం బంగారానికి బదులు కల్యాణ లక్ష్మి కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.1,00,116లకు మరో రూ.50 వేలు కలిపి రూ.1,50,116 ఇవ్వాలని బడ్జెట్‌లో ప్రతిపాదించనున్నట్లు తెలిసింది.

### ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌కు నిధులు..

ఇటీవలే ప్రభుత్వం ఉద్యోగులకు ఆరోగ్య పథకాన్ని(ఈహెచ్ఎస్) సర్కారు ప్రకటించింది. ఉద్యోగుల మూల వేతనాల నుంచి 1.5 శాతం చొప్పున ప్రతి నెలా మినహాయించి, ఈహెచ్ఎస్ కార్పస్ ఫండ్‌లో కలుపుతారు. ఇలా మొత్తం రూ.528 కోట్లు జమ కానున్నాయి. ఇంతే మొత్తం రూ.528 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద బడ్జెట్‌లో కేటాయించే అవకాశాలున్నాయి. రైతు భరోసా, రైతు బీమా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, సన్నాలకు రూ.500 చొప్పున బోనస్, సబ్సిడీ బియ్యం వంటి పథకాలకు తగినన్ని నిధులు కేటాయించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## నాసిక్‌లో కీచక జ్యోతిషుడు!

- వ్యక్తిగత సమస్యలతో వచ్చిన 58 మంది మహిళలకు మత్తుమందిచ్చి అత్యాచారం

ముంబై, మార్చి 19: ఆయనో ప్రముఖ జ్యోతిషుడు! దైవిక శక్తులున్నాయనే విశ్వాసంతో బడా రాజకీయనేతలు, వ్యాపారులు ఆయన ప్రాపకం కోసం క్యూ కడుతున్నారు. ఆ జ్యోతిష్యుడేమో తన వద్దకొచ్చే మహిళలను జ్యోతిష్యం పేరుతో 'భవిష్యత్తు భీకరంగా ఉంటుంది' అని ఏవేవో దొంగ మాటలు చెప్పి పూజల పేరుతో. మత్తుమందు ఇచ్చి.. వారిపై అత్యాచారానికి ఒడిగడతాడు! ఆ దృశ్యాలను రహస్యంగా చిత్రీకరిస్తాడు. ఆ వీడియోలతో బాధితులను బ్లాక్‌మెయిల్ చేసి పదే పదే లైంగికదాడికి పాల్పడతాడు. ఇలా 58 మంది మహిళలపై అతడు అత్యాచారం జరిపాడు. మహారాష్ట్రలోని నాసిక్‌లో వెలుగుచూసిన ఈ ఘటన అక్కడ ఇప్పుడు రాజకీయంగానూ దుమారం రేపుతోంది. కామ పిశాచి అయిన ఆ జ్యోతిష్యుడు 67 ఏళ్ల అశోక్ ఖరత్. ఓ 35 ఏళ్ల మహిళ ఖరత్ ఆగడాలను భరించలేక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులకు ఖరత్ కార్యాలయంపై దాడి చేసి, 58 మంది మహిళలకు సంబంధించిన అశ్లీల వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను, కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు ఖరత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై విచారణ కోసం ఐపీఎస్ ఆఫీసర్ తేజస్విని నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది.

## ఆ కంటి మందుకు అనుమతుల్లేవు

- తక్షణమే తయారీ అనుమతులు రద్దు చేయండి
- రాష్ట్రాల డ్రగ్ కంట్రోల్ అధికారులకు డీసీజీఐ ఆదేశాలు

న్యూఢిల్లీ, మార్చి 19: అన్ని ప్రముఖ ఫార్మా కంపెనీలు తమ స్వంత బ్రాండింగ్‌తో మార్కెట్లోకి దించిన కంటి చుక్కల మందు... 'సోడియం హైల్యూరోనేట్ ఐ డ్రాప్స్ 0.3% డబ్ల్యూ/వీ' ఫార్మా దుకాణాల్లో, ఆన్‌లైన్‌లో విరివిగా అందుబాటులో ఉంది. డ్రై ఐస్.. కళ్లు పొడిబారే సమస్య నివారణకు దీనిని వాడుతున్నారు. అయితే ఆ మందు తయారీ, అమ్మకాలకు ఎలాంటి అనుమతి లేదని డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) బుధవారం పేర్కొంది. ఆ మందు తయారీకి ఇచ్చిన అన్ని అనుమతులనూ తక్షణమే రద్దు చేయాలని అన్ని రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసింది. 'న్యూ డ్రగ్' తరగతికి చెందిన ఈ మందు తయారీకి, అమ్మకాలకు మన దేశంలో ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేసింది. రాష్ట్రాల్లోని డ్రగ్స్ కంట్రోలర్లు తక్షణమే ఈ విషయాన్ని తయారీదారులకు తెలియచేసి, తీసుకున్న చర్యలను వీలైనంత త్వరగా డీసీజీఐ కార్యాలయానికి తెలియచేయాలని పేర్కొంది.

## డీజీపీ రామచంద్రరావ్‌కు ఎదురుదెబ్బ!

- అశ్లీల వీడియోలు వాస్తవమైనవేనని సిట్ నివేదిక

బెంగళూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక డీజీపీ రామచంద్రరావ్‌కు సంబంధించి వైరల్ అయిన వీడియోలు వాస్తవమైనవేనని సిట్ తేల్చింది. డీజీపీ హోదా కలిగిన రామచంద్రరావ్ దీంతో మరోసారి అడ్డంగా ఇరుక్కుపోయారు. రెండు నెలల క్రితం పోలీసు శాఖ చాంబర్‌లోనే ఇద్దరు మహిళలతో డీజీపీ అశ్లీలంగా ప్రవర్తించిన వీడియోలు వైరల్ అయిన విషయం తెలిసిందే. సీఎం సిద్దరామయ్య ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే రామచంద్రరావ్‌ను సస్పెండ్ చేస్తూ సమగ్ర దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేశారు. ఏడీజీపీ హితేంద్ర నేతృత్వంలో ఏర్పడిన సిట్‌లో ఐపీఎస్ అధికారులు చేతన్ సింగ్ రాథోడ్, రిష్యంత్ సిబి, కళా కృష్ణస్వామి ఉన్నారు. వీడియోలు వైరల్ అయిన తర్వాత అవి తనకు సంబంధించినవి కావనీ, డీప్‌ఫేక్, ఏఐ ఆధారితంగా రూపొందించినవంటూ రామచంద్రరావ్ ఆరోపించారు. దీంతో సిట్ సీరియస్‌గా పరిగణించి దర్యాప్తు సాగించింది. వైరల్ అయిన వీడియోలు ఏఐ ఆధారితంగానో, డీప్‌ఫేక్ ద్వారానో రూపొందినవి కావనీ, అన్నీ వాస్తవమైనవే అంటూ నివేదికలో తేల్చింది. ఈ మేరకు సుమారు 100 పేజీలతో రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం నివేదిక సమర్పించింది.

## ట్రయల్ కోర్టు జడ్జి పరిధి దాటారా? లేదా?

(మొదటిపేజీ తరువాయి)

కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టును ఆశ్రయించింది. సీబీఐ కేసుతో ఈడీకి సంబంధం లేనప్పటికీ, ఆ కేసులో పార్టీ కూడా కానప్పటికీ న్యాయమూర్తి తమపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేయడంపై ఈడీ అభ్యంతరం వ్యక్తం చేసింది. న్యాయమూర్తి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని హైకోర్టుకు విన్నవించింది. ఆ పిటిషన్ గురువారం జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈడీ తరఫున ఏఎస్జీ ఎస్వీ రాజు, ప్రత్యేక న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపిస్తూ.. రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి ఈడీ దర్యాప్తుపై చేసిన వ్యాఖ్యలు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని చెప్పారు. "పీఎంఎల్ఏ కింద ఈడీ స్వతంత్రంగా చేపట్టిన దర్యాప్తుకు సంబంధించిన పేరాలను తొలగించాలి. ఎందుకంటే అవి 'న్యాయ పరిధిని అతిక్రమించడం' కిందకు వస్తాయి. ఈడీ వద్ద ఉన్న సాక్ష్యాధారాలను పరిశీలించకుండానే, కనీసం తమ వాదనలు వినే అవకాశం కూడా ఇవ్వకుండానే ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఆ వ్యాఖ్యలు ఎలా చేస్తారు? కేవలం సీబీఐ కేసులో అభియోగాలు మోపడానికి తగిన ఆధారాలు ఉన్నాయా? లేదా? అన్నది మాత్రమే ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకోవాలి. విడిగా జరుగుతున్న పీఎంఎల్ఏ దర్యాప్తుపై వ్యాఖ్యానించాల్సిన అవసరం న్యాయమూర్తికి ఏమాత్రం లేదు" అని న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ఫండింగ్ లాంటి అంశాలపై చేసిన వ్యాఖ్యలు ఈడీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, కేవలం ఊహలతో దర్యాప్తు సంస్థలపై చేసిన ఇటువంటి 'విపరీతమైన వ్యాఖ్యల' వల్ల వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రయల్ కోర్టు వ్యాఖ్యలను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ట్రయల్ కోర్టు జడ్జి తన పరిధి దాటారా? లేదా? అన్నది తేల్చాల్సి ఉందని జస్టిస్ స్వర్ణకాంత శర్మ అన్నారు. "నాకు అర్థం కావడం లేదు. విచారణాధికారి తన పరిధిని మించి వ్యవహరించారని ఈడీ చెబుతోంది. ఆ జడ్జి తన పరిమితులు దాటారో? లేదో? నేను తేల్చాల్సి ఉంది" అని జస్టిస్ స్వర్ణకాంత శర్మ వ్యాఖ్యానించారు. కాగా, పిటిషన్‌పై స్పందించేందుకు తమకు వారం సమయం కావాలని నిందితుల తరఫు న్యాయవాదులు కోరగా, శర్మ అసహనం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్, కవిత సహా నిందితులందరికీ నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 2కు వాయిదా వేశారు. మరోసారి గడువు కోరవద్దని, 2లోపు సమాధానాలు సిద్ధంగా ఉండాలని న్యాయమూర్తి తేల్చి చెప్పారు.

# పడమటి పరిణయ రాగం

(మొదటిపేజీ తరువాయి)



### అనుబంధ రంగాల విస్తరణ..

వివాహ వ్యాపారంలోని అనుబంధ రంగాలు కూడా అమెరికాలో విస్తరిస్తున్నాయి. వేదికల డెకరేషన్, మేకప్ వంటివి భారతీయ, తెలుగు మహిళలకు కొత్త ఉపాధి అవకాశాలుగా మారాయి. ఇప్పటికే హోటళ్లు, ఆతిథ్య రంగంలో అమెరికాలోని తెలుగువారి ముద్ర స్పష్టంగా కనిపిస్తుంటుంది. ఇప్పుడు పెళ్లిళ్ల కేటరింగ్ కూడా ఒక ప్రధాన వ్యాపారంగా మారింది.

అనుసరిస్తున్న విధానాలే ఇందుకు కారణం. పెళ్లి కోసం స్వదేశానికి వెళితే.. వీసా స్టాంపింగ్‌కు స్లాట్లు దొరకని పరిస్థితి! స్లాట్లు దొరికి, తిరిగి రావడం ఎప్పటికి కుదురుతుందో? అసలు రాగలమో లేదో? వచ్చినా అప్పటిదాకా ఉద్యోగం ఉంటుందో? ఊడుతుందో? అనే భయంతో చాలా మంది ఇప్పుడు యూఎస్ఏలోనే పరిమితమైన హంగులతో పెళ్లి తంతు ముగించేస్తున్నారు. జీవితభాగస్వామిని ఎంచుకునే ప్రక్రియకూడా అందుకు అనుగుణంగానే సాగుతోంది. గతంలోలాగా ఇండియాలో సంబంధాలను వెతుక్కునే బదులు.. ఇప్పుడు యూఎస్‌లో ఉంటున్న వారికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారు. అలా కాదని ఎవరైనా ఇండియాకి వెళ్లి, పెళ్లిచేసుకుని వద్దామనుకుంటే.. వీసా స్టాంపింగ్ స్లాట్లు 2027దాకా లభించని పరిస్థితి. వెళ్తే, అప్పటిదాకా స్వదేశంలో గడపడం తప్ప గత్యంతరం ఉండదు. ఇప్పుడున్న వాతావరణంలో రెండు వారాలకు మించి సెలవు పెడితే ఉద్యోగమే పోయే పరిస్థితి. కొన్ని కంపెనీలు పెళ్లికి మూడు నెలల సెలవు ఇస్తున్నప్పటికీ వీసా స్లాట్‌ల భయంతో చాలామంది అసలు ఆ ఆలోచనే చేయట్లేదు. ఫలితంగా అమెరికాలో భారతీయ పెళ్లి బాజాలు మోగడం బాగా పెరిగింది. పెళ్లి చాలా తక్కువ ఖర్చుతో అయిపోతుండడం భారతీయ కుటుంబాలకు లాభసాటిగా కూడా మారుతోంది. ఇండియాలో పెళ్లి ఆర్భాటాలకు పెట్టే ఖర్చులో సగం కన్నా తక్కువలోనే అమెరికాలో పెళ్లి అయిపోతున్నదని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఫంక్షన్‌హాళ్ల వ్యాపారంలోకి..

సంక్షోభాలను వ్యాపార అవకాశాలుగా మార్చుకోవడంలో తెలుగువాళ్లకి పోటీ వచ్చేవారే లేరు! అమెరికాలో ఇప్పుడు అదే జరుగుతోంది. యూఎస్‌లో భారతీయ వివాహాల సంఖ్య పెరుగుతుండడంతో అనేక నగరాల్లో.. ప్రధానంగా తెలుగువారి ప్రాబల్యం అధికంగా ఉండే నగరాల్లో మనోళ్లు బాంక్వెట్ హాల్స్, కన్వెన్షన్ హాల్స్ నిర్వహణ వ్యాపారంలోకి పెద్ద ఎత్తున దిగారు. అమెరికాలో రాంచ్‌హౌస్‌ల పేరుతో.. పొలాల మధ్యలో కట్టుకున్న విశాలమైన ఇళ్లు ఉంటాయి. వాటిని భారత్‌లోని ఫామ్‌హౌస్‌లతో పోల్చవచ్చు. అలాంటి రాంచ్‌హౌస్‌లను కొందరు తెలుగువారు కొనుగోలు చేసి.. వాటిని పెళ్లి వేదికలుగా తీర్చిదిద్దుతున్నారు. నగర జీవితాలకు అలవాటుపడిన వారికి భిన్నమైన వాతావరణం, డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్న అనుభూతిని ఆ రాంచ్‌హౌస్‌లు ఇస్తున్నాయి. కరోనా అనంతర పరిస్థితులో రియల్‌ఎస్టేట్ బూమ్ పెరగడంతో చాలామందితెలుగువారు ఆ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఆ క్రమంలోనే పలువురు ఇలాంటి రాంచ్‌హౌస్‌లను కూడా కొనుగోలు చేశారు. అవన్నీ ఇప్పుడు పెళ్లి వేదికలుగా అక్కరకు వస్తున్నాయి. వాటిలో 30-40వేల డాలర్లలో వేడుక అంతా పూర్తయిపోతోంది. ఎన్నారైలకు ఇది చాలా అందుబాటులో ఉండడంతో ఎక్కువ మంది ఇదే బాటను ఆశ్రయిస్తున్నారు. మరి భారత్‌లో ఉన్న బంధువుల మాట ఏమిటి? వారు పెళ్లి వేడుకలను చూసేదెలా? అంటే.. ఇంటర్‌నెట్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసి, ఆ లోటు లేకుండా చూసుకుంటున్నారు.



### సంప్రదాయానికి లోటు లేదు..

పెళ్లి అమెరికాలో, పరిమితమైన హంగులతో జరుగుతోందనే తప్ప.. సంప్రదాయాలకు మాత్రం ఎలాంటి లోటూ జరగట్లేదు. ఎందుకంటే.. అమెరికాలో పురోహితులు కూడా పుష్కలంగా ఉన్నారు. కించిత్ తేడా లేకుండా వివాహ తంతు మొత్తాన్నీ భారత్‌లో చేసినట్టే జరిపిస్తున్నారు. పెళ్లిళ్ల జోరుతో పురోహితులకు కూడా గిరాకీ బాగా పెరుగుతోంది. వివాహ ఫొటోగ్రఫీ ఒక అనుబంధ వ్యాపారంగా విస్తరిస్తోంది. కొంతమంది.. ఇండియా నుంచి ప్రత్యేకంగా ఫొటోగ్రాఫర్లను పిలిపించుకుంటుండగా, మరికొందరు స్థానికంగా ఉన్నవారితోనే ఫొటోలు తీయించుకుంటున్నారు. ఫొటోగ్రఫీ హాబీఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తక్కువ ధరల్లోనే సేవలందిస్తున్నారు. ఇలా యూఎస్‌లో మనోళ్ల పెళ్లిళ్లు.. యువతరానికి అదనపు ఆదాయ వనరుగానూ మారుతున్నాయి.

- కృష్ణమోహన్ దాసరి, డాలస్

## ఫేస్‌బుక్‌లో భార్య 'సిమెంట్ ఔర్ డ్రమ్' పోస్టు!

- భయపడిపోయిన భర్త..
- ప్రియుడితోనే భార్య ఉండేందుకు అంగీకారం.. యూపీలో ఘటన

బులందర్‌షహర్, మార్చి 19: భార్య ఫేస్‌బుక్‌లో ఉన్న పోస్టులు చూసి ఆమె భర్త జడుసుకున్నాడు! ఈ భార్య నాకు వద్దు బాబోయ్.. నిక్షేపంగా ప్రియుడి ఇంటికి ఆమె వెళ్లిపోవొచ్చు అని అనుమతిచ్చేశాడు! ఆయనలో ఉన్నపళంగా ఎందుకీ మార్పు? అనంటే.. ఆమె ఫేస్‌బుక్ పేజీలో 'సిమెంట్ ఔర్ డ్రమ్', 'నీలా డ్రమ్ ఔర్ సిమెంట్' శీర్షికలతో హత్యా కథనాలు ఉండటమే! అలా అతడు భార్య చేతిలో తన ప్రాణాలను కాపాడుకున్నాడు. బాధితుడు యూపీలోని బులందర్‌షెహార్‌కు చెందిన రాజ్‌కుమార్! అతడికి భార్య, ఆరు నెలల బిడ్డ ఉన్నారు. భార్య తరచూ గొడవపడి అలిగి పుట్టింటికి వెళ్లి.. ప్రియుడితో కలిసి తిరిగేది. భార్య ప్రవర్తనను అనుమానించి.. నిలదీసిన ప్రతిసారి 'ఏమిటీ సాక్ష్యం?' అంటూ ఉల్టా తననే నిలదీసేదని రాజ్‌కుమార్ చెప్పాడు. ఇటీవల ఆమె ఫోన్‌లో మాట్లాడుతుండగా రాజ్‌కుమార్ ఆమె నుంచి చాకచక్యంగా ఫోన్ లాక్కొని చూశాడు. ఫోన్ గ్యాలరీలో కొన్ని నగ్న దృశ్యాలు కనిపించాయి. ఫేస్‌బుక్ ఓపెన్ చేయగా.. హత్యా కథనాలు కనిపించాయి. గత ఏడాది మార్చిలో మీరట్‌లో ముస్కాన్ అనే మహిళ, తన భర్త సౌరభ్‌ను ప్రియుడు సాహిల్‌తో కలిసి హత్యచేసి.. మృతదేహాన్ని 15 ముక్కలుగా నరికి ప్లాస్టిక్ డ్రమ్‌లో ఉంచి పైనుంచి సిమెంట్‌తో కప్పేయడం అప్పట్లో సంచలనమైంది! అయితే భార్య.. ఫేస్‌బుక్‌లో 'సిమెంట్ ఔర్ డ్రమ్' శీర్షికతో హత్యా కథనాన్ని పోస్టు చేయడంతో రాజ్‌కుమార్ హడలిపోయాడు. ఆమెతో కలిసి ఉంటే.. తనను ఎప్పుడు చంపేస్తుందోనని భయపడిపోయాడు. తాను ఎవరితో జీవించాలనుకుంటుందో చెప్పాలని మధ్యవర్తులతో ఆమెను అడిగించాడు. ప్రియుడితోనే కలిసి ఉండాలనుకుంటున్నట్లు ఆమె తేల్చి చెప్పడంతో మరోమాట మాట మాట్లాడకుండా ఓకే చెప్పేశాడు రాజ్‌కుమార్!




Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.